ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 28.09.2024 | సంపుటి : 11 సంచిక : 78 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

హైదరాబాద్‌లో
ఇక బ్యానర్లు,పోస్టర్లు,కటౌట్‌లు

## నిషేధం

**హైదరాబాద్‌(జనంసాక్షి):** నగరంలో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై జీహెచ్‌ఎంసీ నిషేధం విధించింది. వాల్‌ పోస్టర్లతోపాటు గోడలపై రాతలను కూడా నిషేధించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలీ ఉత్తర్వులు జారీ చేశారు.నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## నిబంధనలు గాలికొదిలేశారు

ఢిల్లీలో ఎయిర్‌ క్వాలిటీ కమిషన్‌పై సుప్రీం ఆగ్రహం

**ఢిల్లీ (జనంసాక్షి):** దేశ రాజధానిలో గాలి కాలుష్యాన్ని అరికట్టడంలో ఎయిర్‌ క్వాలిటీ మేనేజ్‌మెంట్‌ కమిషన్‌ విఫలం కావడంపై సుప్రీం కోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది. గాలి నాణ్యత పర్యవేక్షణ,

మిగతా 2లో..





మూసీ కట్టడాలు

# జాతి వారసత్వ సంపద

## పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం

చారిత్రక భవనాలను పరిరక్షిస్తాం.. భావితరాలకు అందిస్తాం : సీఎం రేవంత్‌

- పురాతన బావులు దత్తత తీసుకున్న పారిశ్రామికవేత్తలు
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం తెలంగాణ దర్శిని..

**హైదరాబాద్‌(జనంసాక్షి)**
మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ కు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్‌ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసు కుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని , త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్‌ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్య త్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్‌ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన

మిగతా 2లో..

## చదరంగ క్రీడాకారులకు భారీ నజరానా



అర్జున్‌, హారికలకు రూ.25లక్షల చొప్పన అందించిన సీఎం రేవంత్‌

వార్త 10లో

సీఎం సహాయనిధికి రిలయన్స్‌

## భారీ విరాళం

ముఖ్యమంత్రి రేవంత్‌కు రూ.20కోట్లు అందించిన కంపెనీ ప్రతినిధులు

2లో

మంత్రి పొంగులేటి నివాసాలపై

## ఈడీ సోదాలు



2లో

పలుచోట్ల ఏక కాలంలో దాడులు
ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతో తనిఖీలు

ఇది ముమ్మాటికీ

## రాజకీయ కక్ష సాధింపే

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌ గౌడ్‌ ఆగ్రహం

**హైదరాబాద్‌(జనంసాక్షి):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి ఇంటిపై ఈడీ దాడులు రాజకీయ కక్ష పూరితమైన చర్యలో భాగమేబీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీ లోపాయకారి ఒప్పందంలో భాగంగా ఈ దాడులు జరుగుతున్నవని పిసిసి అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌ గౌడ్‌

మిగతా 2లో..

కొత్త ఒరవడి..

## ప్రజల కోసం గంటల తరబడి..

ప్రజాపాలనలో విన్నపాలు వినవలె..! • గాంధీభవన్‌లో సక్సెస్‌గా మంత్రులతో ముఖాముఖి
పలు సమస్యలపై భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు
4 గంటల పాటు ప్రజల బాధలు విన్న మంత్రి ఉత్తమ్‌
320 అర్జీలు స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

12లో



ప్రజాపాలన కార్యక్రమంలో ఓ వృద్ధురాలి సమస్యను వింటున్న మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి

## ఓఆర్‌ఆర్‌ను అమ్ముకున్నారు

కాంగ్రెస్‌ హయాంలో మొదలైన రహదారిని గత ప్రభుత్వం రూ.7,380 కోట్లకు విక్రయించింది
మూసీ నిర్వాసితులకు అన్యాయం మాట అబద్ధం • పాతబస్తీ మెట్రోను అడ్డుకునే కుట్రలు
బీఆర్‌ఎస్‌ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్‌

**హైదరాబాద్‌(జనంసాక్షి):** కాంగ్రెస్‌ పార్టీ ఔటర్‌ రింగ్‌రోడ్డు నిర్మిస్తే.. గత బిఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.7,380 కోట్లకు అమ్ముకుందని మంత్రి పొన్నం ప్రభాకర్‌ మండిపడ్డారు. భారాస హయాంలో హైదరాబాద్‌పై పెట్టిన ఖర్చు వివరాలపై చర్చకు రావాలని సవాల్‌ విసిరారు. హైదరాబాద్‌ ప్రజల దాహార్తి తీర్చే ప్రయత్నం చేశారా అని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్నా వాటర్‌ లాగింగ్‌ సెంటర్లు అలాగే ఉన్నాయన్నారు. పాతబస్తీలో మెట్రోరైలు నిర్మాణాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. 'మూసీ' నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాం'న్న ప్రతిపక్షం ఆరోపణలను మంత్రి ఖండించారు. మూసీ బఫర్‌ జోన్‌, ఎఫ్టీఎల్‌ను ఎక్కడ ముట్టుకోలేదని మంత్రి పొన్నం ప్రభాకర్‌ స్పష్టం చేశారు. మూసీ ప్రజలకు 10వేల డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను మాజీ మంత్రి కేటీఆర్‌ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో ప్రకటించారని గుర్తుచేశారు. శుక్రవారం సచివాలయం మీడియా పాయింట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ మాట్లాడుతూ... అధికారంలో ఉంటే

మిగతా 2లో..





## మాది నిర్మాణం.. మీది విధ్వంసం

డబుల్‌ ఇళ్ల నిర్మాణమే ఇందుకు సాక్ష్యం: కేటీఆర్‌

**హైదరాబాద్‌(జనంసాక్షి):**
ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలే లక్ష్యంగా హైడ్రా దూసుకుపోతోంది. ఇప్పటికే కొన్ని వందల నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అనేక మందికి నోటీసులు కూడా ఇచ్చారు. తాజాగా మూసి పరిధిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నేసింది. గోల్నాక, చాదర్‌ఘాట్‌, మూసారంబాగ్‌.. మూసి ఆక్రమణల కూల్చివేతలకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో 1,350 మందికి హైడ్రా నోటీసులు

మిగతా 2లో..

## నిన్న ఫ్రాన్స్‌.. నేడు యూకే

భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఉండాల్సిందేనన్న బ్రిటన్‌ ప్రధాని



**లండన్‌(జనంసాక్షి):** ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి భారత్‌ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది. ఈ క్రమంలో బ్రిటన్‌ ప్రధాని సైతం ఇదే విషయాన్ని వెల్లడించారు.భద్రతా మండలిలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని ఈసందర్భంగా యూకే ప్రధాని కైర్‌ స్టార్మర్‌ పేర్కొన్నారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్‌ అసెంబ్లీ 79వ సెషన్‌లో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.'భారత్‌, బ్రెజిల్‌, జపాన్‌, జర్మనీలు శాశ్వత సభ్యదేశాలుగా భద్రతా మండలిలో స్థానం ఉండాలి. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. అలాగే ఎన్నికైన సభ్యులకు ఎక్కువ సీట్లు కేటాయించాలి. భద్రతా మండలిలో

మిగతా 2లో..



అమెరికాలో తుపాకీ హింస నివారణకు ..

## బైడెన్‌ కొత్త చట్టం

**వాషింగ్టన్‌(జనంసాక్షి):** అమెరికాలో తుపాకీ సంస్కృతి నానాటికీ పెరిగిపోతుంది. నిత్యం ఎక్కడోచోట కాల్పులు జరగడం అమాయక పౌరులు మృతి చెందడమో, గాయాలపాలవడమో సర్వసాధారణ అంశంగా మారింది.దీనికి చిన్నారులు సైతం బానిసలవుతున్నారు. ఈ హింసకు అంతం పలకాలనే ఉద్దేశంతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ కొత్త చట్టంపై సంతకాలు చేశారు. అదేవిధంగా ఎన్నికల కారణంగా ఆర్థిక కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా

మిగతా 2లో..

హైడ్రా కమిషనర్‌కు

## హైకోర్టు నోటీసులు

విచారణకు హాజరు కావాలని రంగనాథ్‌కు ఆదేశం

**హైదరాబాద్‌(జనంసాక్షి):**
అమీన్‌పూర్‌ చెరువుకు సంబంధించిన కేసు విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. హైడ్రా కమిషనర్‌ సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.అమీన్‌పూర్‌ చెరువు ఎఫ్‌టీఎల్‌ పరిధిలో

మిగతా 2లో..



ఇజ్రాయెల్‌తో సంబంధాలు

## వదులుకోండి

ముస్లిం దేశాలను కోరిన ఇరాన్‌

**లెబనాన్‌(జనంసాక్షి):** ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి ఉన్నా.. హమాస్‌ను సమూలంగా పెకిలించేవరకు, హెజ్‌బొల్లా విషయంలో తమ లక్ష్యాలను సాధించేవరకు దాడులు ఆగవని ఇజ్రాయెల్‌ ప్రధాని బెంజమిన్‌ నెతన్యాహు ప్రకటనలు చేస్తున్నారు.ఇరాన్‌ మద్దతున్న ఈ గ్రూప్‌లపై అటు గాజాలో, ఇటు లెబనాన్‌లో విరుచుకుపడుతున్నారు. గత కొన్ని రోజులుగా చేస్తోన్న వరుసదాడులతో హెజ్‌బొల్లా కీలక కమాండర్లను కోల్పోతోంది. రెండు వర్గాల మధ్య సంధి కుదిర్చేందుకు అమెరికా, ఫ్రాన్స్‌ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ముస్లిం దేశాలకు ఇరాన్‌ ఓ విన్నపం చేసింది.ఇరాన్‌ రక్షణశాఖ మంత్రి బ్రిగేడియర్‌ జనరల్‌ అజీజ్‌ నాసిర్జాదేహ్‌

మిగతా 2లో..



## నిర్వహణ లోపంతోనే మేడిగడ్డ కుంగింది

- ప్రాజెక్టు డ్యామేజీకి అదే ప్రధాన కారణం
- కమిషన్‌ విచారణలో ఈఎన్సీ హరిరామ్‌ కీలక విషయాలు వెల్లడి

**టెహ్రాన్‌(జనంసాక్షి):** కాళేశ్వరంపై ప్రాజెక్టుపై విచారణ చేస్తున్న జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ ఎదుట గజ్వేల్‌ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్‌ ఎండీ హరిరామ్‌ హాజరయ్యారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పొరేషన్‌ ఆర్థిక అంశాల గురించి హరిరామ్‌ను ప్రశ్నించారు. అలాగే మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజీపై పలు ప్రశ్నలను అడిగారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ దర్యాప్తు వేగంగా జరుగుతోంది. ఇవాళ గజ్వేల్‌ ఈఎన్సీ, కాళేశ్వరం కార్పొరేషన్‌ ఎండీ హరిరామ్‌ను విచారించింది. ప్రాజెక్టు నిర్మాణంపై జస్టిస్‌ పీసీ ఘోష్‌, ఈఎన్సీ హరిరామ్‌ను 90కి పైగా ప్రశ్నలను అడిగారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణ బిల్లుల చెల్లింపులకు ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పొరేషన్‌ ఆర్థిక అంశాలపై సైతం కమిషన్‌ ఆరా తీసింది.శనివారం మరోసారి కమిషన్‌ ముందు హరిరామ్‌ హాజరుకానున్నారు. ఇవాళ సమాధానం చెప్పని ప్రశ్నలకు రేపు డాక్యుమెంట్స్‌ సమర్పిస్తామని ఆయన తెలియజేశారు. విచారణలో జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ ఎదుట హరిరామ్‌, అప్పటి తెలంగాణ సీఎస్‌ ఎస్‌కే జోషి, ఈఎన్సీ మురళీధర్‌ పేర్లను ప్రస్తావించారు. ఇప్పటి వరకు కార్పొరేషన్‌ ద్వారా బ్యాంకులకు 29,737 కోట్ల రూపాయలు వరకు తిరిగి చెల్లించినట్లు వివరణ ఇచ్చారు. బ్యాంకుల నుంచి తీసుకున్న డబ్బుల్లో 64 వేల కోట్ల రూపాయలు గుత్తేదారులకు చెల్లింపులు జరిగాయని ప్రస్తావించారు .కార్పొరేషన్‌ ఫైనాన్షియల్‌ స్టేట్‌మెంట్లను ప్రభుత్వానికి ఇచ్చామని, అది శాసనసభలో పెట్టారా? లేదా? అనేది తనకు ఏమీ తెలియదని హరిరామ్‌ వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ డామేజ్‌కు బాధ్యులు



మిగతా 2లో..

## సిద్ధరామయ్యపై లోకాయుక్త కేసు

ముడా స్కాం వ్యవహారంలో నమోదు

**బెంగళూరు(జనంసాక్షి):** మైసూరు అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ (ముడా) భూముల వ్యవహారం లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు

మిగతా 2లో..

## యూపీలో అమానుషం

స్కూల్‌ ప్రతిష్ఠ పెంచుకునేందుకు క్షుద్రపూజలు
విద్యార్థిని బలి ఇచ్చిన యాజమాన్యం

2లో

## మాజీ రక్షణమంత్రికి జపాన్‌ పగ్గాలు

**టోక్యో(జనంసాక్షి):** జపాన్‌ ప్రధానమంత్రి ఫుమియో కిషిద వారసుడిగా మాజీ రక్షణమంత్రి షిగెరు ఇషిబా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన అధికార లిబరల్‌ డెమోక్రటిక్‌ పార్టీ (ఎల్‌డీపీ)

మిగతా 10లో..

రాజకీయాల్లో

## రాహుల్‌ డిఫరెంట్‌..

అత్యంత నిజాయితీగల నేత: సైఫ్‌ అలీఖాన్‌

**ముంబై(జనంసాక్షి):** కాంగ్రెస్‌ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌ గాంధీపై బాలీవుడ్‌ నటుడు సైఫ్‌ అలీ ఖాన్‌ ప్రశంసలు కురిపించారు. ఆయన ఎంతో ధైర్యవంతుడైన రాజకీయ నాయకుడని అన్నారు. ప్రజల్లో తన ఇమేజ్‌ను మరింత పెంచుకునేందుకు రాహుల్‌ తనను తాను ఎంతో సంస్కరించుకున్నారని పేర్కొన్నారు. ఓ జాతీయ మీడియా నిర్వహించిన చర్చా వేదికలో సైఫ్‌ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నేతల గురించి చర్చ రాగా.. 'ఎలాంటి నాయకుడిని ఇష్టపడతారు?' అంటూ వ్యాఖ్యాత అడిగారు. దీనికి సైఫ్‌ బదులిస్తూ.. 'ధైర్యంగా, నిజాయతీగా ఉండే రాజకీయ నాయకులంటే ఇష్టం' అని చెప్పారు. అప్పుడు వ్యాఖ్యాత కొందరు పేర్లను సూచించారు. 'ప్రధాని మోదీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్‌

మిగతా 2లో..





## కొండా లక్ష్మణ్‌కు సీఎం ఘనంగా నివాళి

హైదరాబాద్,సెప్టెంబర్27(జనంసాక్షి): స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పలువురు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించచారు. చిత్రంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి ఉన్నారు. ఇదిలావుంటే ఆచార్యకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు నివాళి అర్పించారు. తొలిదశ ఉద్యమంలో ఆయనది కీలక భూమికి అని కొనియాడారు.

## రాష్ట్రంలో టూరిజం మహోన్నతంగా అభివృద్ధి చెందాలి

**బెస్ట్ టూరిజం అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొన్న ఉప్పల**



**హైదరాబాద్(జనంసాక్షి):** పినాకిని యూత్ అసోసియేషన్ ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ది అన్మోల్ కాంటినెంటల్ హోటల్ సైపాబాద్ లో మురళి మోహన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బెస్ట్ టూరిజం అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు అందజేసి మాట్లాడుతూ అవార్డులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.మన రాష్ట్రంలో టూరిజం ఇంకా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు.తను టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా వున్నప్పుడు టూరిజం డెవలప్మెంట్ కోసం నిరంతరం కృషి చేశాను అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్య గురు కళారత్న లయన్ భారతి మెంబర్ కేంద్ర గీత నాటక అకాడమి సభ్యులు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నూ ఢిల్లీ , బంద్రు సుబ్బా రావు సీఎండీ సీల్ వేల్, సినీ దర్శకులు చంద్ర మహేష్ , ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రామచంద్ర రావు, మహేశ్వర్ రావు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కన్సల్టెంట్ బెస్ట్ టూరిజం అవార్డ్ గ్రహీతలు అహమ్మద్ ఆలి , కోదండ పాణి బోగ రఘురాం విలాస్ కవి సమ్మేళనం డా.రాధ కుసుమ కవయిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారు

ఒకలా.. అధికారం కోల్పోతే మరోలా తాము మాట్లాడమని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. మూసీ రివర్ బెడ్ నివాసాల సర్వే జరుగుతుందని.. అక్రమ కట్టడాలు అయినా.. ఇళ్లను కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తామని చెప్పారు. ఎన్నికలకు ముందు రింగ్ రోడ్డును రూ. 7వేల కోట్లకు అమ్ముకుంది గత బీఆర్ఎస్ పార్టీ కాదా! అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కృష్ణా, గోదావరి నీళ్లు ఒక్క టీఎంసీ అయినా తెచ్చారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో చేసింది ఏంటి అంటే శూన్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను డిస్టర్బ్ చేయలేదని అన్నారు. గతంలో హైదరాబాద్‌లో భారీ వర్షాలు వస్తే రూ. 10వేలు బీఆర్ఎస్ కార్యకర్తలు పంచుకొని చేతులు దులుపుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ప్రజలపై మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రేమ ఉంటే నన్ను కలిసి మీ అభిప్రాయం పంచుకోండి. రాబోయే రోజుల్లో రూ. 5500 కోట్లతో మూసీకి గోదావరి నీరు తెచ్చే ఆలోచన చేస్తున్నాం. ఒళ్లు, నాలుక దగ్గర పెట్టుకుని వాస్తవ విమర్శ చేయాలి..లేదంటే పర్యవసానం తప్పదు! బీజేపీ - బీఆర్ఎస్ పార్టీలు తాన అంటే తందాన అని అంటుఅన్నాయి. సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. హైదరాబాద్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బీజేపీ - బీఆర్ఎస్ పార్టీల నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అమెరికాలో తుపాకీ హింస నివారణకు

## బైడెన్ కొత్త చట్టం

ఉండేందుకు స్టాప్‌గ్యాప్ బిల్లుపై సంతకం చేశారు. ఈ బిల్లు ఆధారంగా డిసెంబరు 20 వరకు ప్రభుత్వానికి నిధులు అందుతాయని ది గార్డియన్ నివేదించింది. ఇక, మరో రెండు నెలల్లో అధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్న తరుణంలో ఈ బిల్లుపై సంతకాలు చేయడం గమనార్హం.'అమెరికాలో వ్యాధులు, ప్రమాదాల కారణంగా మృతి చెందుతున్న చిన్నారుల కంటే.. తుపాకీల కారణంగా చోటుచేసుకుంటున్న మృతుల సంఖ్య ఎక్కువ. ఇది చాలా బాధాకరమైనది. ఈ హింసను అంతం చేయడానికి నేను, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ కృషి చేస్తున్నాం. మీరు మాతో చేతులు కలపండి' అని బైడెన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా తుపాకీ హింసను అరికట్టేందుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై తాను సంతకాలు చేసినట్లు బైడెన్ వెల్లడించారు.యూఎస్‌లో తీవ్రమైన తుపాకీ హింస ఉంది. ముఖ్యంగా పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో కాల్పుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. గత ఏడాది అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ నిర్వహించిన పరిశోధన ప్రకారం.. 2020లో 4,368 మంది పిల్లలు తుపాకీ కారణంగా మృతి చెందారు. ఇక, 2019లో ఆ సంఖ్య 3,390గా ఉండగా.. 2021లో 4,752కు చేరింది. 2020 నుంచి అమెరికాలో పిల్లల మరణాలకు ప్రధాన కారణం తుపాకీ హింసగా ఈ డేటా వెల్లడించింది.ఇటీవల జార్జియాలోని పాఠశాలలో జరిగిన కాల్పుల్లో నలుగురు మృతిచెందగా.. తొమ్మిది మంది గాయపడిన విషయం తెలిసిందే. ఇక, 2007లో వర్జీనియా టెక్‌లో కాల్పుల కారణంగా 30 మందికిపైగా మరణించిన అత్యంత ఘోరమైన ఘటన చోటుచేసుకుంది. గత రెండు దశాబ్దాలలో పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో వందలాది కాల్పులు జరిగాయి. ఈ హింసలు యూఎస్ తుపాకీ చట్టాలు, రాజ్యాంగం రెండవ సవరణపై తీవ్ర చర్చకు దారితీసింది. ఈ చట్టం ప్రకారం.. ఆయుధాలను కలిగిఉండే హక్కు ఉంది.

### కేరళలో మరో మంకీపాక్స్ కేసు

**మలప్పురం(జనంసాక్షి):** ప్రపంచ దేశాల్లో కలకలం సృష్టించిన ప్రాణాంతక మంకీపాక్స్ (ఎంపాక్స్) కేసుల సంఖ్య భారత్‌లో మూడుకు చేరింది. కేరళలో మరో మంకీ పాక్స్ కేసు నమోదైనట్లుగా ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.ఎర్నాకుళం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మంకీపాక్స్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు. అతడి నమూనాలను పరీక్షల కోసం పంపించగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

# 'మూసీ' కట్టడాలు జాతి వారసత్వ సంపద

సీఐఐ కి సూచించారు.ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానా పూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు.

**పురాతన బావులు దత్తత తీసుకున్న పారిశ్రామికవేత్తలు**

నగరంలో పురాతన మెట్ల బావు లను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు



అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహా లఖా మెట్ల బావి పునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావిని దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నది.

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం తెలంగాణ దర్శిని..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందు కోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని తీసుకువచ్చినట్లు సీఎం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌తో రోష్ని నాడార్ మల్హోత్రా భేటీ

**సిఎంను కలిసిన జపాన్ రాయబారి**

**హైదరాబాద్,సెప్టెంబర్27(జనంసాక్షి):** :సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో టెక్నాలజీ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఫ్యూచర్ సిటీ నిర్మాణం, స్కిల్ వర్సిటీ ఏర్పాటుపై సిఎం వివరించారు. అలాగే సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నైలోని జపాన్ కాన్సుల్-జనరల్ టకాహషి మునియో మర్యాదపూర్వకంగా కలిసారు. హెచ్‌సిఎల్ కొత్త క్యాంపస్‌లోఇందులో అదనంగా 5 వేల మంది ఇంజనీర్లకు ఉద్యోగాలను కల్పించనుంది. శుక్రవారం సచివాలయంలో హెచ్సీఎల్ టెక్నాలజీస్ ఛైర్ పర్సన్ రోష్ని నాడార్ మల్హోత్రా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవానికి రావా లని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. విద్యార్థులకు మెరుగైన శిక్షణతో పాటు, విద్యా వనరులను విస్తరించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో హెచ్సీఎల్ భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువకులకు ప్రయోజనం చేకూర్చే నైపుణ్యాభివృద్ధికి హెచ్‌సిఎల్‌తో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధి అవకాశాల కల్పనకు హెచ్సీఎల్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. హెచ్‌సిఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుందని అన్నారు. హెచ్సీఎల్ వ్యూహాత్మక భాగస్వామ్యం యువతకు ఉద్యోగాలను కల్పించ టంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుం దని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో యు వతకు నైపుణ్యాలను నేర్పించి సాధికారత కల్పించేం దుకు చేపట్టే కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని రోష్ని నాడార్ అన్నారు. ఉపాధి అవకాశాలతో పాటు సాంకేతిక సామర్థ్యాలను పెంపొందిస్తుందని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంతో తమ కంపెనీ భాగస్వామ్యం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి అభ్యాసకులకు సాధికారత కల్పిస్తుందని అన్నారు. ఔత్సాహిక సాంకేతిక నిపుణులను తయారు చేస్తుందని చెప్పారు. స్కిల్ యూనివర్శిటీతో పాటు హెచ్‌సిఎల్ విద్యా కార్యక్రమాలను తెలంగాణలో ఉన్న ఇతర విశ్వవిద్యాలయాలకు విస్తరించే ప్రణాళికలు, దీంతో ఎక్కువ మంది లబ్ధి పొందుతారనే ఆలోచనలను కూడా ఈ సమావేశంలో పంచుకున్నారు.

## సీఎం సహాయనిధికి రిలయన్స్ భారీ విరాళం

– ముఖ్యమంత్రి రేవంత్‌కు రూ.20కోట్లు అందించిన కంపెనీ ప్రతినిధులు

హైదరాబాద్(జనంసాక్షి): వరద బాధితుల సహాయార్థం విరాళాలు అందుతున్నాయి. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళాన్ని అందజేసింది. రూ.20 కోట్ల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు అందజేశారు. శుక్రవారం ఉదయం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి ఎం ఎస్ ప్రసాద్, బోర్డు సభ్యులతో పాటు తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రిలయన్స్ గ్రూప్ మెంటార్ పి వి ఎల్ మాధవరావులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి ఆయనకు రూ.20 కోట్ల చెక్కును అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరద సంభవించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఖమ్మం జిల్లా పూర్తిగా నీట మునిగింది. అనేక మంది ఇళ్లను కోల్పోయారు. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు చిరంజీవి, బాలకృష్ణ, ఎన్టీఆర్, మహేశ్ బాబు, సాయిధరమ్‌తేజ్, విశ్వక్‌సేన్ సహా పలువురు విరాళాలు అందించారు.

## నిన్న ఫ్రాన్స్.. నేడు యూకే

తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకు ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకుసాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్టం చేయాలి. అందులోభాగంగా శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి' అని స్టార్మర్ పేర్కొన్నారు. ఇక, భద్రతామండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్‌లు మద్దతు పలికారు.ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా భద్రతామండలి ఏర్పడి ఏడున్నర దశాబ్దాలు దాటింది. ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ శాశ్వత సభ్యదేశాలుగా ఉండగా.. మిగితావి తాత్కాలిక సభ్య దేశాలుగా రొటేషన్ పద్ధతిపై మారుతున్నాయి. ఇక, భారత్ ఎప్పటినుంచో శాశ్వత సభ్యత్వానికి పట్టుపడుతోంది. భద్రతా మండలిలోని ఐదింట నాలుగు దేశాలు భారత్‌కు అనుకూలంగా ఉన్నా.. ఒక్క చైనా మాత్రం మోకాలడ్డుతోంది.

## ఇజ్రాయెల్‌తో సంబంధాలు వదులుకోండి

మాట్లాడుతూ.. ముస్లిం దేశాలు ఇజ్రాయెల్ తో దౌత్యపరమైన సంబంధాలు తెంచుకోవాలని కోరారు. ఆ దేశ దౌత్యవేత్తలను బహిష్కరించాలని అడిగారు. అలాగే నెతన్యాహు ప్రభుత్వంపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ ముందు లొంగిపోవద్దని యెమెన్‌కు చెందిన హూతీ చీఫ్ అబ్దుల్ మాలిక్ కూడా హెచ్చరించారు. ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా ఘర్షణను ఆపేందుకు అమెరికా, ఫ్రాన్స్, ఇతర దేశాలు చేసిన 21 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తిరస్కరించారు. లెబనాన్‌పై పూర్తిశక్తితో విరుచుకుపడాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. "ఇజ్రాయెల్ విధానం సుస్పష్టం. మేం మా లక్ష్యాలను సాధించేవరకు దాడులు ఆపం. హెజ్‌బొల్లా దాడుల కారణంగా ఉత్తర ఇజ్రాయెల్‌ను ఖాళీ చేసిన పౌరులు తమ నివాసాలకు తిరిగి వెళ్లడం మాకు కీలకం" అని నెతన్యాహు తెలిపారు. హెజ్‌బొల్లా ఆయుధాలను దాచిన బెకా లోయనూ ధ్వంసం చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. తాజా దాడిలో హెజ్‌బొల్లాకు చెందిన డ్రోన్ యూనిట్ కమాండర్ ప్రాణాలు కోల్పోయారు.

## నిబంధనలు గాలికొదిలేశారు

వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పంట వ్యర్థాలను కాల్చడం విషయంలో.. ఎటువంటి కమిటీలు ఏర్పాటు చేయలేదని, గతంలో కమిషన్ చెప్పినవన్నీ గాల్లో మాటలుగా కనిపిస్తున్నాయని పేర్కొంది. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణకు మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం కమిషన్‌కు ఉందని సూచించింది."పంట వ్యర్థాల సమస్యను పరిష్కరించడానికి కనీసం ఒక్క కమిటీ కూడా వేయలేదు. ప్రతి ఏటా ఈ సమస్యను చూస్తుంటే సీఏక్యూఎం చట్టం అమలు కావడం లేదని తెలుస్తోంది. కమిటీలు ఏర్పాటు చేశారా? చట్ట ప్రకారం ఏం చర్యలు తీసుకున్నారో కనీసం ఒక్కటైనా చూపించండి. ఢిల్లీ ఎన్‌సీఆర్ రాష్ట్రాలకు గతంలో చెప్పినవన్నీ గాల్లో మాటలుగానే మిగిలినట్లు కనిపిస్తోంది" అని సీఏక్యూఎంను సుప్రీం ధర్మాసనం నిలదీసింది.

## మాది నిర్మాణం.. మీది విధ్వంసం

జారీ చేసింది. ఇప్పటికే ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో ఇళ్లను హైడ్రా మార్క్ చేసింది. అయితే హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. హైడ్రా టార్గెగా మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్దాలు అనడానికి మరో సాక్షం ఇదే అంటూ పేర్కొన్నారు. మేము నిర్మిస్తే - మీరు కూల్చేస్తున్నారు.. మాది నిర్మాణం - మీది విధ్వంసం.. లక్షల నిర్మాణాలు మావి - లక్షల కూల్చివేతలు మీవి. మూసి నది సాక్షిగా ఇదిగిదిగో మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్దాలు అనడానికి మరో సాక్షం ఇదే. కట్టలేదన్నారు - ప్రజలను మభ్యపెట్టాం అన్నారు - మరి లక్ష ఇండ్లు రాత్రికి రాత్రికి ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాయి చిట్టి.. మీ పాలనలో మీ అధికారులే మీ టేబుల్ ముందు పెట్టిన డబుల్ లెక్కలు చూసి మతిపోతుందా.. కేసీఆర్ నిజం, అయన హామీలు నిజం ఆయన మాట నిజం అని తెలిసి మింగుడుపడటం లేదా. మీ జూటా మాటలు, మీ కుట్రలకు, మీ దిమాక్ తక్కువ పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు ఇవ్వాళా కేసీఆర్ నిర్మాణాలే దిక్కయ్యాయి. కేసీఆర్ లక్ష డబుల్ నిర్మాణాలు నిజం - కేటాయింపులు నిజం. మీ నాలుకలు తాటి మట్టాలు కాకుంటే ఇంకో సారి అబద్దాలు మాట్లాడకండి' అంటూ ట్వీట్ చేశారు.

## రాజకీయాల్లో రాహుల్ డిఫరెంట్..

కేజ్రీవాల్, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లో ఎవరిని ఎంచుకుంటారని అడిగారు.దీనికి సైఫ్ స్పందిస్తూ.. "వాళ్లంతా ధైర్యవంతులైన రాజకీయ నాయకులే. అయితే, రాహుల్‌గాంధీ తీరు నన్ను కాస్త ఎక్కువగా ఆకట్టుకుంటోంది. గతంలో ఆయన చేసే పనులను, చెప్పే మాటలను కొంతమంది అగౌరవపర్చిన సందర్భాలున్నాయి. అలాంటి స్థితి నుంచి ఆయన తనను తాను ఎంతగానో మార్చుకున్నారు. ప్రజల్లో ఆదరణ చూరగొనేందుకు చాలా కష్టపడ్డారు. ఆ ప్రయాణం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది" అని సైఫ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.తాజాగా 'దేవర' సినిమాలో భైర పాత్రలో ఆకట్టుకున్నారు సైఫ్. ఎన్టీఆర్ అడ్డు తొలగించుకొని సంద్రాన్ని శాసించాలనుకొనే పాత్రలో ప్రేక్షకులను మెప్పించారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నేడు విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఎన్టీఆర్, సైఫ్‌ల మధ్య యాక్షన్ సన్నివేశాలు మరో స్థాయిలో ఉన్నాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

### హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

ఉందని ఇటీవల ఓ భవనాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వాలని సూచించిన హైకోర్టు.. నేరుగా లేదా ఆన్‌లైన్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

# మంత్రి పొంగులేటి నివాసాలపై ఈడీ సోదాలు

**– పలుచోట్ల ఏక కాలంలో దాడులు**

**– ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతో తనిఖీలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం ఏకకాలంలో 15 చోట్ల తనిఖీలు చేస్తోంది. గత ఎన్నికల సమయంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన ఇల్లు, ఫామ్‌హౌజ్ తదితర ఐదు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన కుమారుడు హర్ష రెడ్డికి కస్టమ్స్ అధికారులు నోటీసులు ఇచ్చారు. సింగపూర్ నుంచి చెన్నై పోర్టుకు ఖరీదైన వాచ్‌లు వచ్చినట్లు గుర్తించారు. అలోకం నవీన్ కుమార్ మధ్యవర్తిగా ఫహెర్దీన్ ముబీన్ నుంచి వాచ్‌లను హర్ష కొనుగోలు చేసినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. విచారణలో అలోకం నవీన్ రూ.100 కోట్ల విలువైన వస్తువులు స్మగ్లింగ్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై మనీలాండరింగ్ సహా మరో కేసు నమోదు చేసిన ఈడీ విచారణ చేపట్టింది. కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టింది. ఖమ్మంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఇంటిలో రైడ్స్ కొనసాగుతున్నాయి. ఢిల్లీ జోనల్ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. నారాయణ పేట- కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి సంబంధం లేదని తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జరుగుతున్న రైడ్స్ దానికి కొనసాగింపు అని తెలుస్తోంది. పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి చిన్న వయస్సులోనే బిలియనీర్‌గా మారారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ వ్యవహారాలను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. హర్ష రెడ్డి పేరుతో రూ.1300 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇది చర్చానీయాంశం అవుతుంది. ఆ క్రమంలో వరసగా ఈడీ రైడ్స్ జరగడం చర్చకు దారితీస్తోంది.

### ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపే

మండిపడ్డారు. " 2014 నుండి ఈడీ జరిపిన దాడుల్లో 96శాతం పైగా ప్రతిపక్షాల మీద జరిగిన దాడులేరాజకీయంగా లబ్ది పొందడానికి ఫేక్, పాల్స్ కేసులు పెడుతున్నారుభయపెట్టడానికి ఈడీ, సీబీఐ ని వాడుకుంటున్నారురాజ్యాంగం మీద మాకు పూర్తి నమ్మకం ఉందిమేము రాజ్యాంగ బద్దంగా ఎదురుకొంటాం.హైడ్రా లో నష్ట పోతున్న బీద ప్రజానీకాన్ని మా ప్రభుత్వం ఆదుకుంటుంది.ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న బడా బాబుల,రియల్టర్ల దగ్గర నుండి రాబట్టడానికే ఈ హైడ్రాపదేండ్లలో బీఆర్ఎస్ చేసిన ఋణమాపి సొమ్ము ఎంత?.తొమ్మిది నెలల్లో మా ప్రభుత్వం చేసిన రుణమాఫీ సొమ్ము ఎంత ?హరీష్ రావు కు ఛాలెంజ్ చర్చకు సిద్ధమా..?" అని ప్రశ్నించారు. కాగా మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ సోదాలపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకులను భయపెట్టడానికి, మానసిక స్థైర్యాన్ని దెబ్బ కొట్టడానికి చేస్తున్న కుట్రని ఆయన విమర్శించారు. సోనియా గాంధీని, రాహుల్‌నుకూడా భయపెట్టడానికి నిరంతరం ఈడీ దాడులు చేస్తున్నారని తెలిపారు.కర్ణాటకలో డీకే శివకుమార్‌పై కూడా దాడి జరిగిందని తెలిపారు. దీని వల్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమి లేదని, బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎలాంటి చెడ్డ పేరు లేకుండా మంచి వ్యాపారవేత్తగా పేరున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై దాడులను తీవ్రంగా ఖండించారు. అన్ని రాష్ట్రాలలో ఆర్థికంగా బలపడిన కాంగ్రెస్ నాయకులు, ప్రతిపక్ష నాయకులపై దాడులు జరుగుతున్నాయని, ఇది బీజేపీ మార్క్ రాజకీయానికి పరాకాష్ట అని విమర్శించారు.

## యూపీలో అమానుషం

**స్కూల్ ప్రతిష్ఠ పెంచుకునేందుకు క్షుద్రపూజలు**

**విద్యార్థిని బలిఇచ్చిన యాజమాన్యం**

**లఖ్‌నవూ(జనంసాక్షి):** ఉత్తర్‌ప్రదేశ్ లోని హాథ్రస్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. క్షుద్ర పూజలకు రెండో తరగతి చదువుతోన్న విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు.పాఠశాల ప్రతిష్ఠను పెంచుకునేందుకు యాజమాన్యమే అతడిని బలి ఇచ్చింది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హాథ్రస్‌లోని ఒక ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఒక విద్యార్థిని బలి ఇచ్చిందని వెల్లడించారు. స్కూల్ హాస్టల్‌లో అతడిని చంపేశారని తెలిపారు. ఈ వారం ప్రారంభంలో జరిగిన ఈ ఘోరం తాజాగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల డైరెక్టర్ తండ్రి బ్లాక్ మ్యాజిక్‌ను విశ్వసిస్తాడని తెలిపారు. తొలుత స్కూల్ బయట ట్యూబ్‌వెల్ సమీపంలో ఆ పిల్లాడిని చంపాలనుకున్నారని, అయితే హాస్టల్ నుంచి బయటకు తీసుకెళ్తున్నప్పుడు అతడు భయంతో కేకలు వేయడంతో గొంతు నులిమి హత్యచేశారని పోలీసు వర్గాలు వెల్లడించాయి.విద్యార్థి తండ్రి చేసిన ఫిర్యాదు ప్రకారం.. సోమవారం పాఠశాల యాజమాన్యం నుంచి అతడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. తన కుమారుడు అనారోగ్యానికి గురయ్యాడని వారు సమాచారం ఇచ్చారన్నారు. కారులో డైరెక్టర్ తన బిడ్డను ఆసుపత్రికి తీసుకెళ్లాడని సిబ్బంది వెల్లడించారు. తర్వాత ఆ కారులో తన కుమారుడి మృతదేహం కనిపించిందని చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోన్న పోలీసులు బ్లాక్ మ్యాజిక్‌కు సంబంధించిన వస్తువులను గుర్తించారు. డైరెక్టర్, అతడి తండ్రి, ముగ్గురు టీచర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే.. ఈ నెల ప్రారంభంలో తొమ్మిదేళ్ల విద్యార్థిని ఇలాగే బలి ఇవ్వాలని ప్రయత్నించారని తెలిపారు.

## సిద్ధరామయ్యపై లోకాయుక్త కేసు

**ముడా స్కాం వ్యవహారంలో నమోదు**

ఎదుర్కొంటోన్న సీఎం సిద్ధరామయ్య కు రోజురోజుకు కష్టాలు ఎక్కువవుతున్నాయి. శుక్రవారం ఆయనపై లోకాయుక్త కేసు నమోదు చేసింది. రెండురోజుల క్రితం కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆ ఎఫ్ఐఆర్‌లో సిద్ధరామయ్యను ప్రథమ నిందితుడిగా పేర్కొంది. ఆయన సతీమణి పార్వతి, బావమరిది మల్లికార్జున్ స్వామితో పాటు మరోవ్యక్తి పేరు నిందితుల జాబితాలో చేర్చింది.'ముడా' స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె.అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్ ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుల మేరకు ఆగస్టు 16న సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించగా.. దానిని గవర్నర్ తోసిపుచ్చారు. దాంతో సీఎం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది.ఈ భూకుంభకోణం సమగ్ర దర్యాప్తులో భాగంగా సిద్ధూను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడం చట్టబద్ధమేనని న్యాయస్థానం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. అదే సమయంలో కర్ణాటక లోకాయుక్త అధికారి ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించగా.. తాజాగా కేసు నమోదైంది.

## నిర్వహణ లోపంతోనే మేడిగడ్డ కుంగింది

ఎవరని ఘోష్ కమిషన్, హరిరామ్‌ను ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో గేట్స్ ఆపరేషన్, మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడమే ప్రధాన కారణమన్న హరిరామ్, 2017 సంవత్సరం నాటి ఉన్నత స్థాయి కమిటీ మినట్స్?ను కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఫాలో కాలేదని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ అధికారులను ప్రశ్నించింది. కమిషన్ ముందు కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్? అకౌంట్ చీఫ్ ఫణిభూషణ్ శర్మ హాజరయ్యారు. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా వారి నుంచి పలు వివరాలపై ఆరా తీసింది.


**రేషన్ షాప్ ఆథరైజేషన్ ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది**

నేను అనగా **శ్రీమతి గంగుల స్వప్న w/o సైదులు** అనునా యొక్క రేషన్ షాప్ ఆథరైజేషన్ ఒరిజినల్ సర్టిఫికెట్ నంబర్ **F2/1398/2009.R.c.No 23.**26/09/2024 తేదీన హుజూర్ నగర్ నుంచి నేరేడుచర్ల వెళ్ళుతుండగా ఆర్టీసీ బస్‌లో పోయినది.కావున దొరికిన వాళ్ళు ఈ క్రింది ఫోన్ నెంబర్:9381939698 ఫోన్ చేయగలరు.

# బహుజన సూర్యుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- పాస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్



**హనుమకొండ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ పాల్గొన్నారు. ముందుగా కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ దేశమంతటా స్వాతంత్రం వచ్చి ఆనందోత్సవాలు జరుపుకుంటే తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం పాలన లో ప్రజలంతా ఇబ్బందిపడ్డారు. నిరంకుశ నిజాం వ్యతిరేక తెలంగాణ ఉద్యమ నాయకుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరని అన్నారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి ఎంతగానో కృషి చేసిన బహుజన సూర్యుడు బాపూజీ అని కొనియాడారు. నాడు తెలంగాణ ఉద్యమానికి తన ఇంట్లో నుండే బీజం వేసినారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలినటువంటి త్యాగనిరతుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కూ ను అడుగులు పడుతుంటే బాడుగ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు బీసీలను మోసం చేశాయని, అన్ని పార్టీలు ఓట్ల కోసం మాత్రమే బీసీలను వాడుకుంటున్నారని, కేసీఆర్ ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు తగ్గించి మూల్యం చెల్లించిందని గుర్తు చేశారు. గెలుపు గుర్రాల పేరుతో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు సముచిత న్యాయం జరగడం లేదని అవకాశవాద వైఖరిని దుయ్యబట్టారు. బీసీలంతా ఐక్యతగా ఉంటే రాబోయే రోజుల్లో బీసీ రాజ్యాధికారం వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ రాష్ట్ర నాయకులు మెరుగు బాబు యాదవ్, పాస్ నాయకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, పెరుమండ్ల వెంకటేశ్వర్లు గౌడ్, మోటె చిరంజీవి, గీస గోని కిరణ్ కుమార్ గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక రాష్ట్రం కోసం బాపూజీది అలుపెరగని పోరాటం

- కొండా లక్ష్మణ్ బాపూజీకి బాలల హక్కుల సంక్షేమ సంఘం నివాళులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలు అలుపెరుగని పోరాటం చేసిన మహ నీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ కొనియాడారు. మలి దశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేసిన మహనీయుడని అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని జిల్లెలగూడ మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల సమర్పించి వారికి నివాళులు అర్పించారు. బహు భాషా కోవిదుడైన బాపూజీ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని వారన్నారు. వారి ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని అన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్‌ది కీలక భూమిక

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



**గోదావరిఖని, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** స్వాతంత్ర సమరయోధుడు, తొలి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని.. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని, స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని, దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కొమరంభీం జిల్లా, వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారు. 1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా లక్ష్మణ, తర్వాత 1967,1972లో భువనగిరి నుంచి అసెంబ్లీకి ప్రాతినిథ్యం వహించారు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణ కోసం ఉద్యమించి, ఉద్యమకారులతో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష, ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారని వారి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ లు రవీందర్, అజయ్ బాబు, ఆర్ఐ దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, వామన మూర్తి, సంపత్, సూపరిండెంట్ ఇంద్ర సేనా రెడ్డి, మనోజ్ కుమార్ , సంధ్య , సీపీఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతన్నకు బాసటగా ప్రజా ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** రైతన్నకు బాసటగా ప్రజా ప్రభుత్వం ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..శుక్రవారం వేములవాడ పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి వేములవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశనికి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు... రాష్ట్ర ప్రభుత్వం సన్నపురకాల వడ్లకు 500 బోనస్ ప్రకటిస్తుందని తెలిపారు..వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ భూసార పరీక్షలు నిర్వహించి వాటికి అనుగుణంగా వంగడాలను అందించాలని పేర్కొన్నారు.. వడ్ల కొనుగోలు సమయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తుందని, సహకార సంఘాలు వాణిజ్య బ్యాంకులకు దీటుగా వాటితో పోటీపడుతూ రుణాలు మంజూరు చేస్తుందని రైతులకు పైచేయు ఉండడానికి సహకార సంఘాల బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. రుణమాఫీ చేసే విషయంలో రేషన్ కార్డు కుటుంబానికి ప్రామాణికంగా తీసుకున్నప్పుడు రేషన్ కార్డు లేకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఇందులో ఆధార్ కార్డు తప్పుల వలన, బ్యాంకర్లు వివరాలు తప్పుగా పంపడం వలన,రేషన్ కార్డ్ లేకుండా కుటుంబంలో సాంకేతిక లోపం వలన,బ్యాంకర్లు గతంలో తండ్రి పేరు పై ఉంటే తదుపరి తండ్రి విదేశాల్లోకి వెళితే వారి కొడుకు పేరు పైన రుణాలు రీ షెడ్యూల్ చేయడం వలన సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడ్డాయనీ పేర్కొన్నారు,సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ వారి నుండి దరఖాస్తులు స్వీకరించడానికి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు.. మొన్నటి బడ్జెట్లో రాజన్న ఆలయానికి 50 కోట్లు కేటాయించిందని, పట్టణంలో రోడ్డు వెడల్పు, బ్రిడ్జ్ ల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి కుడి చెరువులో మూల వాగులో మురికి నీరు కలవకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షులు ఏనుగు తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు , రైతులు,తదితరులు ఉన్నారు

# ఉద్యోగులపై దాడులు చేస్తే చట్టరీత్యా చర్యలు

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 27(జనంసాక్షి) :** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరైనా దాడులు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం తాడ్వాయి మండలం దామరువాయి అటవీ ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వినోద్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శరత్ చంద్రులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం అమానుషమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వ ఉద్యోగుల భద్రతపై ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సంఘటనపై పోలీస్ శాఖ అధికారులు కేసు నమోదు చేశారని, దాడి చేసిన వారిని త్వరలోనే గుర్తించి చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# గురువును మించిన దైవం లేదు

- ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీంద్రరావు



**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 27(జనం సాక్షి):** ఉపాధ్యాయ వృత్తి కంటే ఉన్నతమైన వృత్తి ఏది లేదని, గురువే దైవమని, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు అన్నారు. పిఆర్టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జంగిలికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుత్తోమాల మురళీధర స్వామి ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, ఈ రోజు అనేక రంగాలలో రాణిస్తున్న ప్రముఖులందరూ ఒకప్పుడు ఉపాధ్యాయులు చెక్కిన శిల్పాలేనని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సహజమని ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక, సంఘసేవ కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజ అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. ఉపాధ్యాయులందరూ బావి సమాజ నిర్మాణంలో పాల్పడి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తమ పాత్రను పోషించాలని అన్నారు. మురళీధర్ స్వామి అభ్యుదయ భావజాలం కలిగిన వ్యక్తిని ఆయన అనేకమంది విద్యార్థులను ఉన్నతులు గా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా నుండి ఉమ్మడి వరంగల్ జిల్లా వరకు అనేక పాఠశాలలో చేసిన మురళీధర స్వామి ఏ పాఠశాలలోనైనా తనదైన ముద్ర వేసి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడ్డాడని ఆయన అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంగా ఉంటూ కుటుంబ అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్టీయుటీఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు సంక బద్రి నారాయణ మాట్లాడుతూ మురళీధర్ స్వామి పి ఆర్ టి యు సంఘసేవ చేశారని, సంఘ నిర్మాణంలో ఆయన పాత్ర అమోఘమని అన్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా, జిల్లా బాధ్యులుగా, రాష్ట్ర బాధ్యులుగా అనేక హోదాల్లో పనిచేసి సంఘ నిర్మాణానికి దోహదపడ్డానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నినేని వెంకన్న, ఎడ్ల వేణు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, పిఆర్టియు మహబూబాబాద్ మండల శాఖ అధ్యక్షులు భూక్యా రామోజీ నాయక్, ప్రధాన కార్యదర్శి కే సుజాత , రాష్ట్ర నాయకులు ఉపేందర్ రెడ్డి, బి.గీత తదితరులు పాల్గొన్నారు.

# గోవింద్రాలలో గిరిజన వికలాంగ యువకుడి హత్య



**కామేపల్లి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** గిరిజన వికలాంగ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని గోవింద్రాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గోవింద్రాల గ్రామానికి చెందిన వికలాంగ గిరిజన యువకుడు ఆలోత్ బావ్ సింగ్ (జగన్) 35 సంవత్సరాలు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అక్క బావ దగ్గర ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన నలుగురు యువకులు బావ్ సింగ్ ను గోవింద్రాల బంజర గ్రామ సమీపంలో ఉన్న హైస్కూల్ పరిసర ప్రాంతానికి తీసుకెళ్లి అందరు కలిసి మద్యం తాగి బావ్ సింగ్ ను గొడ్డలితో దారుణంగా హత్య చేసి అక్కడే పడేసి వెళ్లినట్లు తెలిసింది. బావ్ సింగ్ హత్యకు గురైన సమాచారం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం ఖమ్మం నుండి పోలీస్ జాగిలాలను తీసుకు వచ్చారు. హత్య కు గల కారణాలు తెలుసుకునేందుకు గ్రామంలో విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే హత్యతో సంబంధం ఉన్న కొందరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. దీనిపై సింగరేణి రూరల్ సీఐ తిరుపతి రెడ్డిని వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# ఓయూలో విమలక్క బహుజన బతుకమ్మ సంబరాలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీలో విమలక్క సారథ్యంలో బహుజన బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 15 ఏండ్లుగా ఉద్యమంగా మెదలై తెలంగాణలో బతుకమ్మ ప్రాధాన్యత, ప్రకృతి అందాలతో కూడిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జరిపే ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ 2024లో ఆడపిల్లలు, మహిళలు స్వేచ్ఛగా జీవించేలా సమాజం బాధ్యత తీసుకోవాలని, పంచ భూతాలు లేకుంటే మానవ మనుగడ సాధ్యం కాదని, అమ్మను కూడా పంచభూతాల్లో ఒకరిగా గుర్తుంచుకోవాలని, ఆది పరాశక్తిగా భావిస్తూ అరాచకాలను పారద్రోలాలని ఆకాంక్షించారు. ఆడబిడ్డల గౌరవాన్ని కాపాడాల్సి బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని విమలక్క అన్నారు. ఈ సంబరాల్లో వివిధ రంగాల ప్రముఖులు, విదేశీ మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.



# కాకతీయుల చరిత్రపై అవగాహన అవసరం

- వరంగల్ నగరాన్ని పర్యటక రంగంగా మరింత అభివృద్ధి చేయాలి..
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు..
- జిల్లా కలెక్టర్ తో కలిసి పాల్గొన్న ఎంపీ కావ్య..



**వరంగల్ ప్రతినిధి:సెప్టెంబర్ 27(జనంసాక్షి) :** వరంగల్ నగరాన్ని పర్యటక రంగంగా మరింత అభివృద్ధి చేసి చారిత్రాత్మక విశిష్టతను అందరికీ తెలిసేలా అవగాహన పరచాలని ఎంపీ కడియం కావ్య జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. శుక్రవారం షప్రపంచ పర్యాటక దినోత్సవం ను పురస్కరించుకొని వరంగల్ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ కోటలో ఏర్పాటు చేసిన వేడుకలలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి తో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశం లో ఎం పి కడియం కావ్య మాట్లాడుతూ గొప్ప చరిత్ర కలిగిన వరంగల్ నగరాన్ని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కొత్త ప్రదేశాల సందర్శన వల్ల విజ్ఞానం తో పాటు చారిత్రక అంశాలపై వాస్తవిక దృక్పదం అలవడుతుందని విహార యాత్రలు వినోదం కోసమే కాకుండా విజ్ఞాన సాధనలుగా, అనుభవ సారాలుగా మారాయన్నారు. చారిత్రక విశిష్టత లు కలిగిన ఓరుగల్లు ప్రాంతం లో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, కాకతీయుల సామ్రాజ్యంలో ఓరుగల్లు నగరం రాజధానిగా విలసిల్లిందని కాకతీయులు నిర్మించిన అద్భుత ఆలయాలు, గొలుసుకట్టు చెరువులున్నాయని వాటికీ పూర్తి స్థాయి గుర్తింపు లభించడం లేదని పర్యాటక రంగంలో వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం అవసరమైన నిధులు మంజూరు చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక రంగాలలో పర్యాటక రంగం ప్రముఖ పాత్ర వహిస్తుందని పర్యాటక రంగం పట్ల అవగాహన కలిగి సంస్కృతులను గౌరవించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లాలో గల పర్యాటక ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి కాకతీయుల చరిత్ర తో పాటు శిల్ప సౌందర్యం అద్భుతమైన కళా ఖండాల ప్రాశస్త్యం పట్ల అవగాహన కలిగిఉండాలన్నారు. హాస్పిటాలిటీ సెక్టార్‌లో నైపుణ్యం కలిగిన టూరిస్ట్ గైడ్‌లుగా, వాలంటీర్లుగా విద్యార్థులను తీర్చిదిద్దడం చాలా అవసరం అన్నారు. ప్రతి కళాశాల, పాఠశాల ఒక ప్రత్యేక టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేసి క్లబ్‌ల పనితీరుపై బాధ్యత వహించేలా ఫ్యాకల్టీ, స్టూడెంట్ కో-ఆర్డినేటర్‌లను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఖిలా వరంగల్ ఖుష్ మహల్ నుండి మధ్య కోట శిల్పాల వరకు నిర్వహించిన ర్యాలీలో ఎంపి కలెక్టర్ అధికారులు, టూరిజం యూత్ క్లబ్ సభ్యులు, ఎన్‌సిసి క్యాడేట్‌లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా టూరిజం అధికారి శివాజీ, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సమ్మెత శాఖల అధికారులు, పాఠశాల కళాశాలల అధ్యాపకులు, యూత్ టూరిజం క్లబ్ సభ్యులు, ఎన్సిసి క్యారెట్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి పని వారిని చేసుకోనీయండి



తెలంగాణలో అధికారులను, ముఖ్యంగా పోలీస్ వ్యవస్థను ఎవరి పని వారు చేసే పరిస్థితి కనిపించడం లేదు! దీనికి కారణం ఎమ్మెల్యేలు, మంత్రుల జోక్యం! వారి దయా, దాక్షిణాల మీద ఆధారపడి ఉండడమే! ఏదో పిడికెడు మంది తప్ప మెజారిటీ లో ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే పోకల్ పాయింట్ లలో పోస్టింగ్ లు ఉంటాయి. గత తొమ్మిది ఏండ్ల బిఆర్ఎస్ పాలనలో అయితే అధికారులను 'లాయి లప్పల్లా ' వాడుకున్నారు. 'షోలే 'సినిమాలో జైలర్ పాత్రలోని అస్రాని డైలాగ్ లా ' హమారే ఇషారే బినా పరిందాభి పర్ నహీ మార్ సక్తా అనే పరిస్థితి ఉండేది!పోస్టింగ్ లు అన్నీ డబ్బులతో, పైరవిలతో కూడుకున్నవి అయిపోయాయి! వారు ఎవరి ని అరెస్ట్ చేయమంటే, వారిని చేయాలి, ఎవరి మీద కేసు పెట్టమంటే పెట్టాలి! కొందరు నిజాయితీ గల అధికారులు అయితే ప్రస్తుతం తమ అంతరాత్మను చంపుకుని పని చేసే పరిస్థితి ఉన్నది.

**సీఎం ఇచ్చిన స్వేచ్ఛనా..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన స్వేచ్ఛనా, లేక కంట్రోల్ లేక పోవడమా! కారణం ఏదైనా కొంత పరిస్థితి అదుపు తప్పుతున్నది అనక తప్పదు!మొత్తం అధికారం ఉంటే అన్నీ విభాగాలు తమ జాగీరు లా కొందరు వ్యవహరిస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో తాము ఏం చెబితే అది చేయాల్సిందే! అనే విధంగా కొందరు ప్రజా ప్రతినిధుల అనుచరవర్గం వ్యవహారిస్తున్నది. ఇక్కడ, అక్కడ అని కాదు రాష్ట్రంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉన్నది.తమ వ్యవహారం వల్ల ప్రభుత్వం బద్నాం అవుతుంది, పార్టీ బద్నాం అవుతుంది, అనే సోయి లేకుండా ఉండడం ఆందోళనకరం,జనం ఓట్ల రూపంలో ప్రజాప్రతినిధులకు పెట్టిన 'బిక్ష 'అధికారం, అనే ఇంగితం లేకుండా ఉన్నది.

**మినీ ప్రజా దర్బార్లు పెట్టండి**

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మీద జనం లోకి వెళ్లి చెప్పడం, ఎక్కడెక్కడ లబ్దిదారులకు సక్రమంగా ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయా, లేదా, చూడడం, ఆయా ప్రాంతాల సమస్యలు, ప్రజల మనోభావాలు, వారి కష్టాలు పరిశీలించడం, స్వయంగా వెళ్లి అడిగి తెలుసు కోవడం, లేదా మినీ ప్రజా దర్బార్లు పెట్టి ఆయా మండలాల్లో, పట్టణాల్లో ప్రజల సమస్యలు తీసుకుని పరిష్కరించడం, అన్ని విభాగాల, ఇంక్లూడింగ్ పోలీస్ ల పని తీరును పరిశీలించడం, రాజకీయ జోక్యం లేకుండా ఎవరి పనిని వారు నిజాయితీగా చేసుకునే స్వేచ్ఛ ఇవ్వడం లాంటివి లేనేలేవు! అంతా ఆగమాగం!లేడికి లేసిందే పరుగు మాదిరి వ్యవహారం తగదు!ప్రజల మనోభావాలకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి, మాటలకు చేతలకు చాలా తేడా ఉన్నది!బ్యాలెన్స్ గా, రాజకీయ పార్టీ లకు అతీతంగా పని చేయాల్సిన అధికారులను డిస్టర్బ్ చేస్తున్నారు. విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించాల్సిన అవసరం ఉన్నది!ఎవరు అవునన్నా కాదన్నా నేల మీది నిజం ఇది!జిల్లాలలో పరిస్థితి ని చూడండి.

**నిజాయితీ అధికారులకు స్వేచ్ఛ ఇవ్వండి**

అభివృద్ధి, సంక్షేమం, శాంతి భద్రతల విషయంలో,అందులో భాధ్యతగా, నిజాయితీ గా పని చేస్తున్న అధికారుల మీద ఒత్తిడి లేకుండా ఉండాలి! ప్రభుత్వ కార్యాలయాల్లో కూర్చుని నీవు, ఇట్ల పని చెయ్యి, ఆ నిధులు, అటు పెట్టు, ఇటు పెట్టు, అంటూ అధికారులను ఆదేశించే స్థాయి కి కొందరు చోటా, మోటా నేతలు ఎమ్మెల్యే ల వద్ద తయారు అయ్యారు, అనే ఆరోపణలు కూడ ఉన్నాయి. ఇలాంటి వాటిని కూడ అదుపులో పెట్టాలి!అందరికీ సమన్యాయం లభించే విధంగా ఒక సిస్టం ను అభివృద్ధి చేయాలి!సీఎం జీ జరా బీ అలర్ట్! (ఎవరికి వర్తిస్తే వారికే..)



**ఎండి. మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్,**
**విశ్లేషకులు, 9951865223**

# బెడిసి కొడుతున్న ఐడియా టెస్టింగ్



**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్,**
**విశ్లేషకులు**
**9951865223**



బీజేపీ ఐడియా టెస్టింగ్ రాజకీయం బెడిసి కొడుతున్నది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఒక బీజేపీ ఎంపీ, కొందరు నేతలు ఈ సారి తమకు 400 ఎంపీ సీట్లు ఇస్తే రాజ్యాంగం మార్చేస్తామని బహిరంగంగా పేర్కొన్నారు. ఇప్పుడు హర్యానా ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సినీనటి, బీజేపీ ఎంపి, కంగనా రణావత్ రైతులు 378 రోజులు ఆందోళన చేసి, 750 మంది ఊపిరి వదిలిన అనంతరం పీఎం మోడీ స్వయంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను మళ్ళీ అమలు చేస్తామని పెద్ద ప్రకటన చేశారు.

**కంగనాతో బీజేపీకి తిప్పలు :** అసలే రైతులకు కంగనా అంటే కోపం, రైతుల ఆందోళన సందర్భంగా అభ్యంతరకర అమె వ్యాఖ్యల కు నిరసనగా ఎయిర్ పోర్ట్ లో ఈ నటి చెంప దెబ్బ తిన్నది. ఇప్పుడు ఈ చట్టాల ముచ్చట చెప్పి ఆదిష్టానంతో చివాట్లు తిని,తప్పు అయ్యిందని చెప్పుకున్నది. గతంలో బీజేపీ నేత ఒకరు ఒడిశా లోని జగన్నాడు పీఎం మోడీ శిష్యుడు అని చెప్పి, తప్పు అయ్యిందన్నాడు. ఇదంతా ఒక రకంగా చూస్తుంటే బీజేపీ మనసులో ఉన్నమాటలను ఒక ఐడియా టెస్టింగ్ టూల్ కిట్ అనిపిస్తుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పీఎం మోడీ కూడ తన పుట్టుక బయాలేజికల్ కాదు, అని, తనతో ఈశ్వరుడు మాట్లాడుతాడని చెప్పుకున్నారు. కాంగ్రెస్ గెలిస్తే స్త్రీల మంగళ సూత్రాలు లాక్కుంటారని, బర్రెలను తీసుకెళుతారని, ఇంకా ఏమేమో ఒక పీఎం స్థాయి వ్యక్తి మాట్లాడకూడని మాటలు మాట్లాడారు. 400 సీట్లు ఖాయం అన్నారు.

**వందరోజుల యాక్షన్ ప్లాన్ ఏది? :** అధికారంలోకి రాగానే మొదటి వందరోజుల్లో అద్భుత యాక్షన్ ప్లాన్ అమలు చేస్తాము, అన్నారు.అన్నీ బెడిసి కొట్టి, 240 సీట్లకే బీజేపీ పరిమితం అయి, యునైటెడ్ జనతా దళ్, టీడీపీ పొత్తు, మద్దతు తో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ని చూసాము! హర్యాణాలో పరిస్థితి గమనించి మాట్లాడుతున్నట్లు కనిపించింది. కాంగ్రెస్ గెలిస్తే హర్యాణ ప్రగతి దెబ్బతింటుంది అని, కాంగ్రెస్‌లో అంతర్గత గొడవలే ఎక్కువ ఉంటాయని, ఉపాధి మీద ప్రభావం ఉంటుందని, కుల రాజకీయం కొనసాగుతుందని, రాష్ట్రం నాశనం అవుతుందని పేర్కొన్నారు. ఇక మీడియా విషయానికి వస్తే కాంగ్రెస్‌కు వ్యతిరేక గాలి కనిపించినపుడు,డిబేట్ల మీద డిబేట్ లు ఉంటాయి. ఇప్పుడు అక్కడ బీజేపీ వ్యతిరేక గాలి ఉంది. కంగనా రైతు వ్యతిరేకం మాటలు, కుస్తీ బిడ్డ వినేష్ పొగట్ కాంగ్రెస్ నుంచి ఎన్నికల రంగం లో ఉన్న ప్రభావం, రైతులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కావడం లాంటివి ప్రస్తుతం కాంగ్రెస్‌కు ప్లస్ పాయింట్‌గా ఉన్నాయి.బీజేపీ ఐడియా



టెస్టింగ్‌లకు కాలం చెల్లింది.

**హర్యాణను పీఎం అమెరికాలో చూశారట.. :** నిజానికి హర్యాణ నృత్యంను తాను అమెరికాలో చూసాను అని, చెప్పుకున్న పీఎం మోడీ, హర్యాణ నుంచి ఇండియాలో ఉద్యోగాలు లేనికారణంగా ఉపాధి కోసం వెళుతున్న పరిస్థితి గురించి చెప్పలేదు. ఒకవైపు మెక్సికో తర్వాత ఇండియా నుంచే ఎక్కువ అక్రంగా అమెరికాకు వస్తున్నారని అమెరికా చెబుతున్న విషయం మీద పీఎం మాట్లాడరు? డంకీ రూపంలో ఇండియా నుంచి బయటికి ఎందుకు వెళ్లాల్సిన పరిస్థితి గురించి చెప్పరు!

లక్ష 50 వేల జీతాలు ఇస్తామని హర్యాణ నుంచి యువకులను తీసుకుని వెళ్లి జీతం కూడ తక్కువ ఇస్తూ, మజ్దూర్ పనులు చేయిస్తున్న విషయం చెప్పరు. ఇజ్రాయిల్‌కు నిరుద్యోగులను పంపడానికి రోథక్‌లో కౌంటర్ ఎందుకు ఓపెన్ చేశారు? పీఎం చెప్పరు! వ్యవసాయ భూమి తగ్గున్నది అంటారు, ప్రత్యామ్నాయం చెప్పరు! వర్గీకరణ జరిగితే ఎక్కువ ఉపాధి కలుగుతుంది అనే వారు, ఎంతమంది దళితులకు ఉపాధి కల్పించారో చెప్పలేదు. హర్యాణలో రైతులు, నిరుద్యోగులు, ముఖ్యంగా జాట్లు వ్యతిరేకం గా ఉన్నారు.

**ఎదురీదుతున్న బీజేపీ :** ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ హర్యాణ, అటు జమ్మూ కాశ్మీర్ లోనూ ఎదురు ఈదుతున్నది!ఐడియా టెస్టింగ్ వ్యూహం ఫెయిల్ కావడమే కాదు,బెడిసి కొడుతున్నది అంటే అతిషయోక్తి కాదు!హర్యాణ యువత విదేశాల్లో పడుతున్న వెతలు స్వయంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్వయంగా చూసి, వారితో కలిసి వచ్చారు. ఇక్కడికి వచ్చి వారి కుటుంబ సభ్యులను కూడ కలిశారు. ఇదంతా బీజేపీ నేతలకు మింగుడు పడడం లేదు!నేల మీది నిజం ను రాహుల్ గాంధీ చెబుతున్న తీరు చాలా బాగుంటున్నది.స్టాటిస్టిక్స్ తో సహా రాహుల్ జనం ముందు ఉంచుతున్నారు. హర్యాణ బీజేపీ చేయి జారి పోతుందని గుర్తించినందుకే కాంగ్రెస్ మీద, ప్రధానంగా రాహుల్ గాంధీ మీద విమర్శలు చేస్తున్నారు.

## సంకీర్తన

నగరంలో కరోనా తరువాత నూతన
భూతం ప్రవేశించింది
పెను సంక్షోభం పట్టణం చుట్టూ
అలుముకున్నది
సంక్షేమాల గ్యారంటీలు
ఉట్టినెక్కి దాక్కున్నవి
అందని ద్రాక్షలా ఊరిస్తున్నవి
హైడ్రా మదగజం విధ్వంస
అవతారమెత్తింది
నిరుపేదల నివాస గృహాలు హరిస్తున్నది
ధనమదాందుల బంగ్లాల కొమ్ము కాస్తున్నది
రక్త సంబంధీకులకే దేవుడి నంటున్నది
సాఫీగా సాగిపోతున్న జనజీవన ప్రవంతిలో
జన విగాత అగాధం ఏర్పడింది
ఈ ఘటనలతో ప్రభుత మురిసిపోతూ....
మా ప్రజా సేవను తిలకించండని
విర్రవీగుతున్నది
ప్రతిదినం సంచలనాలతో ఊరేగుతున్నది
నియంతలుప్రజల శాపనార్థాలనుప్రియంగా
భావిస్తారు ఏమో?!
గూడు కోల్పోయిన వారి గోడు వినే
నాథుడు లేని
అరణ్య రోదనగా మారింది హైదరాబాద్
రక్షక బటుల వీర విహారం వర్ణించడం
అనన్య సామాన్యమే?
అందమైన నగరంలో శిథిల సౌందర్యమే
మనకు అగుపించేది
తలతిక్క నేతల వలన ఆర్తనాధాలే
మిగిలేవి?
ఆకలి తీర్చేవారు లేక అన్నమో?
రామచంద్రే మన సంకీర్తన

**నమిలి కొండ నాగేశ్వర్ రావు**
**8688553470 మేడ్చల్**

# రాబీస్ నియంత్రణ సాధ్యమేనా?

ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు అరవై వేలమందికి పైగా రాబిస్ మరణాలు నమోదవుతున్నాయి. అంటార్కిటికా మినహా అన్ని ఖండాలలో ఈ వ్యాధి ఉంది. రాబిస్ వ్యాధికి సంబంధించిన మరణాలు ప్రపంచ జిడిపిపై ప్రభావం చూపుతున్నాయి. దీనిపై ప్రపంచవ్యయం 860 కోట్ల యుయస్ డాలర్లగా ఉంది. ఇక మనదేశం రేబిస్ మరణాలకు నిలయంగా మారింది. ఏడాదికి 18000 నుండి 20000 రేబిస్ మరణాలు సంభవిస్తున్నాయి. ఇవి ప్రపంచ రేబిస్ మరణాలలో 36 శాతానికి సమానం. మన దేశంలో రాబిస్ కేసులు మరణాలలో 30 నుండి 60 శాతం 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలోనే నమోదవుతున్నాయి. జాతీయ వైద్య పాలసీ (ఎన్ హెచ్ పి) ప్రకారం 2005 నుండి 2020 మధ్య మొత్తం 2863 రాబిస్ కేసులు నమోదయ్యాయని తెలిపింది. నాలుగింట మూడు వంతుల కేసులు ఐదు రాష్ట్రాలలో ఉన్నాయి. పశ్చిమబెంగాల్లో 43శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్లో 10శాతం, మహారాష్ట్రలో 8శాతం, కర్ణాటకలో 7శాతం, ఢిల్లీలో 6శాతం నమోదయ్యాయి. జాతీయ రాబిస్ నియంత్రణ కార్యక్రమం (ఎన్ ఆర్ సి పి) నివేదిక అనుసరించి 2012 నుండి 2022 మధ్య కాలంలో రాబిస్ కేసులు 6644 గా ఉన్నాయి. అండమాన్ నికోబార్, లక్షద్వీప్ దీవులను మినహాయించి, దేశవ్యాప్తంగా రేబిస్ కేసులు నమోదవుతున్నాయి. ఈ హెచ్చు తగ్గులు అధిగమించడానికి మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి నిజసమయ డేటాను సేకరించడానికి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫారమ్ మనదేశంలో ప్రారంభమైంది.

**కారణాలు:**

రాబిస్ అనేది మానవులతో సహా ఏదైనా క్షీరదాన్ని ప్రభావితం చేసి వైరల్ జంతువుల నుండి జంతువులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. ఈ వ్యాధి సోకిన జంతువుల లాలాజలం ద్వారా వ్యాపిస్తుంది. వైరస్ శరీరంలోకి ప్రవేశించి వెన్నుపాము నుండి మెదడుకు సోకి మరణానికి కారణమవుతుంది. దాదాపు 96 శాతం మరణాలు కుక్కకాటుకు సంబంధించినవే. రాబిస్ వ్యాధి ఉన్న కుక్కలు, నక్కలు, తోడేళ్లు, పిల్లులు, ఎలుగుబంట్లు, కోతులు మనిషికి కరిచినచో ఈ వ్యాధి మనుషులకు వస్తుంది. ఈజబ్బుతో బాధపడుతున్న ఏ జంతువైనా మనుషులకు కరిస్తే రేబీస్ వైరస్ బాహ్య నాడీమండలము ద్వారా కేంద్రనాడీమండలం చేరి వ్యాధి లక్షణాలు కలుగజేయును. గబ్బిలం నుండి వ్యాపించే రేబిస్ ఇంతవరకు మనదేశంలో నివేదించబడలేదు. ఏ క్షీరదమైనా ఈ వ్యాధికి గురికావచ్చును. కొన్ని సమయాలలో గాలిలో ఈ వైరస్ ఎగిరి వ్యాపించే



జనంసాక్షి

అవకాశమూ ఉంది. వైరస్ పొదగడానికి 9 రోజులనుండి 90 రోజులు పడుతుంది. మన శరీరము పై మెదడుకు ఎంత దగ్గరగా కరిస్తే అంత తొందరగా వ్యాధి మెదడుకు చేరే అవకాశముంది. రాబిస్ వాస్తవంగా వంద శాతం ప్రాణాంతకం. జంతువులలోనైనా, మనుషులలోనైనా ఈ వ్యాధి కనిపిస్తే చనిపోవడం తప్ప మందులేదు. పిచ్చికుక్క కరిచిన వెంటనే టీకాలు వేసుకుంటే ప్రమాదమేమీ ఉండదు. నూటికి నూరుపాళ్లు సురక్షితము

**వ్యాప్తి లక్షణాలు:**

రేబిస్ నరాలకు, మెదడుకు సంబంధించిన వ్యాధి. మెదడులో 'ఎన్-సెఫలైటిస్' అనే ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలను కలుగజేస్తుంది. ఈ జబ్బుకు రెండు రూపాలు ఉన్నాయి. ఉత్తేజకరమైన ప్రవర్తన, భ్రాంతులు, సమన్వయం లేకపోవడం, హైడ్రోఫోబియా (నీటి భయం), ఏరోఫోబియా (స్వచ్ఛమైన గాలి భయం) ఉంటుంది. కార్డియో-రెస్పిరేటరీ అరెస్ట్ కారణంగా కొన్ని రోజుల తర్వాత మరణం సంభవిస్తుంది. ఇంకొకటి గాయపడిన ప్రదేశం నుండి కండరాలు క్రమంగా పక్షవాతానికి గురవుతాయి. కోమా నెమ్మదిగా అభివృద్ధిచెంది మరణం సంభవిస్తుంది.

**నివారణ:**

ఈ వ్యాధి నివారణకువిస్తృత నిఘా, నిర్వహణ వ్యూహాలతో పాటు బహుళ రంగాల సహకారం అవసరం. ఈ సమస్యను పరిష్కరించడానికి భారతదేశం 2030 నాటికి రేబిస్ వ్యాధిని తొలగించడానికి జాతీయ కార్యక్రమాన్ని (ఎన్ఆర్సిపి) రూపొందించింది. 2005 నుండి 2020 సం. మధ్యలో రాబిస్ కేసులు ఒక కోటి జనాభాకు 2.36 నుండి 0.41 వరకు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ఎన్ఆర్సిపి మనుషులకు, కుక్కలకు టీకాలు వేయించడం, ప్రజలలో అవగాహన కల్పించడం కుక్కల జనాభా నిర్వహణ, అంతర్ విభాగ సమన్వయం వంటి వ్యూహాలను అనుసరిస్తోంది. మనదేశం ప్రపంచ ఆరోగ్య సంస్థ త్రైపాక్షిక కూటమి, ప్రపంచ జంతు ఆరోగ్య సంస్థ, ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ సహకారంతో 'వన్ హెల్త్' విధానాన్ని ఉపయోగించి రేబిస్ మరణాలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇవి కేసులు లేదా మరణాల సంఘటనల తగ్గుదలకు దోహదం చేసినప్పటికీ కార్యాచరణ సవాళ్లు, నిధుల కొరత, ప్రజలలో సామాజిక స్పృహ లేకపోవడం లాంటివి పెద్ద అవరోధాలుగా నిలుస్తున్నాయి.

గబ్బిలాలు, కోతులు వంటి ఇతర వాహకాల పాత్రను అర్థం చేసుకోవడం, పరిష్కరించడం కూడా కీలకం. కొన్ని ప్రాంతాలలో, ఈ జాతులు రాబిస్ వైరస్ రిజర్వాయర్‌లుగా కూడా పనిచేస్తాయి. వన్ హెల్త్ కెపాసిటీ పద్ధతులను అవలంబించడం వలన భారతదేశం యొక్క రాబిస్ నియంత్రణ ప్రయత్నాలను గణనీయంగా మెరుగుపరచవచ్చు. దేశంలో రేబిస్ సమస్యను పరిష్కరించడానికి జాతీయ వైద్య మిషన్ సెంట్రల్ సెక్టార్ స్కీమ్‌గా 03.10.2013న జరిగిన స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ సమావేశం ద్వారా జాతీయ రేబిస్ నియంత్రణ కార్యక్రమం ఆమోదించబడింది.

2030 నాటికి మానవ రాబిస్ నిర్మూలనకు మార్గం సుగమం చేయవచ్చు. సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా వీధి కుక్కలను నియంత్రించాలి. మానవులలో రాబిస్ మరణాలు తక్షణ తగిన వైద్య సంరక్షణ ద్వారా 100% నివారించబడతాయి. కుక్కలకు టీకాలు వేయడం అనేది ప్రజలలో రాబిస్‌ను నివారించడానికి అత్యంత తక్కువ ఖర్చుతో కూడుకున్న వ్యూహం. కుక్కలు ఇతర జంతువులకు టీకాలు వేయడం రేబిస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, ఏదైనా జంతువు కాటు వేసినవెంటనే అప్రమత్తమై వైద్య సహాయం తీసుకోవడం లాంటి చర్యల ద్వారా రేబిస్‌ను నివారించగలిగి సురక్షితమైన దేశాన్ని సృష్టించగలము.



**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ 8247045230**

# ప్రపంచ శాంతికి ఊతం ఇస్తున్న పర్యాటకం

ప్రపంచ పర్యాటక రంగానికి ఊతం ఇవ్వడానికి 27 సెప్టెంబర్ 1970న తీసుకున్న తీర్మానం ప్రకారం అంతర్జాతీయ టూరిజం సమాజం 'ఐరాస వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్, యుయన్‌డబ్ల్యూటిఓ'ను ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించడంతో ప్రతి ఏట 27 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'ప్రపంచ పర్యాటక దినం (వరల్డ్ టూరిజం డే)' పాటించుట 1980 నుంచి ఆనవాయితీగా మారింది. పర్యాటకంతో ప్రపంచ దేశాల, ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ ఉపాధుల విలువలు ప్రభావితం అవుతాయనే అవగాహనను కల్పించేందుకు 'ప్రపంచ పర్యాటక దినం' వేదికలను వినియోగిస్తారు. 1997 నుంచి 'వరల్డ్ టూరిజం డే' వేడుకలను ఒక్కోదేశంలో నిర్వహిస్తూ, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మంది ఉద్యోగుల్లో ఒక్కరు పర్యాటకరంగానికి సంబంధించిన ఉద్యోగాల్లోనే ఉన్నారని అంచనా.

**ప్రపంచ పర్యాటక దినం - 2024 థీమ్:**

సృజనశీల వినూత్న భావనలు, డిజిటల్ విప్లవ ఫలాలతో టూరిజం పరిశ్రమ రూపు రేఖలు ఆసాంతం మారిపోయాయి. వరుస విపత్తులతో అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రపంచ దేశాల సామాజిక, ఆర్థికరంగాలు కుదేలై చితికి పోయాయి. కరోనా విపత్తు వల్ల ప్రపంచ టూరిజం 4 ట్రిలియన్లు నష్టపోయిందని అంచనా వేశారు. పర్యాటక పరిశ్రమలోని మిలియన్ల ఉద్యోగాలను కరోనా మింగేసింది. విపత్తు మబ్బులు పూర్తి తొలగిన వేళ నేడు ప్రపంచ పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతున్నది. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినం-2024 నినాదంగా "పర్యాటకం - ప్రపంచ శాంతి (టూరిజమ్ అండ్ పీస్)" అనే థీమ్ తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. 'ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'లో ప్రముఖమైన పేదరిక నిర్మూలన, ఆకలిని అంతం చేయడం, లింగ సమానత్వం, ఆర్థిక ప్రగతి లాంటివి సాధించడానికి పర్యాటకరంగం కూడా ఎంతగానో దోహదపడుతుందని గమనించాలి.

**పర్యాటక పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి:**

ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా పర్యాటకానికి పేరుంది. గత కొన్ని ఏండ్లుగా ప్రపంచ పర్యాటకం అనేక రేట్లు పెరగడం, ఆధునిక హంగులు తొడగడం చూశాం. 1950లో అంతర్జాతీయ పర్యాటకులు 5 మిలియన్లు (2 బిలియన్ల డాలర్ల రెవెన్యూ) నమోదు కాగా, 2019లో 1.3 బిలియన్ల (1,260 ట్రిలియన్ డాలర్ల రెవెన్యూ) వరకు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. గ్లోబల్ డిజీపీలో పర్యాటక పరిశ్రమ 10 శాతంగా ఉందని అంటున్నారు. ప్రతి ఏట ప్రపంచ పర్యాటకాభివృద్ధి 3 శాతం పెరగాలని లక్ష్యం చేసుకున్నారు. పర్యాటక పరిశ్రమ ఊపులో ఉన్న భారత్‌లో దేశ జిడిపీలో 9.2 శాతంగా ఉంటూ అతి వేగంగా విస్తరిస్తోంది. దేశ పర్యాటక పరిశ్రమలో 43 మిలియన్ల ఉద్యోగులు పని చేస్తూ, ప్రతి ఏట 10 మిలియన్లకు పైగా విదేశీ పర్యాటకులతో దినదినాభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా ఉత్తర భారతం నుంచి దక్షిణం వరకు వెలసిన విలక్షణ జన జాతులు, విభిన్న సంస్కృతులు, వారసత్వ సంపదలు, ప్రకృతి పరిచిన అందాల విందులు, పుణ్య తీర్థయాత్రలు, అద్భుత కట్టడాల రమణీయతలు, పర్యాటకంతో ప్రపంచ శాంతి, సోదర భావం, సాంస్కృతిక వినిమయం, పరమత సహనం లాంటి ముఖ్య అంశాలు సిద్ధిస్తాయి.

**దేశీయ పర్యాటకం:** ఇండియాలోని యూపీ (అయోధ్య), కేరళ, ఉత్తరాఖండ్, హిమాచల్ లాంటి రాష్ట్రాలు పర్యాటకం మీదనే అధికంగా ఆధారపడి ఉన్నాయి. అంతర్జాతీయ విమానాయాన రంగంతో మొదలు అతి చిన్న గ్రామీణ బడుగు కుటుంబాల వరకు అందరినీ అక్కున చేర్చుకొని పర్యాటకులకు ఆహ్లాదాన్ని, స్థానికులను ఉపాధులను ప్రసాదిస్తున్న పర్యాటక పరిశ్రమ మళ్ళీ తేరుకొని, పుంజుకొని మిలియన్ల కుటుంబాల్లో నవ్వుల పువ్వులు పూయించాలని కోరుకుందాం. ప్రతి ఒక్కరం జీవితంలో తరుచుగా పర్యాటక ప్రణాళికలు వేసుకొని, పర్యాటకుడిగా ఆనందానుభూతులు పొందుతూ, పలువురికి ఉద్యోగ ఉపాధుల కల్పనలో పరోక్షంగా దోహదపడదాం. విశ్వ రహస్యాలు, దర్శనీయ స్థలాలు, ప్రకృతి అందాలు తెలుసుకునేందుకు ప్రయాణాలకు సిద్ధం అవుదాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## మూడో ప్రపంచ రాజ్యాలు ఏకం కావాలి

సోవియట్ రష్యా పతనంతరం ప్రపంచంలో ఏకైక అగ్రరా జ్యాం గా అమెరికా ప్రపంచ రాజకీయ లల్లో ఆధిపత్యం కొనసగంపు ఎక్కువ అయింది.అలీన దేశా లు రెండు కూటముల నుండి స్వాసంత్ర్యం తో తమ పాత్ర నిర్వహించుట లేదు గల్ఫ్ రాజ్యాలలో కూడా పెట్రోల్ పై కన్ను వేసి ఇరాన్ ఇరాక్ మధ్య యుద్ధం జరిగే పరిస్థితులు కల్పించి ఆయుధాలను అమ్మ డమేపనిగాపెట్టుకొంది.ఉక్రెయిన్ విషయం లో కామన్ వెల్త్ దేశాల్లో చేరాలని పట్టు బట్టం వాళ్ళ రష్యా నుంచి విడిపో యిన ఉక్రెయిన్ యుద్ధం నేటికి కొనసాగుతూనేఉంది.సాధించిందిశూన్యం.ఐక్యరాజ్యసమితి కూడా భద్రత మండలిలో గల వీటో అధికారాన్ని దుర్వి నియోగం చేస్తూనే ఉన్నాయి.యూ.ఎన్. ఓ విఫలం కావటానికి ప్రధాన కారణం వీటోఅధికారంకారణం.యూ.ఎన్. ఓ పాలిస్తాన,ఇజ్రాయిల్ మధ్య యుద్ధం గాజ పై దాడు లుఆగిపోయాయా,యూ.ఎన్. ఓ కేవలం సలహా పూర్వక సంస్థ గా మిగిలిపోతేప్రపంచం. మూడవ ప్రపంచ యు ద్ధాన్ని కూడా చూసే పరిస్థితులు త ప్పక వస్తాయి.ఒక్క ఫ్రాన్స్ మ ద్దతు కాదు ఇన్నేళ్లు వీటో అధికారం అడ్డు పెట్టుకొని స్వార్థ రాజకీయాలకు యూ.ఎన్. ఓ ను వాడుకున్నారు.ఐరోపా దేశాలే కాదు లాటిన్ అమెరి కా,ఆఫ్రికా ఆసియా ఖండల లోని అభివృద్ధి చెందుతూన్న దేశాలకు ప్రతినిత్యం పెంచాలి. భద్రత మండలి అధికారులు పై నియంత్రణ ఉండాలి. ము క్యంగా తమలో తాము కయ్యా నికి కాలు దువ్వకుండా ప్రపం చములో యుద్ధం లో గెలుసిన ఏ దేశం మిగల్చుకున్నది ఏమి లేదు దానికి ఉదాహరణ రెండ వప్రపంచ యుద్ధానికి కారణం అయ్యి ఎంత నష్ట పోయిందో గమనించాలి.మూడో ప్రపంచ రాజ్యల్లో ఎలుపెట్టకుండా ఉంటే చాలు.



**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్ ఇన్ పాలిటిక్స్, జి.జె.సి దోమకొండ**
**కామారెడ్డి జిల్లా, 9440408080**

## దివాను అవుతాడా

నల్లటి నేలలో
నాగేటి సాళ్ళలో
భూమి పొత్తిళ్ళలో
నాటిన విత్తనం!

కష్టాల చెట్టున
అప్పుల నీడన
బక్కచిక్కిన రైతులా
విచ్చుకున్న పత్తి!

పురుగు మందుల్లో
స్నానం చేసి
పెట్టుబడి గోరుముద్దలు
పట్టినంత తిని!

క్వింటాళ్లలో పండాల్సింది
కిలల్లో పండుతే
రైతు దివాలా కాక
దివాను అవుతాడా!?

**జగ్గయ్య.జి**
**9849525802**

# స్వచ్ఛతలో అందరూ భాగస్వాములవ్వాలి



రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 27(జనంసాక్షి):**
స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. స్వచ్ఛతకి భాగీదారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వాలంటీర్లు ఫ్లాష్ మాబ్ పర్ఫామెన్స్ చేశారు. ఇందిరానగర్ కాలనీలో పర్యటించి కాలనీ స్థితిగతులను, పారిశుధ్య నిర్వహణ ను పరిశీలించారు. ఈ సందర్భంగ గవర్నర్ మాట్లాడుతూ మన ఇల్లు, పరిసరాలు మన బస్తి, మన గ్రామం, మన రాష్ట్రం,మన దేశం పరిశుభ్రంగా స్వచ్ఛతతో సురక్షితంగా ఉండాలని అన్నారు. మన హక్కులతో పాటు బాధ్యతలు ఉంటాయని, స్వచ్ఛ సురక్షిత సమాజం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాల న్నారు. ప్లాస్టిక్‌ను వినియోగించరాదని,పూర్తిగా నిషేధించినప్పుడే భవిష్యత్తు బాగుంటుందాని, మన పని మనం చేసినప్పుడే ప్రభుత్వ మద్దతు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛతపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఇందిరా కాలనీ ఇతర బస్తీలకు మార్గదర్శకం కావాలని, అందుకు అందరూ సహకరించాలని గవర్నర్ కోరారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాజ్ భవన్ కు సెక్రెటేరియట్ కు చాలా దగ్గరగా ఉన్న ఈ కాలనీని స్వచ్ఛతలో అభివృద్ధి సాధించేలా గవర్నర్ ఇందిరానగర్ కాలనీని దత్తత చేసుకున్నారని తెలిపారు. కాలనీ స్వచ్ఛతతో పాటు కాలనీలోని ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గవర్నర్ కార్యాలయం నుండి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇందిరానగర్ కాలనీలోని ఇంటింటికి వచ్చి ఏ సమస్యలు ఉన్నాయన్నది తెలుసుకుని, కుటుంబ స్థితిగతులపై వివరాలు సేకరించి, ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో ఆదిశగా, ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. రానున్న ఆరు నెలల్లో కాలనీ రూపు రేఖలు మారాలని, స్వచ్ఛతకు మరో పేరుగా ఉండాలన్నారు. ఆ దిశగా కాలనీవాసులు కృషి చేయాలని కోరారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాటా మాట్లాడుతూ.. స్వచ్ఛ హి సేవ కార్యక్రమాన్ని నగరంలో పాఠశాల కలశాల విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఈ కార్యక్రమం గాంధీ జయంతి వరకు పూర్తి కానున్న నేపథ్యంలో సర్కిల్ వారీగా అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నదన్నారు. స్వచ్ఛత వలన ప్రజలకి ఏవిధంగా ప్రయోజనం కలుగుతుందన్న విషయం పై పూర్తి అవగాహన కల్పిస్తున్నామన్నారు ఈ సందర్భంగా శానిటేషన్ కార్మికులకు వైద్య శిబిరాలు ఏర్పాటు సంక్షేమం పై దృష్టి పెట్టినట్లు కమిషనర్ తెలిపారు. కార్పొరేటర్ విజయ రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమానికి గవర్నర్ రావడం ఆనందంగా ఉందని, స్వచ్ఛత కార్యక్రమం వచ్చాక ప్రజల్లో చాలా అవగాహన వచ్చి మార్పు వస్తుందన్నారు. సచ్చితకు జిహెచ్ఎంసి చేస్తున్న కృషికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, శానిటేషన్ సిబ్బంది, కాలనీ ప్రజలు, మహిళలు, ఎన్జీవోలు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ధరణి సమస్యలు పరిష్కరించడంలో జాప్యం వద్దు

- ప్రతి సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**మొగుడంపల్లి సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**
ధరణి సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిఆదేశించారు. శుక్రవారం జహీరాబాద్ డివిజన్ పరిధిలో మొగుడంపల్లి తాసిల్దార్ కార్యాలయాన్ని, ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తాసిల్దార్ కార్యాలయాల్లో ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలనిసూచించారు. తమ పరిధిలోని సమస్యలకు తాసిల్దార్లు వెంటనే పరిష్కరించాలన్నారు. ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు తాసిల్దార్ కార్యాలయం నుండి పంపే ఫైల్స్ కు అన్ని ధ్రువపత్రాలు జత చేసి పంపించాలన్నారు. అన్ని తాసిల్దార్ కార్యాలయాలలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి మండల పరిధిలోని సమస్య లు అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మొగుడంపల్లి లోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనాలు పెట్టాలని కిచెన్, డైనింగ్ హాల్‌లో పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైని కలెక్టర్ మనోజ్, ఆర్డీవో రాజు, సంబంధిత శాఖల అధికారులు, గురుకుల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# రాజీలేని పోరాట యోధుడు బాపూజీ

జిల్లా కలెక్టర్ క్రాంతి



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 27(జనంసాక్షి)**
తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు, తెలంగాణ సోయి కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణా ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని ఎఫ్ఆర్ఎస్ పక్కన ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పట్టణ పురపాలక సంఘం చైర్మన్ విజయలక్ష్మిలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకను వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ నిరంకుశ నిజాం కు వ్యతిరేకంగా ఉద్యమం నాయకులలో ప్రముఖుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి విశేష కృషి చేసిన కృషివలుడు, పౌర హక్కులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజులలో తానే సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి ప్రజా చైతన్య కార్యక్రమాలు రూపొందించారని తెలిపారు. అనంతరం ఓల్డ్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి,వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి జగదీష్ జ్యోతి ప్రజ్వలన చేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్రా సాధన కొరకు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జి పండరి, హరిహర కిషన్, జి సత్యనారాయణ, ఎం మల్లేశం, టి అశోక్, వివిధ సంఘాల నాయకులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చెత్త శుద్ధి కేంద్రంపై భారం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై జీహెచ్ఎంసీ కసరత్తు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్27(జనంసాక్షి):**
జవహర్ నగర్ చెత్త శుద్ధి కేంద్రంపై భారం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. నగరం నలుమూలల నుంచి చెత్తను సేకరించి జవహర్‌నగర్ శుద్ధి కేంద్రంకు తరలిస్తుంది. జిహెచ్ఎంసి నుండి వచ్చే 7,500 మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు అదనంగా పక్కన ఉన్న 17 మున్సిపాలిటీల చెత్తను కూడా జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలించడం వల్ల రోజుకు సుమారు 9,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరలించడవల్ల జవహర్‌నగర్ యార్డ్ పై ఏర్పడుతున్న భారాన్ని తగ్గించడానికి మరియు భవిష్యత్తు అవసరాల కోసం అనువైన స్థలాలను గుర్తించడానికి జిహెచ్ఎంసి ప్రత్యేక చొరవ తీసుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మేడ్చల్, యాదాద్రి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో చెత్త శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించేందుకు అధికార బృందం పర్యటించింది.

### ప్యారా నగర్‌లో వినూత్న ,ఆధునిక పద్ధతిలో శుద్ధి కేంద్రం ఏర్పాటు

సంగారెడ్డి జిల్లాలో ఇదివరకే గుర్తించిన ప్యారానగర్‌లోని 152 ఎకరాల స్థలంలో వినూత్న ,ఆధునిక పద్దతి అయిన యూరోపియన్ టెక్నాలజీ ఆధారిత శుద్ధి కేంద్రాల ఏర్పాటుకై అనుమతులు కూడా తీసుకుంది. ఇక్కడ 15 మెగావాట్ల సామర్థ్యంతో వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్‌ను,270 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. పూర్తిగా మూసియుండే ట్రక్కుల ద్వారా రవాణా చేసిన వ్యర్థాలను అండర్ గ్రౌండ్ బంకర్‌లో వేసి తడి పొడిగా వేరు చేసిన అనంతరం పొడి వ్యర్థాలను విద్యుత్తు మరియు తడి వ్యర్థాలను డి సీబీజీ గ్యాస్‌ను తయారు చేస్తారు. ఈ క్రమంలో శుద్ధి కేంద్రంలోని ఎక్కడా కూడా చెత్తను నిల్వ చేయడం కానీ బహిరంగంగా శుద్ధి చెయ్యడం గానీ జరగదు కనుక ఎటువంటి దుర్వాసనలు గానీ వ్యర్థ జలాలు గానీ విడుదలకావు. పూర్తిగా మూసియుండే షెడ్డు లోపల ప్రక్రియ అంతా జరగడం, గాలిని కూడా బయోఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి పునర్వినియోగించడం వల్ల ఎటువంటి దుర్వాసనలు కూడా రావు. డ్రై డైజెసన్ టెక్నాలజీ ద్వారా తడిచెత్తనుండి బయోగ్యాస్ తయారు చెయ్యడం వల్ల లీచెట్ సమస్యకూడా ఉండదు.

### మరి కొన్ని ప్రాంతాల పరిశీలన

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో 42.22 ఎకరాలను, సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు మండలం లక్డారం గ్రామంలో 100 ఎకరాలు, దుండిగల్‌లో 85 ఎకరాలు, చౌటుప్పల్ మండలం మల్కాపూర్ వద్ద 200 ఎకరాలు గుర్తించారు. ప్రతిపాదిత స్థలంలో చెత్త శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు గుర్తించిన భూములను జీహెచ్ఎంసీకి కేటాయించేందుకు ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ ఆమ్రపాలి ఆయా జిల్లాల కలెక్టర్లను కోరారు.




## మెదక్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తయారు చేయాలి

ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో
జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనం సాక్షి):**
మెదక్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ను పర్యటక కేంద్రం గా తీర్చిదిద్దాలన్నారు. మెదక్ జిల్లా లో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయన్నారు. పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ టూరిజం దేను నిర్వహిస్తారన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఎన్నో అందమైన ప్రదేశాలు, చారిత్రాత్మక నిర్మాణాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ప్రజలను ఆకర్షించేందుకు కొన్ని టూరిజం ఆర్గనైజేషన్స్ వివిధ రకాల పోటీలను కూడా నిర్వహిస్తున్నాయి. అందువల్లే అభివృద్ధి చెందుతున్న దేశాలకు టూరిజం ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతోందన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని కలెక్టర్ అదికారులు తిలకించారు. ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేసిన ఫోటోగ్రాఫర్లను సర్టిఫికెట్ మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పిసి ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి జోజో తదితరులు పాల్గొన్నారు.



## జూపల్లి చేతుల మీదుగా అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
రాష్ట్రంలోనే అత్యధికంగా 1400 యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకుగాను శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ సంస్థలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా టూరిజం అధికారి యు.వెంకటేశ్వర్లు, యువ టూరిజం క్లబ్ నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌లు అవార్డును అందుకున్నారు.

# మహిళా సాధికారతతో ముందుకెళ్దాం

ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**రాజేంద్రనగర్, సెప్టెంబర్27 (జనంసాక్షి)**
సమాజంలో మహిళలు స్వశక్తితో ఎదగడానికి భాజాపా ప్రభుత్వం చేయూతనిందిస్తుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్‌లో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో గ్లోబల్ లీడర్, ఇన్వెస్టర్, లీడర్ షిప్ స్కిల్స్ ట్రైనర్గా అర్జనా హక్ పాల్గొని మహిళలు స్వతంత్రంగా తమ కాళ్ళ మీద తామే నిర్ణయాలు తీసుకుని జీవించాలని ఉద్యోగం, వ్యాపారంతో పాటు తమకు అందిపుచ్చుకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని రాణించాలని దీనికి మహిళలు తనకకా, బెనకకా నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు పయనించాలని, దీనికి స్థిరపడిన మహిళలు తోటి మహిళలకు సహాయ, సహకారాలు అందించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం మోడీ ప్రభుత్వం దేశంలో పలు ఉపాధి అవకాశాలు కల్పించిందని, మహిళలు అన్ని రంగాలతో రాణించేలా మోడీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు వారు స్వశక్తిగా ఎదగడానికి సహకరిస్తుందని, 33 శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో అమలు అయినప్పుడే మహిళలు మరింత రాణిస్తారని, దీనికి నరేంద్ర మోడీ పార్లమెంటులో బిల్లు పెట్టి అమలు చేస్తారని మరో ఎంపీ ఎన్నికల ముందు మహిళా రిజర్వేషన్ బిల్లుతో తనకు ఎంపీ టికెట్ రాకపోయి ఉండవచ్చు అని ఆయన తెలియజేశారు. అనంతరం ఎంపీ సతీమ కొండ సంగీత రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ మహిళల అభ్యున్నతి కోసం స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహించి మహిళలకు తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్, మైలార్ దేవ్ పల్లి కార్పొరేటర్లు సంగీత గౌరీ శంకర్, తోకల శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి

కార్మికుల హక్కుల సాధనకై నేడు చలో కలెక్టరేట్
సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి

**హత్నూర, సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**
కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు చాలా కాలంగా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని శాశ్వత కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బోర్పట్ల గ్రామ చౌరస్తా వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆయన విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో యేళ్ళుగా పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను పక్కనబెట్టి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారని వారన్నారు. కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తూ వాటికి అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల పొట్ట గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా పరిశ్రమ యాజమాన్యాలు శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని వారన్నారు. కార్మిక హక్కులను సాధించుకోవడం కోసం నేడు కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షబ్బీర్, శ్రీరాములు, వీరేశం, రాజు, మల్లేశం, రాజేష్ ఉన్నారు.



## అత్తాపూర్‌లో హైడ్రాకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
రాజేంద్రనగర్ అత్తాపూర్ మూసీ నది పరివాహ ప్రాంతంలో గురువారం నుంచి అధికారులు సర్వే నిర్వహిస్తున్నా, మరోవైపు బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా నగరంలో హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం పట్ల అత్తాపూర్ మూసి నది పరివాహక ప్రాంతంలోని కాలనీ వాసులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు ముఖ్యమంత్రి తీరుకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తాము దశాబ్దాలుగా ఇంటి పన్ను కట్టి ఇక్కడ ఉంటున్నామని, రూపాయి రూపాయి కూడా గట్టి ఇల్లు నిర్మించుకుంటే మూసీ పరిధిలోకి వస్తుందని సర్వేలు చేయటం ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని కాలనీవాసులు హెచ్చరిస్తూ మూసీ నీ ఆనుకొని ఉన్న రోడ్డు నుంచి అత్తాపూర్ బ్రిడ్జి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ ప్రెసిడెంట్లు, భాజపా నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, విజయ్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, కాలనీవాసులు మృదం మధు, నవీన్ కుమార్, రమేష్ గుప్తా, రోహిత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా పేరుతో హైడ్రామా..!

- కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలతో గద్దెనెక్కింది
- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**తాండూరు సెప్టెంబర్ 27(జనంసాక్షి)**
కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాపేరుతో హైడ్రామా సృష్టిస్తుందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. శుక్రవారం తాండూరు పట్టణంలో ని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవిణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ 9నెలల పాలనలో ఒరిగేదేమీ లేదన్నారు.కాంగ్రెస్ హయాంలో అంతా అవినీతి మయమైందన్నారు. కేసీఆర్ కేటీఆర్ నాయకత్వలో పానిచేయడం సంతోషంగా ఉందన్నారు. వికాబాద్ నుండి తాండూరు వరకు ఉన్న రోడ్డు దారునంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్లపై దృష్టి సారించాలన్నారు. ఈ విషయంపై భారత రాష్ట్ర సమితి ఖండిస్తున్నదన్నారు. భారతదేశ రక్షణకు మేము సర్వశక్తుల పోరాడుతామన్నారు. వికారాబాద్ జిల్లా హైదరాబాద్ ప్రాంతానికి స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ సిలిండర్‌గా ఉన్న వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో ఉన్న దామగుండం అడవి. ఇలాంటి అడవిని రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న 2900 వందల ఎకరాల అడవి భూమిని కేంద్రం నేవీ రాడార్ స్టేషన్ నిర్మించే విధంగా అనుమతులు ఇవ్వడం దారుణం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకి అనుమతులు ఇవ్వడం సరికాదని అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 2900 ఎకరాల్లో ఉన్న దాదాపు 12 లక్షల చెట్లు కొట్టి వేయాల్సి వస్తుంది. చుట్టుపక్కల 20 గ్రామాలలో ఉంటున్న ప్రజలు వారి పశువులను మెపుకోవడానికి అలాగే ఇతర ఔషధ మొక్కల కోసం వారు ఈ అడవిని వాడుకుంటున్నారు. ఈ అడవి నరికేస్తే తర్వాత తరానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ కూడా అందదన్నారు. కావున ఈ ప్రకృతిని కాపాడాలని ఇక్కడ నిర్మించే నేవీ రాడార్ స్టేషన్‌ను వేరే ప్రాంతానికి నిరుపయోగంగా ఉండే ప్రాంతానికి మార్చి ధమగుండం అడవిని కాపాడాలని తెలియ చేసారు. హైడ్రాపేరుతో జిల్లాతో పాటు గ్రామాల్లోకి తీసుకోస్తామని ప్రజలను బయబ్రాంతులకు గురిచేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ బందువుల ఆక్రమంగా సంపాదించిన వాటిని ముందు తొలగించామన్నారు. పెద ప్రజల ఊసురుఊరికే పోదన్నారు. దనవంతులకు ఓక న్యాయం పెదలకు ఓకన్యాయమా అని ప్రశ్నించారు. అనంతరం ఆచార్య కొండా లక్మణ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, మండల అద్యక్షులు వీరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పంజుగుల శ్రీశైల రెడ్డి, వెంకట్ రెడ్డి, నరుకుల నరేందర్ గౌడ్ తదితరులున్నారు.

# పర్యాటక ప్రదేశాలకు పూర్వవైభవం తెస్తాం

**టూరిజంలో కొత్త ప్రాజెక్టులను తెస్తాం**

**మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి**



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని మహబూబ్ నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అనేక దర్శనీయ స్థలాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, ప్రత్యేకించి నల్లమల అటవీ ప్రాంతం, జూరాల ప్రాజెక్టు, పిల్లలమర్రి, సోమశిల, కోయిల్ సాగర్, సరళ సాగర్, జోగులాంబ శక్తిపీఠం, కురుమూర్తి, మన్యంకొండ వంటి అనేక ప్రసిద్ధ దేవాలయాలు, సందర్శించే స్థలాలు ఉన్నాయని తెలిపారు. అలాగే సంస్థానాధీశులు కట్టించిన అనే కోటలు జిల్లాలో ఉన్నాయని, ప్రకృతి రమణీయ స్థలాలు ,వ్యూ పాయింట్స్ సైతం అనేక ఉన్నాయని తెలిపారు. మహబూబ్ నగర్ పట్టణం చుట్టూ సుమారు 20 వేలకు ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం ఉందని, ఎకోటూరిజాన్ని, ట్రెక్కింగ్ ను అభివృద్ధి చేసేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేయడం ద్వారా వేలాది మంది పర్యాటకులు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉండడం, టూరిజానికి మంచి అవకాశాలు ఉన్నాయని అయితే గత పాలకులు టూరిజం ప్రాంతాలలో సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల ఇవి పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదని, రాబోయే నాలుగేళ్లలో పర్యాటక ప్రాంతాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి వేల మంది టూరిస్ట్ లను ఆకర్షించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. స్థానిక ప్రజలకు టూరిజంపై అవగాహన పెంపొందించేలా చూడాలని, పర్యాటక ప్రదేశాలలో స్వచ్ఛత, పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని, పర్యాటక ప్రాంతాలు స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంటేనే ఎక్కువ మంది వస్తారని తెలిపారు .మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సర్క్యూట్ ఏర్పాటు చేసి ఇంటిగ్రేటెడ్ ప్రణాళికను రూపొందించే పనిలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి టూరిజం కొత్త ప్రాజెక్టు తీసుకువచ్చేందుకు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ఉమ్మడి జిల్లాకు చెందిన వారు అయినందున ఎక్కువ ప్రాజెక్టులు వస్తాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి జిల్లా పర్యాటక శాఖ ఇన్చార్జి అధికారి యు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అధపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, మహబూబ్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, జిల్లా విద్యాశాఖ తరపున సీఎంఓ బాలు యాదవ్ పాల్గొన్నారు. టిఎస్ఎస్ఎస్ సాంస్కృతిక కళాకారులు మహబూబ్ నగర్ పర్యాటకంపై ప్రదర్శనలు ఇచ్చారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అంతకుముందు శాసనసభ్యులు , అదనపు కలెక్టర్లు వివిధ శాఖల అధికారులు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# కాంగ్రెస్‌ది పిచ్చుకపై బ్రహ్మాస్త్రం

**హైడ్రా పెద్దలక...పేదలక**

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



**సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 27(జనంసాక్షి)**

ప్రజాపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా సర్కారు దాడి కొనసాగుతుం దని పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు హైడ్రా ఉందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మండిప డ్డారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు, పలుకుబడి ఉన్న వ్యక్తులకు నోటీసులతో సరిపెడుతుందని, పేదోడి గూడుపై మాత్రం కర్కశంగా వ్యవహ రిస్తుందని దుయ్యాబట్టారు. ప్రభుత్వాని కి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై, చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చి వాటి నుం చి వచ్చిన ఆదాయం ప్రభుత్వం సొమ్ము చేసు కొని మళ్ళీ ఆ ఇండ్లనే కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూల్చివేతతో గుండెకోత.. ప్రజాపాలనలో సామాన్యుడి గూడుపై సర్కారు దాడి చేస్తుందని, రూపాయి రూపాయి కూడబెట్టి స్థలం కొనుగోలు చేసి నిర్మాణాలు చేశామని, తమను ఆకస్మాత్తుగా రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి జరిగినప్పుడే కదా సంఘవిద్రోహక శక్తులకు పెంచినవాళ్ళం అవుతామని, ఈ పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వాని దేనన్నారు. హైడ్రా వల్ల పేద మధ్యతరగతి ప్రజల జీవితాలు కుదేలవుతున్నాయని అసహ నం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల సంగతి దేవుడెరుగు గానీ గుడిసెల్లో కూడా ఉండనీయ కుండా కూలగొట్టేసి రోడ్డున పడేస్తుంటే వాళ్ళు ఎటు పోవాలని ప్రశ్నించారు. వాన నీరు రోడ్ల మీద నిలవకూడదంటే డ్రైనేజ్ సిస్టం బలంగా ఉండాలని, పైప్ లైన్లు పెద్దవి వెయ్యాలి. అవన్నీ చేయకుండా, నెపాన్ని కేవలం ఆక్రమణల మీదకు నెట్టి ఇళ్లను కూలుస్తూ డైవర్ట్ చేస్తున్న ట్టు ఉందన్నారు. పేద మధ్యతరగతి కుటుం బాలకు హైడ్రా భరోసా కల్పించాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో నాయకులు సిడిసి మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం



- **ప్రజా సంక్షేమానికై పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే**
- **అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**చేర్యాల సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు,దూల్మిట్ట మండలాలకు చెందిన 239మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 18గంటలు కష్టపడుతూ ప్రజా సంక్షేమం,అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ప్రయోజనం కలిగే పథకాలను ఏ పార్టీ ప్రవేశపెట్టినా పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలు అమలు చేయాలని అన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖఆర్ రెడ్డి ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, రైతు రుణమాఫీ,108,104 సర్వీసులు వంటి పథకాలను రాష్ట్ర అవతరణ అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ కొద్ది రోజులు ఆలస్యం ఐనప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం పనిచేస్తుందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లకు, కార్మికులకు, ఉద్యోగులకు బిల్లులు, వేతనాలు పెండింగులో ఉన్నాయని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రతిపక్ష పార్టీల పాత్ర ఎంతో కీలకమని, ప్రతిపక్ష నాయకులు కేవలం విమర్శలు చేయడమే కాకుండా ప్రజా ప్రయోజనాల కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేర్యాల ప్రాంతంలో నెలకొన్న సమస్యలను నా దృష్టికి తీసుకుని వస్తే జిల్లా మంత్రిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సోమశిలకు జాతీయ పర్యాటక అవార్డు

- **స్పిరిచ్యువల్-వెల్నెస్ కేటగిరీలో సోమశిల**
- **హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు**



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, **సెప్టెంబర్27(జనంసాక్షి):**

తెలంగాణలోని రెండు పర్యాటక గ్రామాలకు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కాయి. 2024 సంవత్సరానికి గాను కేంద్ర పర్యాటక శాఖ ఎనిమిది కేటగిరీలలో నిర్వహించిన పోటీలలో "స్పిరిచ్యువల్ - వెల్నెస్ " కేటగిరీలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల, "క్రాఫ్ట్స్" కేటగిరీలో నిర్మల్ ను ఎంపిక చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో "భారత ఉప రాష్ట్రపతి "జగ్దీప్ ధన్కడ్" ముఖ్య అతిధిగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవం చేశారు.సోమశిలకు జిల్లా పర్యాటక శాఖ అధికారి టి.నర్సింహా ఈ అవార్డును అందుకున్నారు. సోమశిల, నిర్మల్ కు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దకడంపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.తన స్వంత నియోజకవర్గమైన కొల్లాపూర్ లోని సోమశిలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా సోమశిల గ్రామస్థులకు, కళాకారులకు, పర్యాటక శాఖ అధికారులు, సిబ్బందికి మంత్రి జూపల్లి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో టూరిస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణ పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా తెలిపారు. రానున్న రోజుల్లో పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. తెలంగాణ కళలకు అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, కళాకారుల నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

**మహబూబ్ నగర్ డిఎస్పి వెంకటేశ్వర్లు**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మహబూబ్ నగర్ డిఎస్‌పి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ డి జానకి ఆదేశాల మేరకు శుక్రవారం మహబూబ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాషాపూట ఏరియాలో గల " సరోజినీ రాములమ్మ ఫార్మసీ కళాశాలలో సురక్ష పోలీస్ బృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏ హెచ్‌టియుటీం) ' 'షిటీం' సంయుక్త సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎస్‌పి వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్, మహబూబ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిఐ గాంధీ నాయక్, సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్ ప్రసంగంతో పాటు , పోలీసు కళాబృందం సభ్యులు పాటలతో విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా డిఎస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలబాలికలు చదువుపై క్రమశిక్షణతో పాటు, కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత మాటలతో గిఫ్టులు వచ్చాయని, మీరు లక్కీ డ్రాలో గెలుపొందారని, ఆన్లైన్లో తక్కువ ధరకే వాహనాలు, వస్తువులు దొరుకుతాయని మోసం చేయడం జరుగుతుందన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ పేరు మీద మా యాప్ లో లోన్ వచ్చిందని లేదా మీకు క్యూ ఆర్ కోడ్ పంపించి దానిని




స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్పిన యెడల నమ్మవద్దని , అది సైబర్ మోసం అని గమనించాలన్నారు . ఇంటర్నెట్లో ఓటీపీ నంబర్ గానీ , బ్యాంక్ కార్డ్స్ నంబర్ గానీ ఎవరికీ పంపవద్దని, ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి లేదా మహబూబ్ నగర్ జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 కి లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళా బృందం సభ్యులు డి.రాములు, బి.జగదీష్, కె.శ్రీనివాస్, శివరాములు, షీ టీం సభ్యుడు రఘువరణ్‌తో పాటు మిగతా సభ్యులు, ఏహెచ్‌టియు సభ్యుడు వరప్రసాద్, కళాశాల ఛైర్మన్ డాక్టర్ బాల్ రాజుతో పాటు అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యాన్ని సేకరించాలి




**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

ఖరీఫ్ వానాకాలం -2024 కు గాను నిర్దేశించిన లక్ష్యం మేరకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఖరీఫ్ వానాకాలం సీజన్ కుగాను జిల్లాలో వరి సాగు అంచనా, దిగుబడి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని అడిగారు. ఈసారి సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ పెంచిందని ఆమె తెలిపారు. ఈసారి బోనస్ వస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఎంతో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆమె సూచించారు. కాగా జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌కి 3.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేసినట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ కలెక్టర్ కు తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఐకెపి, సింగిల్ విండో, మెప్మా ద్వారా జిల్లాలో దాదాపు 100 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను అనుకూలమైన ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని, ధాన్యం సేకరణకు అవసరమైన తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, ఇంకా అవరమైన వాటి కోసం ఇండెంట్లు పెట్టి తెప్పించుకోవాలని ఆమె సూచించారు. అయితే కాంటాలు, టార్పాలిన్లకు సంబంధించి మార్కెటింగ్ శాఖ అధికారులు ఇచ్చిన నివేదికలు తప్పుగా ఉన్నాయని, వాటిని వెంటనే సరిచేసి పూర్తిస్థాయి నివేదికలు ఇవ్వాలని డిఎంఓను కలెక్టర్ ఆదేశించారు. దాదాపు 100 కొనుగోలు కేంద్రాలకు 3 వేల టార్పాలిన్లు అవసరం అవుతాయని ఆమె చెప్పారు. సమీక్షలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ దేవదాసు, జిల్లా సివిల్ సప్లై అధికారి సుదర్శన్, ఆర్డీవో మేఘా గాంధీ, డిఎంఓ బాలమణి, అడిషనల్ డిఆర్డిఓ అంజ య్య, సింగిల్ విండో అధికారులు పాల్గొన్నారు.



## జూనియర్ కాలేజీ, (గ్రౌండ్) పనులలో వేగం పెంచాలి

**మక్తల్, ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి**

**నర్వ సెప్టెంబర్27(జనంసాక్షి):**

నర్వ మండల కేంద్రం అతిసమీపంలో ప్రభుత్వం మంజూరి చేసిన జూనియర్ కళాశాల, మరియు ప్లే గ్రౌండ్‌కు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి సూచన మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చెన్నయ్య సాగర్ ప్రతి రోజు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే శ్రీహరి, చెప్పిన సమయానికన్నా ముందే కళాశాల నిర్మించి ఇవ్వాలి కాబట్టి పనులను వేగవంతం చేయాలనీ చెప్పారు కాబట్టి మేము ప్రతిరోజు ఇక్కడే ఉండి పనులను చేయిస్తు ఏరోజు సమాచారం ఆరోజే ఎమ్మెల్యే కు అందజేస్తున్నాం, అడిగిన వెంటనే జూనియర్ కళాశాల, మరియు గ్రౌండ్, మంజూరి చేసిన ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి కి నర్వ మండల ప్రజలు రుణపడి ఉంటారని, మండల కాంగ్రెస్ పార్టీ,తరపున చెన్నయ్య సాగర్ ప్రత్యేక అభివందనలు తెలియచేశారు.



## విద్యార్థులకు క్రీడలు మానసిక ఉత్తేజాన్నిస్తాయి

**మండల విద్యాధికారి నరసింహ**

**వీపనగండ్ల, సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**

వీపనగండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14 ఖోఖో, వాలీబాల్, 17వ ఆటల పోటీలను నిర్వహించారు. మండలంలోని 8 పాఠశాలల నుండి ఎస్‌జిఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలకు బహుమతి ప్రధానోత్సవానికి రత్నగిరి ఫౌండేషన్ శ్రీ జూపల్లి అరుణ్ మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య ఆర్థిక సహాయం అందజేశారు. ఈ క్రీడల పట్ల విద్యార్థులలో శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తుందని మండల విద్యాధికారి నరసింహ అన్నారు. ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాష్ మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యా యులు శ్రీనివాసులు, రఘు, కురుమూర్తి, మరియు ఉపాధ్యాయులు ఆనంద్ రెడ్డి, మహి పాల్ రెడ్డి, కురుమూర్తి, బలరాం, సిఆర్‌పి వెంకటేష్ , నాగరాజు పాల్గొన్నారు.




## పర్యాటక ప్రాంతాల గురించి ప్రచారం చేయాలి

**అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్**

**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**

వనపర్తి జిల్లాలోని విశేషమైన, పర్యాటక ప్రాంతాల గురించి ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక అధికారి ఆధ్వర్యంలో వనపర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యాటక దినోత్సవం ప్రాధాన్యతపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అదనపు కలక్టర్ ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో శ్రీరంగాపూర్, పామాపురం, చంద్రగడ్, పానగల్ కోట, ఖిల్లా ఘనపూర్ కోటలు ఉన్నాయని, అప్పుడప్పుడు వాటిని సందర్శించి ఆహ్లాదం, ఆరోగ్యాన్ని పొందవచ్చు అన్నారు. సోషల్ మీడియా ద్వారా, స్నేహితులకు చెప్పడం ద్వారా ఒక ప్రాంతం ప్రాచుర్యం పొందుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని, తమ ఇంటి ఆవరణ, పరిసరాల్లో చెత్త వేయకుండా చెత్త బుట్టలోనే చెత్త వేసే విధంగా చూడాలని విద్యార్థులను సూచించారు. పరిసరాల పరిశుభ్రత పర్యాటక రంగంతో ముడిపడి ఉంటుందని అన్నారు. ప్రాంతం పరిశుభ్రంగా ఉన్నప్పుడే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా టూరిజం, జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారం, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, కస్తూరిబా విద్యాలయ ఎస్ఓ లోహిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- **నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**
- **ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు**

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, **సెప్టెంబర్27(జనంసాక్షి):**

తెలంగాణా ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరములో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో కలిసి బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో నిజాం వ్యతిరేక ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన తొలి తరం నాయకులలో కొండ లక్ష్మణ్ బాపూజీ ఒకరని, తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు పాటుపడిన వ్యక్తని, అతని అడుగుజాడల్లో నడుచుకోవడం మనందరికీ ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ కల్పన, జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు నిరంజన్, కుమారస్వామి, రామకృష్ణ, శేఖర్ గంగాధర్, పాలాది మహేష్ శ్రీనివాసులు, పాత్రికేయులు కందికొండ మోహన్, కలెక్టరేట్ సూపరిండెంట్లు చంద్రశేఖర్, యూసుఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## నేటి తరానికి ఆదర్శ ప్రాయుడు

**ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్**

నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఏడిడిఎల్ఎస్‌పి సిహెచ్ రామేశ్వర్, నాగర్ కర్నూల్ జిల్లాలో ఉన్న డిఎస్పీలు సిఐలు ఎస్సైలు తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

7
# మహిళా స్వరాజ్య
తెలంగాణ
శనివారం
28 సెప్టెంబర్ 2024
జనంసాక్షి
www.janamsakshi.org





## భారతవనంలో
# పుప్పాల కథల పరిమళాలు

బాల సాహిత్యం మనసుకు అద్దం వంటిది. ఈ అద్దంలో వారికి కనిపించే ప్రతిబింబాలు కథలు వాటి పాత్రలు. బాల సాహిత్యం చిన్నారి మనుషులకు విత్తనాలు నాటే తోట వంటిది కూడా, ఈ తోటలో ప్రతి కథ ఒక విత్తనం అందులోని పాత్రలు మనకు అద్భుతమైన మొక్కలను చూపిస్తాయి ఈ కథలోని పాత్రలు పిల్లల మనుషుల్లో అనేక విలువలు భావనలు నాటుతాయి అవి పిల్లలను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి. చక్కటి కథలోని పాత్రలు పిల్లలను అనేక విలువలను నైతికతను జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. ఈ కథలు రచించిన పుప్పాల కృష్ణమూర్తి తెలుగు సాహిత్య రంగంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న కథా రచయిత. ఈ కథలతో పిల్లలలో దేశభక్తి, మానవతా విలువలు, సమాజ చైతన్యం వంటి గొప్ప లక్షణాలను పెంపొందించే ఒక అద్భుతమైన ప్రయత్నం చేశారు. ఈ భారతవనములో భావి భారత పౌరుల భవిష్యత్తు నిర్మాణానికి కావలసిన నైతిక సామాజిక సాంస్కృతిక విలువలను తన తన కలంతో భారతావనములో బాటలు వేశారు. ఈ సంకలనంలోని "పుల్లమ్మ చల్ల"/తాగినవారికల్ల/కవిత్వం కొల్ల/కడుపులో చల్ల పడగానే కవిత్వం వెల్లువలా వచ్చిందంటారు. ఈ కథ గ్రామీణ మహిళా జీవితాలను వారి సంకల్ప శక్తిని తెలియజేస్తుంది. "అరణ్యంలో ప్రజాస్వామ్యం"ఈ కథలో సింహ రాజునుండి అడవిలో ప్రజాస్వామ్యం వస్తుందని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించి, అన్ని జంతువులకు ఓటు హక్కు కల్పిస్తుందని-ఎన్నికలు నిర్వహిస్తుందని-మెజారిటీ కలిగిన తమకు రాజ్యాధికారం వస్తుందని-నిత్యం క్రూర జంతువులకు బలవుతూ ఆశగా అడివిలో అలాగే ఎదురు చూస్తున్నాయి సాత్విక జీవులు. ప్రకృతితో మానవుని సంబంధాన్ని ప్రజాస్వామ్య విలువలను తెలియజేస్తుంది ఈ ఆసక్తికరమైన కథ. "దేశభక్తుడు", ఈ కథలో పరిగ తోటి గుమ్మి నిండదు.కల్లుతోటి కడుపు నిండదు. అనే సామెత చెప్పి పాలకులు ఇచ్చేటి ఉచిత హామీలు ప్రజలకు హాని కలిగిస్తాయని, కష్టాన్ని వదిలేసి ఉచితలకు ఆశపడితే నాలో దేశభక్తి పూర్తిగా తొలగిపోతుందని, నిజమైన దేశభక్తుడి ఆవేదనను వ్యక్తపరిచారు. దేశభక్తి అంటే ఏమిటో అనే దానిపై పిల్లలకు అవగాహన కల్పించే కథ. "నిర్మల హృదయం"కథలో మనం చేసే సహాయం ప్రతిఫలాపేక్ష లేకుండా చేయాలని, సాధు జంతువుల పట్ల ప్రేమ చూపాలని నిర్మలమైన హృదయముతో జీవన గమనాన్ని కొనసాగించాలని, మానవత్వం నిస్వార్థం గురించి చక్కగా



వివరించారు. "పరిమళించే మంచితనం"కథలో ఎదుటి వాడి సొమ్మును ఎలా కొట్టేయాల అని ఆలోచించే ఈ కాలంలో జాలరి తన సర్వస్వం పరుల మేలు కోసం దారపోస్తాడు. ఇలాంటి వాడు రాజ్యంలో ఉన్నందుకు రాజు గర్వపడతాడు. దివ్యమైన ఆలోచనలు ఉన్న జాలరి వల్ల అభాగ్యులు అనార్థులు కడుపుకి ఎంతటిని ఆకలి తీర్చుకుంటున్నారు. ఆ జాలరిలో మంత్రి గారికి ఒక యోగి కనిపిస్తాడు. మంచి మనసు గల వ్యక్తుల గురించి వారి ప్రభావం గురించి ఈ కథలో వివరించారు పుప్పాల కృష్ణమూర్తి. "పసి హృదయం"కథలో పిల్లలకు చెట్లు పట్ల పక్షుల పట్ల ప్రకృతి పట్ల ఉన్న ఆలోచనలు, వారి ప్రపంచం గురించి ఒక అల్లాదకరమైన ఆరోగ్యకరమైన ఆనందకరమైన పర్యావరణాన్ని గురించి ఈ కథ తెలియజేస్తుంది. "జంతు ప్రేమ" వంటి కథలు వివిధ అంశాలను తమలో ఇమిడ్చుకుని, చిన్నారుల మనసులను ఆకట్టుకునేలా ఉన్నాయి.ఈ కథలు చిన్నారులకు సమాజంలోని విలువలను, మంచి చెడులను, సత్య సంధతను బోధిస్తాయి. పిల్లలకు అర్థమయ్యేసరళమైన భాషలో రాసిన ఈ కథలు, వారిలో పఠనాభిరుచిని పెంపొందిస్తాయి. కథలు వివిధ అంశాలను తమలో ఇమిడ్చుకుని, పిల్లల ఆలోచనా విధానాన్ని విస్తరిస్తాయి.కథలు నీతి కథల స్ఫూర్తితో సాగుతూ, పిల్లలలో మంచి విలువలను పెంపొందిస్తాయి. కొన్ని కథలు సమాజంలోని వివిధ అంశాలను ప్రతిబింబిస్తూ, పిల్లలలో సామాజిక చైతన్యం కలిగిస్తాయి.పుప్పాల కృష్ణమూర్తి "భారతవనం" కథా సంకలనం, చిన్నారుల కోసం ఒక అమూల్యమైన నిధి. ఈ కథలు పిల్లల మనసుల్లో మంచి విలువలను నాటుతాయి. పిల్లలు ఈ కథలను ఆస్వాదిస్తూ, వాటి నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఈ కథా సంకలనం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలకు తప్పకుండా చదివించవలసిన ఒక అద్భుతమైన పుస్తకం. ఉప్పాల కృష్ణమూర్తి గత మూడు దశాబ్దాల కాలంగా కథారచేతగా కొనసాగుతూ పిల్లల కథలతో పాటు పిల్లల నవలలు కూడా రచించారు దాదాపు 17కి పైగా కథల పుస్తకలు రచించారు. బాల సాహిత్యంలో తాను చేసిన కృషికి గాను 2016 వ సంవత్సరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు వారి నుండి శ్రీ అంగల కుదుటి సుందరా చారి స్మారక కీర్తి పురస్కారం మరియు 2020లో బాల సాహిత్య పురస్కారం అందుకున్నారు. కృష్ణమూర్తి జీవితము సాహిత్యం పై కాకతీయ యూనివర్సిటీలో అనిత అనే విద్యార్థినే పీ.హె.చ్.డి. చేయటం బాల సాహితీ చరిత్రలో ఒక విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ సంకల్పానికి ముందు మాట అందించిన డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు నిపుణత కలిగిన బాల సాహిత్య అక్షర శిల్పి అనే పుప్పాల కృష్ణమూర్తిని కొనియాడారు. ముఖచిత్రంతో పాటు లోపలి బొమ్మలతో భాస్కరం ఈ పుస్తకాన్నికి అందాన్ని తెచ్చిపెట్టారు. బాలసాహిత్యం వ్యాప్తిలో పుప్పాల కృష్ణమూర్తి సహచరుడుగా డాక్టర్ బెల్లంకొండ రాజశేఖర్, ప్రశాంతి సహకారం అభినందనీయం. ఈ పుస్తకాన్ని తరగతి గదిలో ఉపయోగించి విద్యార్థులకు విలువల బోధన చేయవచ్చు.



**పూసపాటి వేదాద్రి**
కవి సాహితీ విశ్లేషకులు
9912197694



# భారీగా గంజాయి పట్టివేత

### 31,75,000/- విలువ గల ఎండు గంజాయి పట్టుకున్న మరిపెడ పోలీసులు

**మరిపెడ సెప్టెంబర్ 27 (జనం సాక్షి):**
మరిపెడ మండలం గాలి వారి గూడెం స్టేజి వద్ద భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్న మరిపెడ పోలీసులు. శుక్రవారం మరిపెడ పోలీస్ స్టేషన్లో సీఐ రాజ్ కుమార్ గౌడ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీఎస్ చతిస్గడ్ రాష్ట్రం ఆశిర్ గూడెం కుంట మండలం సుకుమా జిల్లా కు చెందిన సోడి నాగేశ్వరరావు తండ్రి మహేశ్వర్ 40 సంవత్సరాలు ఎస్ టి కోయ రెవెన్యూ ఫోర్త్ క్లాస్ ఉద్యోగి వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో రెనాల్ట్ క్విడ్ TS 07HQ 3910 గల కారులో హైదరాబాద్ కు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారంతో మరిపెడ పోలీసులు మరిపెడ మండలం గాలి వారి గూడెం స్టేజి వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయిని తరలిస్తున్న నిందితుడిని కారును పట్టుకొని కారులో నీ 127 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని అన్నారు. ఇలాంటి మాదక ద్రవ్యాలను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇలాంటి కార్యకలాపాలపై పోలీసులు ఎల్లప్పుడూ ఉక్కు పాదం మోపుతారని నిర్మూలనకు ఎల్లవేళలా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని నిందితులను కఠినంగా శిక్షలు విధిస్తుందని అన్నారు.ఈ తనిఖీలో పాల్గొని చాకచక్యంగా విధులు నిర్వహించిన అధికారులను రివార్డులు అందించి అభినందించారు ఈ తనిఖీ లో మరిపెడ ఎస్సై సతీష్ గౌడ్, సంతోష్ కుమార్, ట్రైన్ ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుల్ వాల్య, కానిస్టేబుల్ ఉమాకర్, లింగయ్య, వెంకన్న, రవీందర్, హెూంగార్డ్ కృష్ణమూర్తి సిబ్బంది పాల్గొన్నారు



## అర్హులైన దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతి దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిళ్లు అందిస్తామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జడ్పి కార్యాలయంలో దివ్యాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలిమ్ కో కంపెనీ ఆధ్వర్యంలో సంయుక్తంగా దివ్యాంగులకు సహాయ ఉపకరణాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావులు కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగుల రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిం చారు. అనంతరం ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో పెట్టిన నిబంధనల ప్రకారం కొంతమందికి మాత్రమే దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ళు, స్కూటీలు ఇవ్వడం జరిగిందని, ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి దివ్యాంగునికి బ్యాటరీ సైకిళ్ళు, స్కూటీలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. రాబోయే 1.40 లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లలో దివ్యాన్గులకు ప్రత్యేక కోటా ఉంటుందని కష్టపడి చదివి దివ్యాన్గులు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తద్వారా తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆయన సూచించారు.
జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం, అలీమ్ కో సంయుక్తంగా దివ్యాంగులకు ఉపకరణాల క్యాంపు నిర్వహిస్తుందని అన్నారు. అర్హులైన దివ్యాంగులు క్యాంపును సద్వినియోగం చేసుకొని రిజిస్ట్రేషన్ పొందిన తరవాత రెండు నెలల్లో మరో క్యాంపు నిర్వహించి సహాయ ఉపకరణాలు, బ్యాటరీ సైకిళ్ళు, స్కూటీలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో లేని దివ్యాంగులు శనివారం చిట్యాల మండల కేంద్రంలో జరిగే క్యాంపుకు హాజరు కావొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి చిన్నయ్య, సీడీపీఓ అవంతి తదితరులు పాల్గొన్నారు.



### ప్రముఖులకు నివాళులు అర్పిస్తున్న తుంకుంట మున్సిపాలిటీ నాయకులు

**శామీర్ పేట్ (జనంసాక్షి ):** గాంధీ భవన్‌లో భారత స్వాతంత్ర్య సమరయోధుడు యోధుడు, ప్రఖ్యాత ఉద్యమ కారుడు భగత్ సింగ్ 117వ జయంతి,మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి 23 వ వర్ధంతి,రవీంద్ర భారతిలో స్వాతంత్ర్య సమర యోధుడు,తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి కార్యక్రమంను తుంకుంట మున్సిపాలిటీ నాయకులు నిర్వ హించారు.ఈ కార్యక్రమాలలో పలువురు నాయకులు పాల్గొని భగత్ సింగ్,కోట్ల విజయ భాస్కరరెడ్డి,కొండా లక్ష్మణ్ బాపూజీల చిత్రపటా లకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి,ఆ మహానీయుల ఆశయసాధనలో మనమందరం పునరంకితమవుదాం అన్నారు. ఈ కార్యక్రమా లలో ఉమ్మడి శామీర్ పేట్ మండల మాజీ జెడ్పీటీసీ పోలమొళ్ళ బాలేష్,తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి,జగన్ గూడ మాజీ ఎంపీటీసీ ఇర్రి రవీందర్ రెడ్డి,నాయకులు మహమ్మద్ జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

# నౌకదళం ర్యాడర్ స్టేషన్‌తో పెను ప్రమాదం






- సేవ్ నేచర్ సేవ్ దామగుండం పేరుతో ర్యాలీ

**తాండూరు సెప్టెంబర్ 27(జనంసాక్షి) :**
తాండూర్ లో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ విధ్యా వంతుల వేదిక రామ కృష్ణ స్వేరొస్ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సేవ్ దామగుండం పేరుతో ర్యాలీ నిర్వహించారు .అలాగే తాండూర్ డివిజన్ సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరి రాజ్ కుమార్ పర్యాద రామకృష్ణ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా, హైదరాబాద్ ప్రాంతానికి స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ సిలిండర్‌గా ఉన్న వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో ఉన్న దామగుండం అడవి. ఇలాంటి అడవిని రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న 2900 వందల ఎకరాల అడవి భూమిని కేంద్రం నేవీ రాడార్ స్టేషన్ నిర్మించే విధంగా అనుమతులు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుకి పర్మిషన్ ఇవ్వడం సరికాదని అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 2900 ఎకరాల్లో ఉన్న దాదాపు 12 లక్షల చెట్లు కొట్టి వేయాల్సి వస్తుంది. ఆ ప్రాంతంలో ఎంతోమంది పూజించే 500 సంవత్సరాల పురాతన రామ లింగేశ్వర ఆలయం ఉంది. ఈ అడవిలో సంవత్సరం అంతా నీరు ఉండే సహజ నీటి ఊడలు చాలా ఉన్నాయి. చుట్టుపక్కల 20 గ్రామాలలో ఉంటున్న ప్రజలు వారి పశువులను మెపుకోవడానికి అలాగే ఇతర ఔషధ మొక్కల కోసం వారు ఈ అడవిని వాడుకుంటున్నారు .ఈ అడవి నరికేస్తే తర్వాతి తరానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ కూడా అందదు. కాలుష్యం చాల అవుతుంది.ఈ ప్రాంతమంతా ఆ సిగ్నల్ నుండి వచ్చే రేడియేషన్ ప్రభావం వల్ల చుట్టుపక్కల 100 కిలోమీటర్ల వరకు రేడియేషన్ ప్రభావం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రేడియేషన్ ప్రభావం వల్ల ఈ ప్రాంతంలో పక్షులు జంతువులు ,పంట పొలాలే కాకుండా మనుషులకు కూడా హాని జరిగే ప్రమాదం ఉంటుంది.
కావున ఈ ప్రకృతిని కాపాడాలని ఇక్కడ నిర్మించే నేవీ రాడార్ స్టేషన్ ను వేరే ప్రాంతానికి నిరుపయోగంగా ఉండే ప్రాంతానికి మార్చి ధమగుండం అడవిని కాపాడాలని తెలియ చేసారు.ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర నాయకులు సయ్యద్ శుకుర్ జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్ సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాస్ బుగ్గప్ప టిఆర్ ఎస్ వి నాయకులు దత్తాత్రేయ యాలాల మండల అధ్యక్షులు లక్ష్మణ్ చారి, బీసీ యువ నాయకులు పరమేశ్, టైలర్ రమేష్, జంటిపల్లి వెంకట్, రాము ముదిరాజ్, ఎస్ ఎఫ్ ఐ వెంకటేష్, బసంత్, బస్వరాజు, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

# వరద భాదితులకు మిత్రా ఫౌండేషన్ అపన్నహస్తం

- 10 లక్షల విలువైన నిత్యవసర సరుకులు పంపిణీ
- మిత్ర ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్





**ఖమ్మం, (జనం సాక్షి):** మానవ సేవే మాధవ అనే సూక్తిని పుణికి పుచ్చుకున్న ఖమ్మం మిత్ర ఫౌండేషన్, మిత్రా మిత్ర బృందం ఖమ్మం వరద బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. రూ.10 లక్షల విలువైన నిత్యవసర సరుకులను వరద బాధితులకు అందించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ చేతుల మీదగా నిత్యవసర సరుకులను వరద బాధితులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల వల్ల సర్వం కోల్పోయిన వారికి అండగా నిలిచేందుకు మిత్ర ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీ యమన్నారు. విపత్కర పరిస్థితులలో ఈ మిత్ర బృందం అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.
మిత్ర ఫౌండేషన్, మిత్ర మిత్ర బృందం అనేక సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సహాయం అందిస్తోందని తెలిపారు. గతంలో భద్రాచలం వరద భాదితుల సహాయర్థం 11 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారని గుర్తు చేశారు. కరోనా మహమ్మారి సమయంలో, అనేక విపత్తుల సమయంలోనూ ఈ సంస్థలు తమ సేవలను నిరంతరాయంగా అందించాయని అన్నారు. వ్యాపారాలు, ఉద్యోగాలు కొనసాగిస్తూనే ఈ కష్టకాలంలో ప్రజలకు భరోసా ఇస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా మిత్ర ఫౌండేషన్ బాధ్యులు వరద బాధితులకు 650 నిత్యవసర సరుకుల కిట్స్, గ్యాస్ స్టవ్, రైస్ బ్యాగ్ అందించారు.
లి రాబోయే రోజుల్లో మరిన్నిసేవా కార్యక్రమాలు
రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఇంకా ఎక్కువ మంది బాధితులను ఆదుకునేందుకు మిత్ర ఫౌండేషన్ కట్టుబడి ఉందని ఛైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి స్థానిక ప్రజలు నుంచి అందుతున్న మద్దతు ఎంతో ప్రశంసనీయం అన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన సేవలను అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రత్యేకించి విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక రంగాల్లో మిత్ర ఫౌండేషన్ సేవలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేందర్, కార్పొరేటర్ రాపర్తి శరత్, స్థానిక మిత్ర ఫౌండేషన్ సభ్యులు చారుగుండ్ల రవి కుమార్, పాలవరపు శ్రీనివాస్, చెరుకూరి యుగేందర్, మహంకాళి నగేష్, రంగా శ్రీనివాస రావు, ఆత్మ కూరి రామారావు,గోళ్ల అవినాష్, కార్పొరేటర్ మాటేటి నాగేశ్వర రావు, చొక్కవరపు నవీన్ కుమార్, మాదుగుల ఉపేందర్ వేములపల్లి సీతా రాంబాబు దేవి శెట్టి మురళి తదితరులు పాల్గొన్నారు.









## నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టండి

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :**
నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మనుగడలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నిర్దిష్టమైన కార్యాచరణను తీసుకోవాలని ప్రజా పద్దుల కమిటీ సంఘం ఛైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో శుక్రవారం ఎమ్మెల్యే సమిక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నియోజక వర్గం పరిధిలో నెలకొన్న పలు సమస్యలు ప్రజలకు ఇబ్బందిగా, అభివృద్ధికి ఆటంకంగా మారాయని, ఆయా డివిజన్ల పరిధిలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్ ఎమ్మెల్యే దృష్టికి సమాచారాన్ని తీసుకొని రాగా వీలైనంత త్వరగా అట్టి అభివృద్ధికి కృషి చేయాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, పనులలో వేగం పెంచాలని జోనల్ కమి షనర్‌ను ఆదేశించారు. మంజీరా పైప్ లైన్ రోడ్డు నిర్మాణంపనులు వెంటనే చేపట్టాలని, శ్రీదేవి థియేటర్ నుండి అమిన్ పూర్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని, పాపిరెడ్డి కాలనీ నుండి జోనల్ కార్యలయం కు కలిపే లింక్ రోడ్డు పనులు ప్రథమ కర్తవ్యంగా భావించి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, గంగారాం హనుమాన్ దేవాలయం ప్రధాన రహదారి నుండి అపర్ణ వరకు లింక్ రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభయ్యేలా చూడాలాని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పర్యాటక రంగంపై అవగాహన ఉండాలి..

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
పర్యాటక రంగం, చరిత్ర పై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్బంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో అద్భుతమైన చారిత్రక సంపద ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చరిత్ర, సంస్కృతి తెలుసుకోవాలని సూచించారు. ప్రపంచ పర్యాటక సందర్బంగా పర్యాటకంపై నిర్వహించిన పోటీలనే కాకుండా వివిధ సందర్బాలలో జిల్లా విద్యార్థులు మన సంప్రదాయాన్ని వివిధ రూపంలో చూపించి అద్భుతమైన ప్రతిభ చూపిస్తున్నారని కొని యాడారు. గతంలో ఉన్న చరిత్రను మర్చిపోకుండా సంప్రదాయాన్ని, సంస్కృతిని కొనసాగించాలన్నారు.ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే పిల్లలమర్రి దేవాలయాలు నిర్మించి ప్రస్తుత సైన్స్ ను అబ్బురపరిస్తుందని తెలిపారు.జిల్లాలో ఎన్ని చారిత్రక, ప్రత్యేకమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిలో ప్రతి ఒక్క ప్రదేశానికి ఒక విశిష్టత ఉందని, వాటిని తప్పకుండా సందర్శించాలని కోరారు. ముందుగా పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటకం – శాంతిపై నిర్వహిం చిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్లు అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్ కుమార్ డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ ఏ రమేష్ కుమార్, డిఐఈఓ బాను నాయక్, ఎస్ఓడి జనార్ధన్, డిఎస్ఓ దేవరాజ్,జడ్జిలుగా రామ్ సుధీర్ రెడ్డి, ఎస్.కె రెహనా బేగం, మల్లేశం, డి.మల్లయ్య, ఉమారాణి వ్యవహరించారు.

# "ప్రజా పోరాట యోధుడు మన కొండా లక్ష్మణ్ బాపూజీ!

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఘన నివాళి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
తెలంగాణ ప్రజల అభివృద్ధి, ఆకాంక్షలను నెరవేర్చిన ప్రజాసేవకులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల అభివృద్ధి కొరకు, ఆశయాల కొరకు ఎంతో కృషి చేశారని, తెలంగాణ వెనుకబాటుతనాన్ని రూపుమాపడానికి దిశా నిర్దేశం చేశారని, ప్రజల మౌలిక సౌకర్యాలు, ఆర్థికంగా బలపడాలని ఎన్నో పోరాటాలు చేశారని అన్నారుఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనసూర్య, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి లత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పద్మారావు, బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత సత్యనారాయణ, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు తప్పట్ల శ్రీరాములు, పెరిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల రాంబాబు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గోగుల రమేష్, గండూరి రమేష్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పాశం అనంతరావు, మాల మహానాడు అధ్యక్షులు తల్లమల్ల హసేన్, బీసీ ఉద్యోగ సంఘం నాయకులు బెల్లంకొండ రామ్మూర్తి, టీఎన్జీవో జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి బట్టు గోపి, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి సమాజానికి ఆదర్శం

## అదనపు కలెక్టర్ టీ పూర్ణచంద్ర



**నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 27,(జనంసాక్షి):**
కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి సమాజానికి ఆదర్శమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర అన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్లో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాటస్ఫూర్తి తెలంగాణ ఉద్యమం కోసం తన సొంత ఇంటిని త్రుణప్రాయంగా వదిలేసిన ఉద్యమ స్ఫూర్తి కొండా లక్ష్మణ్ బాపూజిది అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బ గోని రమేష్ గౌడ్,బీసీ సంఘం నాయ కులు,పద్మశాలి సంఘం నాయకులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ బాపూజీ పై తడక యాదగిరి రచించిన పుస్తకాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విడుదల చేశారు.

**కలెక్టరేట్ లో :** నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కొండా లక్ష్మణ్ బాపూజి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

## ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం

## కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని





**కొత్తగూడెం సెప్టెంబరు 27 జనంసాక్షి :**
మున్సిపాలిటీలో ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పురపాలక కార్యాలయం పరిధి లోనీ 6, 12వార్డుల్లో రూ.4.70కోట్ల డిఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైన్లు, పార్కుల నిర్మాణపనులకు అయన శంకు స్థాపన చేశారు .ఇప్పటికే పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమా వేశాల్లో ఎంఎల్ఏ మాట్లాడుతూ గడిచిన పదినెలల కాలంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు .అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య సమస్య, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. పట్టణ ప్రజల ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేం దుకు కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. త్వరలో మంజూరు కానున్న ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు అందించి గృహ వసతి కల్పిస్తామని ప్రకటించారు. జరుగు తున్న అభివృద్ధి పనులు నాణ్యతగా, పదికాలాల పాటు నిలిచివుండేలా చేపట్టాలని , ఇందు కోసం సంబంధిత అధికారులు నిత్యం పర్య వేక్షించాలని, లోపాలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, ఇరిగేషన్ డీఈ రవికుమార్ , కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, నరసింహ, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, ఫేహీమ్, సుధాకర్, రంగారావు, రామారావు, దుర్గ, గోపికృష్ణ, ఖయుమ్, షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించాలి

## కలెక్టర్ జితేష్ వి పాటిల్




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబరు 27 జనంసాక్షి :**
విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యత తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని క్రీడా సంఘాల అసోసియేషన్ సెక్రటరీలు, క్రీడాకారులు, ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి విద్యార్థులు, జిల్లాస్థాయి యువజన ఉత్సవాలలో గెలుపొందిన యువ కళాకారులను సన్మానించి మెమెంటో అందజేశారు. అనంతరం చంద్రుగొండ మండలం బెండల పాడు అటవీ ప్రాంతం కనిగిరి గుట్టల విహారయాత్ర సందర్భంగా శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయం నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఈ విహారయాత్రలో రెండు బస్సుల్లో సుమారు 100 మందిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత సమయం ఉన్నప్పుడు జిల్లాలోని ఉన్న పర్యాటక ప్రాంతాలకు ఎక్కువగా వెళ్లి వాటి యొక్క గొప్పతనాన్ని అందరికీ తెలియజేయడం ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందని, అలాగే బెండలపాడు అటవీ ప్రాంతం మరియు కనిగిరి గుట్టల వంటి ప్రకృతి ప్రదేశాలకు వెళ్లి ఆహ్లాదకరంగా గడిపి ఆ ప్రాంతం యొక్క గొప్పతనం అందరికీ తెలియజేయాలని సూచించారు. అటువంటి ప్రదేశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ మండలం బెండలపాడు అటవీ ప్రాంత సందర్శనలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, స్థానిక క్రీడాకారులతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ జిల్లాలో పర్యాటక ప్రదేశాలను బాగా అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకుని వచ్చి బెండలపాడు కనిగిరి గుట్టల ప్రాంతం ను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరందామా రెడ్డి, జిల్లా ప్లానింగ్ అధికారి, చంద్రుగొండ స్పెషల్ ఆఫీసర్ కే. సంజీవ రావు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వనజ, పూర్ణ చందర్, అథ్లెటిక్ సెక్రటరీ మహిదర్, బాక్సింగ్ సెక్రటరీ రమేష్, కరాటే సెక్రటరీ శ్రీధర్, హాకీ కోచ్ ఇమామ్, ఆర్చేరి కోచ్ కళ్యాణ్, అథ్లెటిక్ కోచ్ నాగేందర్, క్రీడాకారులు, జూనియర్ కాలేజీ , సోషల్ వెల్ఫేర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# లోప పోషణ నివారణకు చర్యలు తీసుకోవాలి





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి సెప్టెంబరు 27 జనంసాక్షి :**
జిల్లాలో లోప పోషణ నివారణకి వైద్య శాఖ సమన్వయంతో క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించి పోషణ లోపం లేకుండా చూడాలని , అందుకుగాను ప్రతినెల మొదటి వారంలో అంగనవాడి కేంద్ర పరిధిలో నమోదైన గర్భిణీలు, పిల్లల ఎత్తు బరువులు పరీక్షించి, వారి ఆరోగ్య స్థితిగతిపై వైద్య శాఖ సమన్వయంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించా లని జిల్లా కలెక్టరు జితేష్ పటేల్ సూచించారు. శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయంలో సంబంధిత శాఖ శిక్షణ తరగతులకు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో ఉన్న అంగనవాడి టీచర్లు ఎప్పటికప్పుడు గర్భిణీ , చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై కుటుంబ సభ్యులకు తెలియజేసి సాధారణ స్థితికి వచ్చే వరకు పర్యవేక్షణ చేయాలని చెప్పారు . అంగన్వాడీ కేంద్రాలలో పెరటి తోటలు ఏర్పాటు చేసి స్థానికంగా లభించే పౌష్టికాహారాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించి, ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విలేజ్ హెల్త్ ,శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ డే రోజున వైద్య శాఖ సమన్వయంతో బరువులు ఎత్తులు క్రమం తప్పకుండా పరీక్షించి ఎన్ హెచ్ టి ఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. గర్భిణీలు ఎనీమియా వ్యాధి బారిన పడకుండా గర్భవతిగా ఉన్న సమయంలోనే పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ , జిల్లా సంక్షేమ అధికారిని వేల్పుల విజేత, డి ఐ ఓ బాలాజీ, జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు ,సిడిపిఓలు, సూపర్ వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది , ఐటి కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరికీ రుణాలు ఇవ్వాలి..

**● బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించాలి ● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
రైతులందరికీ కొత్త రుణాలు అందజేయాలని, రుణాల మంజూరులో జాప్యం చేయడం సరి కాదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ తెలిపారు.శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరం నందు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాలని, రుణ మంజూరులో బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే రుణాలు అందజేయా లన్నారు. గడిచిన, ప్రస్తుత ఆర్థిక సంవత్సరా లుగా మొదటి మూడు నెలలు బ్యాంకర్లు ప్రజలకు ఎలాంటి సహాయ సహకారాలు అందించారో బ్యాంకుల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ఆర్థిక సంవత్సరం లో 8994.16 కోట్ల రూపాయలను లక్ష్యంగా ఎంచుకోవడం జరిగిందని, ఈ మూడు నెలలలో ఏప్రిల్ నుండి జూన్ వరకు 2975.17 కోట్ల రూపాయలను బ్యాంకర్లు ప్రజలకు రుణాల రూపంలో ఇచ్చారని 33.08శాతం లక్ష్యాన్ని సాధించామని ఎల్డీఎం కలెక్టర్ కి తెలిపారు.పిఎం సన్నిధి పథకంలో భాగంగా గడిచిన మూడు నెలలలో 21354 వీధి వ్యాపారులకు రుణాలు అందించుటకు లక్ష్యంగా పెట్టుకొనగా 19389 మంది వీధి వ్యాపారులకు మెప్మా ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందని 90.79 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు.పంట రుణాలకు గాను ఈ ఆర్థిక సంవత్సరంలో 2942.48 కోట్ల రూపాయలు రైతులకు అందివ్వాలని, లక్ష్యంగా పెట్టుకొనగా గడిచిన మూడు నెలల్లో బ్యాంకర్లు1058.87 కోట్ల రూపాయలు పంట రుణాలు అందించడం జరిగిందని, 35.99 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 5625.92 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకొనగా బ్యాంకర్లు గడిచిన మూడు నెలలలో1951.68 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని ఎల్డిఎం కలెక్టర్ కి తెలిపారు.భారీ చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఈ ఆర్థిక సంవత్సరంలో 1624.49 కోట్ల రూపాయలు ప్రజలకు అందించాలని బ్యాంకింగ్ లక్ష్యంగా పెట్టు కొనగా, గడిచిన మూడు నెలల్లో 460.74 కోట్లు అందించి 28.36 శాతం సాధించాలని కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యత ఉన్న రంగాలకు 7570.66 కోట్లు రుణాలు పెట్టుకొనగా గడిచిన మూడు నెలలు 247.61 కోట్ల రూపాయలు ప్రజలకు అందించి 32.33 శాతం వృద్ధి సాధించారని పేర్కొన్నారు.స్వయం సహాయక సంఘాలకు గడిచిన మూడు నెలలలో 105.03 కోట్లు లక్ష్యంగా పెట్టు కొనగా 120.66 కోట్ల రూపాయలు బ్యాంకర్లు సంఘాలకు అందించడం జరిగిందని, 114.88 శాతం వృద్ధి సాధించారని తెలిపారు. బ్యాంకర్లు తమ లక్ష్యాలను ఈ ఆర్థిక సంవత్సరానికి గాను అధిగమించాలని రైతులు ఎవరిని ఇబ్బంది పెట్టొద్దని,వీధి వ్యాపారులకు మొదటగా ఇచ్చిన లోన్ రికవరీ తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే వారికి కూడా రుణాలు అందే విధంగా చూడాలని అన్నారు. ప్రాధాన్యత లేని రంగాలకు కూడా ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని బ్యాంకులను కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసి కన్వీనర్ ఎల్డిఎం బాపూజీ, ఆర్బిఐ ఏజీఎం గౌమతి, నాబార్డ్ జీఎం శ్రీ సత్యనారాయణ, డిఆర్డిఓ వీవి అప్పారావు, సిపిఓ ఎల్.కిషన్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిసిఓ పద్మ ,ఇండస్ట్రియల్ అధికారి సీతారాం, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్ ,అన్ని బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 26 పంచాయతీ రాజ్ రోడ్లు మంజూరు మరో 27 రోడ్లకు ప్రతిపాదనలు

## మంజూరైన రోడ్ల స్టేటస్ పై పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష

## మునుగోడు ఎమ్మెల్యేకోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మర్రిగూడ, సెప్టెంబర్ 27,( జనం సాక్షి ):**
మునుగోడు నియోజకవర్గం లో నల్గొండ జిల్లా పరిధిలో ఉన్న మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడెం, ఘట్టుప్పల్ మండలాల లో మంజూరైనా 26 పంచాయతీ రాజ్ రోడ్ల పనులపై మునుగోడు లోని తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు... పనులు ఏ స్టేజిలో ఉన్నాయి, టెండర్ ప్రాసెస్ పూర్తయిన తర్వాత మొదలయ్యాయా లేదా, సంబంధిత కాంట్రాక్టర్లు నిర్దేశించిన సమయంలో పూర్తి చేస్తారా లేదా అనే విషయాలపై చర్చించారు... పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గారితో మాట్లాడి ఈ రోడ్లను మంజూరు చేయించానని రోడ్ల నాణ్యత విషయంలో భద్రత విషయంలో రాజీ పడొద్దు అని అధికారులకు కాంట్రాక్టర్లకు సూచించారు... రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రమాదపు మూలమలుపులను తొలగించాలన్నారు... ఒకసారి రోడ్డు నిర్మాణాలు జరిగితే దానిపై కొన్ని లక్షల కుటుంబాలు ప్రయాణం చేస్తాయని రోడ్ల నిర్మాణము భద్రతగా ఉండాలని అధికారులను కోరారు...

# విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే ఆర్ట్ పోటీలు నిర్వహించాలి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి సెప్టెంబరు 27 జనంసాక్షి :**
వ్యర్థ పదార్థాలతో కళాత్మకమైన వస్తువును రూపొందించే విధంగా వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహద పడే వేస్ట్ తో ఆర్ట్ వంటి పోటీలను నిర్వహిఇస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుండి 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు కళాత్మకమైన వస్తువులను , ఉపాధ్యాయులు సమక్షంలో తయారు చేసుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించిన అనంతరం అక్టోబర్ ఒకటో తేదీన ఐ డి ఓ సి కార్యాలయం పాల్వంచలో జరిగే పోటీలకు హాజరు కావాలని సూచించారు. ఈ పోటీలలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేస్తారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థుల వివరాలను నేడు సంభందిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారా అందజేయాలని చెప్పారు.

# ఆహారపు అలవాట్ల మార్పు చైతన్యంతోనే పోషకాహార లోప నివారణ సాధ్యం

## అందరికీ పోషకాహారం'పై అవగాహన కార్యక్రమంలో

## జిల్లా అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర



**నల్గొండ బ్యూరో,సెప్టెంబర్ 27,(జనంసాక్షి) :**
ఆహారపు అలవాట్లలో మార్పులు, చైతన్యంతోనే సమాజంలో పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చని నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర పేర్కొన్నారు.జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో 'అందరికీ పోషకాహారం'పై నల్గొండ లో నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర సమాచార,అవగాహన కార్యక్రమం రెండవ రోజున గర్భిణులు,బాలింతలు, యువతులు పాల్గొన్నారు.ఈ సదస్సులో తాజా ఆహార మార్గదర్శకాలు,స్థూల-సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం,ఆహారంలో పోషక వివరాలను గుర్తించే విధానం వంటి అంశాలతో కూడిన ఫోటో ప్రదర్శనను నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ"వైవిధ్యభరితమైన మన పోషకాహార అంశాలపై అవగాహనతో కూడిన సమాచారాన్ని ప్రజలందరికీ చేరవేయడం ఒక సవాలు" అని అన్నారు.ఈ సవాళ్లను పరిష్కరించి పోషకాహారంపై సామాజిక మార్పు తేవడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఖనిజాలు,విటమిన్లు సమృద్ధిగా ఉన్న సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కౌమార బాలికలు, గర్భిణులు,బాలింతలలో రక్త హీనత నివారణతో పాటు, మంచి ఆరోగ్యం సొంతం అవుతుంది అన్నారు.జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళా,శిశు సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోషక ఆహార వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



# వంటింట్లో నూనెల మంట



- భారీగా పెరిగిన వంటనూనెల ధరలు
- లీటర్ ఆయిల్‌పై ఏకంగా రూ.20 వరకు పెరుగుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** పండుగ సీజన్‌లో వంటనూనెలు మంటపెడుతున్నాయి. వంట చేసుకోవాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. దసరా, దీపావళి వంటి కీలక పండుగల సమయంలో వంట నూనెల ధరలుభారీగా పెరగడం ఆందోళనకు గురి చేసింది. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ఏకంగా 130 రూపాయలకు చేరింది. రిటైల్‌గా వెల్లుల్లి 450 కిలో అమ్ముతున్నారు. ఉల్లి 70పైనే అమ్ముతున్నారు. ఇలా ఒక్కటేమిటి..అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. వీటికి తోడు నిత్యం వాడే నూనె ధరలు పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ఈ నెల రోజుల్లో ఆవనూనె ధరలు 9.10 శాతం, పామాయిల్ ధరలు 14.16 శాతం పెరిగాయి. నెల రోజుల్లో, ఆవనూనె ధర ఇటు రిటైల్ మార్కెట్‌లో అటు ఆన్‌లైన్ కిరాణా కంపెనీల పోర్టల్స్‌లో 26 శాతం పెరిగింది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌లో లీటరు ఆవనూనె రూ.139 కి లభించగా, ఇప్పుడు దీని ధర లీటరుకు రూ.176 కి చేరుకుంది. అంటే గత నెలలో ధరలు 26.61 శాతం పెరిగాయి. మస్టర్డ్ ఆయిల్‌ను ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వంటనూనెగా ఉపయోగిస్తారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఎడిబుల్ ఆయిల్ ధరల పెరుగుదల నిజమేనని చెబుతున్నాయి. కేంద్ర వినియోగదార్ల వ్యవహారాల శాఖకు చెందిన ధరల పర్యవేక్షణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. నెల క్రితం, 25 ఆగస్టు 2024న లీటరు ఆవాల నూనె రూ.139.19 కి లభించగా, ఇప్పుడు రూ.151.85 కి అందుబాటులో ఉంది. లీటరు ఆవనూనె దిల్లీలో రూ.165, ముంబయిలో రూ.183, కోల్‌కతాలో రూ.181, చెన్నైలో రూ.167 పలుకుతోంది. సాధారణంగా, దక్షిణ భారతదేశంలో వంటనూనెలుగా ఉపయోగించే పొద్దుతిరుగుడు పువ్వుల నూనె, పామాయిల్, సోయా ఆయిల్ రేట్లు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు రేటు రూ.119.38 గా ఉండగా, ప్రస్తుతం లీటరు రూ.129.88 కి లభిస్తోంది. నెల క్రితం లీటరు రూ.98.28 గా ఉన్న పామాయిల్ ఇప్పుడు లీటరుకు రూ.112.2 కి చేరింది. సోయా ఆయిల్ ధరలు కూడా నెల రోజుల్లో లీటరుకు రూ.117.45 నుంచి రూ.127.62 కి పెరిగింది. వెజిటబుల్ ఆయిల్ ధర లీటరుకు రూ.122.04 నుంచి రూ.129.04 కి ఎగబాకింది.డిబుల్ ఆయిల్‌ల దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనివల్లే వంటనూనెల దిగుమతులు ఖరీదయ్యాయి. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామాయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని 0 నుంచి 20 శాతానికి; ర్గి÷న్డ్ ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతిపై సుంకాన్ని 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచింది.




## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లేనట్లేనా?




**విశాఖపట్నం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** 2019లో రెండోసారి కొలువు దీరిన తర్వాత విశాఖ స్టీల్ ప్రైవేటీకరిస్తామని కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆంధ్రప్రదేశ్ పౌరుల భావోద్వేగాలతో ముడి పడి ఉన్న అంశం కావడంతో కేంద్రం వెనుకడుగు వేసినట్లు తెలుస్తున్నది. ప్రైవేటీకరించడానికి బదులు మరో కేంద్ర ప్రభుత్వ రంగ స్టీల్ సంస్థ 'సెయిల్'లో విశాఖ స్టీల్ విలీనం చేయడానికి గల అవకాశాలను కేంద్రం పరిశీలిస్తున్నది. అందుకోసం ఫైనాన్సియల్, ఆపరేషనల్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నది.

ఇందులో భాగంగా ఆర్ఐఎన్ఎల్ కార్యకలాపాల నిర్వహణకు కేంద్రం నిధులు సమకూరుస్తుంది. బ్యాంకు రుణాల పరిష్కారంతోపాటు విశాఖ స్టీల్ ఆధీనంలో ఉన్న భూమిని ఎన్ఎండీసీకి విక్రయించే యోచనలో కేంద్రం ఉందని తెలుస్తున్నది. ఈ విషయమై ఇటీవలే డీఎఫ్ఎస్ కార్యదర్శి, స్టీల్ కార్యదర్శి, ఎస్బీఐ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఆర్ఐఎన్ఎల్‌కు గణనీయ స్థాయిలో రుణాలిచ్చిన బ్యాంకుల్లో ఎస్బీఐ ఒకటి. విశాఖ స్టీల్‌కు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా కేంద్రం అడుగులేస్తున్నదని అధికార వర్గాలు తెలిపాయి.

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో స్టీల్ శాఖ ఆధీనంలో పని చేయడంతోపాటు 75 లక్షల టన్నుల స్టీల్ ఆపరేటింగ్ సామర్థ్యం గల ప్లాంట్ 'రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్). దేశంలోనే సముద్ర తీరాన్నే కొలువుదీరిన తొలి సమగ్ర స్టీల్ ప్లాంట్ ఇది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) కూడా స్టీల్ శాఖ ఆధీనంలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో విశాఖ స్టీల్‌కు అవసరమైన నిధులు సమకూర్చేందుకు రుణ దాతలతో సంప్రదించడంతోపాటు సంస్థకు గల 1500–2000 ఎకరాల భూమిని ఎన్ఎండీసీకి పెల్లెట్ ప్లాంట్ కోసం విక్రయించడం ద్వారా నిధులు సమకూర్చుకోవడం మరొక ఆప్షన్. క్యాప్టివ్ ఐరన్ ఓర్ గనులను కేటాయిస్తే విశాఖ స్టీల్‌కు అప్పుల బాధ తప్పుతుందని విశాఖ స్టీల్ కార్మికుల సంఘం నాయకుడు జే అయోధ్య రామ్ చెప్పారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో అధిక ధరకు ఐరన్ ఓర్ కొనుగోలు చేస్తున్నారన్నారు.

2021 జనవరిలో కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సూత్రప్రాయంగా 'విశాఖ స్టీల్'ను 100 శాతం ప్రైవేటీకరించేందుకు ఆమోదం తెలిపింది. విశాఖ స్టీల్ అనుబంధ సంస్థల్లో ఆ సంస్థ వాటాలను వ్యూహాత్మకంగా తగ్గిస్తూ ప్రైవేటీకరించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తున్నది. బ్యాంకుల వద్ద విశాఖ స్టీల్ తీసుకున్న రూ.35 వేల కోట్ల రుణాలు దాదాపు మొండి బకాయిలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 512 | ₹ 61 |
| వరంగల్ | ₹ 512 | ₹61 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹75,110 (24 క్యారెట్లు) | ₹68,850 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
| --- | --- |
| ₹68,850 (22 క్యారెట్లు) | ₹75,110 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹97,500

# దృష్టంతా హైదరాబాద్ మీదే..

- కీలక రంగాల్లో కంపెనీలకు తెలంగాణ ఆహ్వానం
- రాష్ట్ర ప్రభుత్వ స్టార్టప్ ప్లాన్స్



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** హైదరాబాద్ తెలంగాణలోని కొత్త ప్రభుత్వం కింద వ్యాపారం విషయంలో అతిపెద్ద షిఫ్ట్ చూస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహానగరాన్ని ఆర్థికంగానూ బలమైనదిగా నిర్మించే క్రమంలో ప్రపంచ కంపెనీలకు ఆహ్వానం పలుకుతోంది. ఈ క్రమంలో స్టార్టప్స్, ఏఐ, ఐటీ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టిని కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు స్టార్టప్ కంపెనీలకు అవసరమైన ఎకో సిస్టమ్ బెంగళూరులో ఉన్నందున చాలా సంస్థలు అక్కడి నుంచి వ్యాపారాలను కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం హైదరాబాదును స్టార్టప్ కంపెనీలకు గమ్యస్థానంగా మార్చటంతో పాటు యూనికార్న్‌లను నిర్మించాలని ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలో మెకానికల్, వ్యవసాయ, హెల్త్ టెక్ స్టార్టప్‌ల వంటి సాఫ్ట్‌వేర్, టెక్నాలజీ రంగాలకు అతీతంగా ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై తెలంగాణ దృష్టి సారిస్తోందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్ 2024లో వెల్లడించారు. దేశీయంగా, అంతర్జాతీయంగా మార్కెట్‌లను కనుగొనడంలో వారికి సహాయపడటం ద్వారా అన్ని రకాల స్టార్టప్‌లను పెంపొందించే పర్యావరణ వ్యవస్థను నిర్మించాలనే ప్రభుత్వ నిబద్ధతను నొక్కిచెప్పారు.

స్టార్టప్ కంపెనీలు తమ సామర్థ్యాన్ని చేరుకునేలా సహాయక మౌలిక సదుపాయాలను సృష్టించాలనుకుంటున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రానున్న సంవత్సరాల్లో తెలంగాణ నుంచి 40–50 యుని కార్న్‌లను పెంపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ ముందుకు సాగుతోందని ఆయన వ్యక్తం చేశారు. ఏఐకి ప్రపంచ రాజధానిగా తెలంగాణను తీర్చిదిద్దాలనుకుంటున్నామని ఆయన చెప్పారు. మిషన్‌లో భాగంగా ఏఐ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో యువతకు శిక్షణ ఇవ్వడానికి త్వరలో నైపుణ్యాల విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్ 2024 కార్యక్రమానికి 15 దేశాల నుంచి 250 మందికి పైగా చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్‌లు, 300 వెంచర్ క్యాపిటలిస్ట్‌లు, 800 గ్లోబల్ ఏంజెల్స్, 5,000 మంది డెలిగేట్‌లను ఆకర్షించింది. ఏఐ సాంకేతికతపై చర్చలతో పాటు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో గ్రామీణ యువత సామర్థ్యాలపై కూడా ఈ కార్యక్రమంలో చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు గ్రామీణ భారతదేశంపై దృష్టి పెట్టవలసిన అవసరాన్ని అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ చైర్మన్ చౌదరి ఎత్తిచూపారు. గ్రామీణ భారతదేశం స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు మరింత చురుగ్గా సహకరించేలా చేయడం వల్ల స్థిరమైన వృద్ధిని సాధించడంతోపాటు జనాభాలోని పెద్ద వర్గానికి ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు.

## జాతీయం అంతర్జాతీయం

### ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో

# శాశ్వత సభ్యత్వానికి యూకే మద్దతు



**లండన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రపంచ శాంతి స్థాపనే లక్ష్యంగా ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దిశగా ప్రధాని మోదీ ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతున్నారు. భారత్ ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మద్దతు లభిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు భారత్ కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించాయి. తాజాగా ఈ జాబితాలోకి యూకే కూడా వచ్చి చేరింది. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. యూఎన్ఎస్సీలో మరిన్ని దేశాలు ప్రాతినిధ్యం వహించాలని పేర్కొన్నారు. 'భద్రతా మండలిలో తగినన్ని సభ్యదేశాలు లేనంతవరకూ ప్రతిపక్ష ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు సాగడం కష్టం. కాబట్టి భద్రతామండలిని మరింత పటిష్టం చేయాలి. ఇందులో భాగంగానే శాశ్వత సభ్యత్వ దేశాల సంఖ్యను పెంచాలి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ ఉండాలని కోరుకుంటున్నాం. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని అన్నారు.

అంతకుముందు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రన్ స్పందించిన విషయం తెలిసిందే. జనరల్ అసెంబ్లీలో మెక్రాన్ ప్రసంగిస్తూ.. యూఎన్ఎస్సీ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు ప్రకటించారు. యూఎన్ఎస్సీ సమర్థతను పునరుద్ధరించడానికి ఈ మార్పులు తగినవి అని పేర్కొన్నారు. ఇక గత వారం ఐరాస భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక అమెరికన్ టైకూన్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సైతం గతంలోనే భారత్‌కు మద్దతు ప్రకటించారు.

కాగా, భద్రతా మండలిలో భారత్‌కు సాధారణ సభ్యత్వం మాత్రమే ఉంది. భద్రతా మండలిలో ప్రస్తుతం చైనా, అమెరికా, యూకే, ఫ్రాన్స్, రష్యా దేశాలు శాశ్వత సభ్య దేశాలుగా కొనసాగుతున్నాయి. ఈ ఐదు దేశాలకు ప్రత్యేకంగా వీటో పవర్ ఉంటుంది. మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశం అభ్యంతరం వ్యక్తం చేసినా సరే ఆ నిర్ణయం వీగిపోతుంది. శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఐదింటిలో నాలుగు మద్దతు ఇస్తున్నా.. చైనా మాత్రం భారత్ ప్రయత్నాలకు అడ్డుపడుతోంది.

## లడ్డూ కల్తీలో బాధ్యులు మూల్యం చెల్లించుకోవాల్సిందే

- హిందూమతాన్ని కించపర్చడం సెక్యులరిజమా
- ఎక్స్‌లో నటి ఖుష్బూ పోస్ట్



**చెన్నై, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోన్న లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ పెట్టారు. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే నన్నారు. 'తిరుమల లడ్డూ గురించి చాలామంది మాట్లాడుకుంటున్నారు. హిందూ మతాన్ని లక్ష్యంగా చేసుకున్నప్పుడు మనల్ని సైలెంట్‌గా ఉండమంటే ఎలా? ఇతర మతాల విషయంలోనూ ఇలానే వ్యవహరిస్తారా? అలాంటి ఆలోచన చేయాలంటేనే చాలామందికి వెన్నులో వణుకు పుడుతుంది. లౌకికవాదం అంటే ప్రతీ మతాన్ని గౌరవించడం. అంతేగానీ పక్షపాతంతో వ్యవహరించొద్దు. నేను హిందూ మతంలో పుట్టకపోయినా.. ఈ మతానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను. నాకు అన్ని మతాలు సమానమే. హిందూ మతాన్ని అవమానించొద్దు.. చులకనగా మాట్లాడొద్దు. దాన్ని అగౌరవపరిస్తే సహించొద్దు. తిరుమల లడ్డూలు కల్తీ చేయడమంటే కోట్లాది మంది ప్రజల మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతీయడమే. బాధ్యులు కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సిందే. వేంకటేశ్వరస్వామి చూస్తున్నాడు' అని ఖుష్బూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం వివాదం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ విషయంలో రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈనేపథ్యంలో ఖుష్బూ కూడా తన అభిప్రాయాన్ని తెలియచేశారు.

## విమానంలో కుప్పకూలిన యువతి

- ఎమర్జెన్సీ ల్యాండింగ్ తర్వాత మృతి



**కోల్‌కతా, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ఇరాక్ నుంచి చైనాకు వెళ్తున్న ఇరాకీ యువతి విమానంలో కుప్పకూలింది. ఆ విమానం భారత్‌లో అత్యవసరంగా ల్యాండ్ కాగానే ఆ అమ్మాయి మరణించింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫార్మాల్టీల తర్వాత ఆ యువతి మృతదేహాన్ని ఆమె కుటుంబానికి అప్పగిస్తామని వెల్లడించారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్ జిల్లాకు చెందిన 16 ఏళ్ల యువతి బుధవారం రాత్రి తన కుటుంబంతో కలిసి చైనాలోని గ్వాంగ్‌జౌకు విమానంలో బయలుదేరింది. ఇరాకీ ఎయిర్‌వేస్ విమానంలో ప్రయాణించిన ఆమె ఉన్నట్టుండి కుప్పకూలిపోయింది. దీంతో ఆ విమానాన్ని దారి మళ్లించారు. బుధవారం రాత్రి 10.18 గంటలకు కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమర్జెన్సీగా ల్యాండ్ చేశారు. ఎయిర్‌పోర్ట్‌లోని మెడికల్ సిబ్బంది వెంటనే ఇరాకీ యువతిని పరిశీలించారు. ఆమె మరణించిందని గ్రహించారు. వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా ఆ యువతి అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు కూడా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేశారు. ఢిల్లీలోని ఇరాక్ రాయబార కార్యాలయానికి ఈ సమాచారం అందించారు. మరోవైపు లాంఛనాలు పూర్తైన తర్వాత ఇరాకీ బాలిక మృతదేహాన్ని వారి కుటుంబానికి అప్పగిస్తామని పోలీసులు చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాకీ విమానం మిగిలిన ప్రయాణికులతో గురువారం తెల్లవారు జామున 1.49 గంటలకు గమ్యస్థానానికి బయలుదేరిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు శుక్రవారం వెల్లడించారు.

## తిరుమలను అపవిత్రం చేసిన ఘనత జగన్‌దే

- అన్యమతస్థులకు తిరుమల ప్రవేశం కల్పించారు
- బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పురందేశ్వరి

**విజయవాడ, సెప్టెంబర్27 (జనంసాక్షి) :** తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం కల్తీ చేసిందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అన్యమతస్తులను టీటీడీలోకి తీసుకోవద్దని చెప్పినా కూడా ఆనాడు మాజీ సీఎం జగన్ తమ మాట వినలేదని అన్నారు. తిరుమల గురించి లక్షలాది మంది సంతకాల సేకరణ చేసి ఇచ్చినా జగన్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ సభ్యత్వ నమోదుపై రాష్ట్రస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. బీజేపీఅధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ... ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని ప్రజల కోసం అమలు చేస్తోందని దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. నేడు ఏపీలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో మంచి పాలన సాగుతుందని అన్నారు. 13 జిల్లాల్లో వైసీపీ నేతలకు నచ్చిన వారికి ఇసుక రీచ్‌లు కట్టబెట్టి దోపిడీ చేశారని దగ్గుబాటి పురంధేశ్వరి ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అన్నారు. బీజేపీ ప్రజల పక్షాన నిలబడుతుందని.. వారి కోసం కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి నేతలు కలిసి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర బ్జడెట్‌లో కూడా ఏపీ అభివృద్ధికి మోదీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. పోలవరం నిర్మాణం కూడా పూర్తి చేసి, రైతుల కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీక రణపై కొంతమంది రాద్ధాంతం చేస్తున్నారని దగ్గుబాటి పురంధేశ్వరి మండిపడ్డారు. స్టీల్ పాంట్‌ను లాభాల బాటలో ఎలా నడిపించాలనే దానిపై ఇటీవల సీఎం చంద్రబాబు కూడా సమీక్ష చేశారని దగ్గుబాటి పురంధేశ్వరి గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్న భాగస్వామ్యాన్ని అదే విధంగా కొనసాగిస్తూ.. లాభాల్లో నడిచేలా కార్యాచరణ రూపొందిస్తామని దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టం చేశారు. గతంలో అభివృద్ధి పుల కోసం కేంద్ర ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వాన్ని భూమిని కేటాయించాలని అడిగితే నిరుప యోగమైన భూమిని ఇచ్చారని అన్నారు. కానీ నిందలు మాత్రం కేంద్ర ప్రభుత్వంపై వేసి జగన్ తప్పుకున్నారని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన అసత్యాలను తిప్పి కొట్టాలని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే భూమిని కేటాయించారని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందకుండా నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 13వేల పైబడి పంచాయతీల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే సమయంలో గ్రామసభలు నిర్వహించారని దగ్గుబాటి పురంధేశ్వరి ప్రశంసించారు.

## కేరళలో మరో మంకీపాక్స్ కేసు



**తిరువనంతపురం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** ప్రపంచ దేశాల్లో కలకలం సృష్టించిన ప్రాణాంతక మంకీపాక్స్ భారత్ లోనూ కలకలం రేపుతోంది. తాజాగా కేరళలో మరో మంకీపాక్స్ కేసు నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. దాంతో మన దేశంలో మొత్తం కేసుల సంఖ్య మూడుకు చేరింది. ఎర్నాకుళం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మంకీపాక్స్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. అతని నమూనాలను పరీక్షల కోసం పంపగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. భారత్‌లో సెప్టెంబర్ 9న తొలి మంకీపాక్స్ కేసు నమోదైంది. విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడి నమూనాలు పరీక్షించగా అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్–2 రకంగా నిర్ధారించారు. అనంతరం యూఏఈ నుంచి కేరళకు వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి మంకీపాక్స్ నిర్ధారణ అయినట్లుగా సెప్టెంబర్ 18న కేరళ ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 122 దేశాల్లో 99,518 మంకీ పాక్స్ కేసులు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది. దాంతో ఇది ప్రపంచ దేశాలకు పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ఈ వ్యాధి వ్యాప్తిని నిరోధించడానికి పలు మార్గదర్శకాలను జారీచేసింది. ఈ మహమ్మారి ఆఫ్రికా దేశాల్లో విస్తృతంగా వ్యాపిస్తుండటంతో అక్కడ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించినట్లుగా అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.

## సిద్ధరామయ్యపై లోకాయుక్త కేసు

**బెంగళూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై ఆ రాష్ట్ర అవినీతి నిరోధక సంఘమైన లోకాయుక్త కేసు నమోదు చేసింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూకేటాయింపుల కుంభకోణంలో సిద్ధరామయ్యను ఏ1 నిందితుడిగా, ఆయన భార్య పార్వతిని ఏ2గా, బావమరిది మల్లికార్జున్ స్వామిని ఏ3గా, భూమి అమ్మిన దేవరాజ్‌ను ఏ4గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కోట్ల విలువైన భూమిని దేవరాజ్ నుంచి మల్లికార్జున్ స్వామి కొనుగోలు చేశాడు. ఆ భూమిని అక్క పార్వతికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. మైసూరు అభివృద్ధి సంస్థ పార్వతి నుంచి 3.16 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నది. ఎక్కువ విలువైన ప్లాట్లను పరిహారంగా ఆమెకు ఇచ్చింది. అయితే చట్టవిరుద్ధమైన భూ పరిహార ఒప్పందం వల్ల సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య సుమారు రూ.4,000 కోట్ల మేర లబ్ధి పొందినట్లు ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేసేందుకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ ఆగస్టులో అనుమతి ఇచ్చారు.

## సంక్షిప్తంగా..



### బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నిజాంసాగర్ సెప్టెంబర్ 27(జనంసాక్షి)
మండలం లోని మల్లూరు ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం రోజున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తొమ్మిది సంవత్సరాలుగా ఈ పాఠశాలలో తమ సేవలను అందించి విద్యార్థులకు ఎంతో నాణ్యమైన విద్యను బోధించడం జరిగిందన్నారు. వారు పని చేసిన 9 సంవత్సరాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గడిచి పోయారని గుర్తు చేసుకున్నారు. వారు ఏ పాఠశాలకు వెళ్లిన ఆ పాఠశాల పురోగతి సాధించాలని కోరారు. అదేవిధంగా వారు కూడా ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు మనీ, సిహెచ్ .సంపత్, సిహెచ్. శ్రీ విద్య తోపాటు సి ఆర్ పి బి శ్రీధర్ కుమార్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, మౌనిక, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్స



నిజాంసాగర్ సెప్టెంబర్ 27(జనంసాక్షి)
మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం నదు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అరుణ్ కుమార్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వ్యాయామాల గురించి అవగాహన కల్పిస్తూ ఫిజియోథెరపీ చికిత్సలు 8 మందికి ప్రత్యేక అవసరాల గల పిల్లలకి వ్యాయామాలు చేయడం జరిగింది. పిల్లలకు ఇంటి వద్ద క్రమం తప్పకుండా చిన్నచిన్న వ్యాయా మాలు చేయించాలని సూచించారు. ఎంఈఓ తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్ గౌడ్, ఐఇఆర్టీలు చిన్న సాయిలు, సునీల్, సిఆర్పి వరలక్ష్మి, సిబ్బంది పంచాక్షరి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### బిజెపిలో చేరికలు



కమ్మర్పల్లి27సెప్టెంబర్(జనంసాక్షి)
కమ్మర్పల్లి మండల కేంద్రానికి చెందిన టిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి ,మండల సోషల్ మీడియా అధ్యక్షులు కమలాకర్ ఆధ్వర్యంలో ధర్మపురి అరవింద్ సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చింత గణేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి పనులకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ ధర్మపురి అరవింద్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని క్రమశిక్షణ గల సిద్ధాంతం గల బిజెపి పార్టీలో చేరానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుపుకై శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అన్నారు.

### విద్యాశాఖ అధికారులకు సన్మానం



బోధన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):
బోధన్ మండల విద్యాశాఖ అధికారిగా చార్జ్ తీసుకున్న నాగయ్య, సాలూర విద్యాశాఖ అధికారి మంజుష, బోధన్ నుండి మోస్రా మండలానికి వెళ్తున్న నాగనాథ్ లను శుక్రవారం బోధన్ ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజు, గౌరవ అధ్యక్షులు విద్యా వికాస్ శ్రీనివాస్ రావ్, ఇందూరు కిషోర్, మాతృశ్రీ దిగంబర్, విజయసాయి చక్రవర్తి, జయప్రకాష్, సురేష్,సుబ్బారావు,చౌదారెడ్డి,సూర్యప్రకాష్ పాల్గొన్నారు

### చదరంగ క్రీడాకారులకు భారీ నజరానా

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెస్ ఒలంపియాడ్ లో స్వర్ణపథకం సాధించిన తెలంగాణ ఆటగాళ్లు మర్యాదపూర్వకంగా కలిసారు. చెస్ ఒలంపియాడ్‌లో స్వర్ణపథకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లను సిఎం రేవంత్ అభినందించారు. వారికి 25 లక్షల చొప్పున నగదు బహుమతనిని ప్రకటించారు. భారతదేశం తరపున మొదటిసారి స్వర్ణపథకాలు సాధించిన తెలంగాణ ఆటగాళ్లు అర్జున్ (హన్మకొండ), ద్రోణవల్లి హారిక (ఖమ్మం). ఇద్దరు ఆటగాళ్లకు చెరో రూ. 25లక్షలు నగదు ప్రోత్సాహకం ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిని అభినందించారు. సెప్టెంబర్ 10 నుంచి 23 వరకు బుడా పెస్ట్, హంగరీలో జరిగిన చెస్ ఒలంపియాడ్‌లో వీరు స్వర్ణపతకాలు సాధించారు.

# జోరుగా బెల్ట్ దందా

- జోరుగా వేలం పాటలు
- పల్లెలకు అవే ఆదాయమార్గాలు
- పల్లె,పట్టణం అనే తేడా లేకుండా ఏరులై పారుతున్న మద్యం
- మద్యం దుకాణ దారులే కమీషన్లకు అమ్ముతున్న వైనం

## పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ దుకాణాలు

**కామారెడ్డి జిల్లాలో బెల్ట్ దందా మూడు క్వార్టర్‌లు,ఆరు ఫుల్‌బాటిల్‌గా కొనసాగుతుంది. ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ప్రతివాడల్లో,పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా కిరణా దుకాణం నుండి మొదలుకొని పాన్‌షాపులు,కల్లు కంపౌడ్‌ల వద్ద మద్యం ఏరులై పారుతుంది. కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల్లోను దక్కించుకుకోవాడనికి వేలం పాటలో వేల రూపాయలు పాటపాడి దక్కించుకుంటున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్సైజ్ అధికారులు ఆదాయ మార్గాలు కావడంలో వాటివైపు కన్నెతి చూడటం లేదు. బెల్ట్ దందాతో గ్రామాల్లో 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉంటుంది. దీంతో యువత వ్యవసాయకూలీలు మద్యానికి బానిసై ఉదయం నుంచి సాయంత్రం వరకు తాగుతు డబ్బును,ఆరోగ్యాన్ని కుల్ల చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామంలో రెండు నుంచి ఐదు బెల్ట్ షాపులు ఉన్నాయంటేనే పరిస్థితి అర్థమవుతుంది.**

కామారెడ్డిబ్యూరో(జనంసాక్షి):

బెల్ట్ దుకాణాలు,పల్లె,పట్టణ ప్రజలకు మత్తులో ముంచేత్తున్నాయి. నిబంధనలకు వ్యతిరేఖంగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని వైన్స్‌షాపుల వారే కమిషన్లకు బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమిషన్లు అందిస్తుండటంతో బెల్ట్ షాపుల నిర్వహకులు ఒకరిని చూసి మరోకరు ఈ దందాను కొనసాగిస్తున్నారు. ఉదయం అర్థరాత్రి వరకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. దసరా పండుగ రావడంతో గ్రామాల్లో ప్రతి సంవత్సరం వేలం పాటలో బెల్ట్ షాపులను దక్కించుకోవడం అనవాయితీగా వస్తుంది. గత సంవత్సరం



భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఎకంగా బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం పాట పలికినది జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకేత్తించింది. ఏడాదికి రెండు లక్షలకు పైగా గ్రామానికి అందించి బెల్ట్ షాపును దక్కించుకోవడం జరిగింది. ఈ బెల్ట్ షాపు వేలం ధరతో జిల్లా అంతటా చర్చ జరిగింది. అయినప్పటికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో దాదాపు 1500లకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయి. బెల్ట్ దుకాణాల్లో బాటిళ్లను య ంఆర్‌పి కంటే 20 నుంచి 30 ధరలకు ఎక్కువ విక్రయిస్తున్నారు. అలాగే కొన్ని బెల్ట్ షాపుల్లో మద్యాన్ని కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. ఇలా గ్రామాల్లో మద్యం మత్తులో ఉండటంతో గొడవలు అధికంగా జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ దందా జోరుగా సాగుతుంది. జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్డులోని ఒక టీ దుకాణం వీక్లీ మార్కెట్ ప్రాంతంలోని కల్లు కంపోండ్ వద్ద హరిజన వాడ ప్రాంతంలో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇండ్లలోనే అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఉదయం లెవగానే బెల్డ్ దుకాణాలకు వెళ్తుతూ ఆరోగ్యాలను నాశనం చేసుకుంటున్నారు. మరి కొందరు అయితే మొబైల్ తరహాలో మధ్యాన్ని అడ్డాల వద్ద విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు పనికి వెళ్లడం కంటే తాగి పండుకుంటున్నారు. ఇంద్రనగర్,రాజీవ్‌నగర్,రామారెడ్డి రోడ్డు ప్రాంతాల్లోని కల్లు కంపొడ్‌ల వద్ద దుకాణాల్లో మద్యం సేవించడం పనిపాటిగా మారింది. ఇది తెలిసిన అధికారులు కన్నెతి చూడటం లేదు.

మమూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసు ఎక్సైజ్ సిబ్బందికి వారం,నెలకు చొప్పున మూడుపులు అందుతుండటంతో బెల్ట్ షాపుల దందా యాథేచ్ఛగా కొనసాగుతుంది. గత కొన్ని ఏండ్లుగా ఈ బెల్ట్ దందాలు కొనసాగిస్తున్నారు. కామారెడ్డి,బాన్సువాడ,ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ప్రతి తండాలో మొదలుకొని పల్లెల్లో బెల్ట్ దందా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది.

### ప్రభుత్వం నిఘా పెట్టాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాల్లో బెల్ట్ షాపులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నామా మాత్రం దాడులు చేసి కేసులు చేశారు. ఈ దాడులు అమ్మకాలు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రభుత్వం స్వాయనా ముఖ్యమంత్రి చెప్పిన జిల్లాలో బెల్ట్ దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. దీంతో ప్రజలకు ఎల్లవేళలా మద్యం అందుబాటులో ఉంటుంది. డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని కూడా పాడు చేసుకుంటూ మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. మద్యాన్ని సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాల బారిన పడుతు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిఘాపెట్టి బెల్ట్ దందాను నివారించాలని పలువురు కొరుతున్నారు.





## విద్యార్థులు 240మంది.. గురువులు నలుగురు

- ఉపాధ్యాయులను వెంటనే సమకూర్చాలి
- మిట్టపల్లి అశోక్



గంభీరావుపేట సెప్టెంబర్ 27 (జనంసాక్షి)
రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో మొట్టమొదటి కేజీ టు పీజీ విద్య ప్రాంగణం ఏర్పాటు చేశారు, ప్రాంగణంలోని మండల ప్రాథమిక పాఠశాలలో 240 విద్యార్థుల గాను కేవలం నలుగురు ఉపాధ్యాయులతోనే విద్య బోధన కొనసాగుతా ఉంది. ఈ విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, అనుభవం అయిన ఉపాధ్యాయులతో విద్య బోధన అందిస్తామని దాని ఆశించి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద మొత్తంలో తమ పిల్లల్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం 240 విద్యార్థి విద్యార్థులు ఉన్నారు, నలుగురు ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుకోలేకపోతున్నారు, అటు విద్యార్థులు ఇటు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు, పాఠశాలలో ఎన్నోసార్లు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి మాకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని పై అధికారులకు నివేదించారు కానీ ఇప్పటివరకు ఏ ఒక్క ఉపాధ్యాయుని కూడా అదనంగా కేటాయించలేదు. దీనితో తల్లిదండ్రులు ఆందోళన చెంది తమ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారు ఇప్పటికే దాదాపు 40 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చేరడం జరిగింది, ఇప్పటికైనా అధికారులు స్పందించి సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## అంగన్వాడి కేంద్రం తనిఖీ

పెద్ద కొడప్గల్ 27 సెప్టెంబర్ (జనంసాక్షి):
మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి కిషన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. వయస్సు కు తగ్గట్టు బరువు, ఎత్తు ఎదిగేందుకు సరైన పోషక ఆహారం అందించాలని సూచించారు. తదనంతరం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని నీళ్లు నిలువ ఉంచవద్దని, నీటి నిలువ వల్ల అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని పలు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, తహసిల్దార్ దశరథ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు, ఆశ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## భావి తరాలకు స్ఫూర్తి.. కొండా లక్ష్మణ్ బాపూజీ

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి)
:స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి అద్యం పోసిన కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కోసం తన పదవిని త్యాగం చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారిని స్మరించకుంటూ శుక్రవారం డీసీసీ అధ్యక్షులు, మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ లతో పాటు బీసీ సెల్ నాయకులు, బీసీ, పద్మశాలి కుల సంఘాల నేతల సమక్షంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. మూడు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్రం కోసం తన ఆస్తిని, పదవిని, తన ప్రాణాన్ని వదులుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ మరణించిన రోజు కూడా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చూడటానికి కూడా రాకపోవడం విచారకరం. తెలంగాణ రాష్ట్ర ప్రదాత సోనియా గాంధీ కొండా లక్ష్మణ్ బాపూజీ మరణం వార్త విన్న వెంటనే వారికి నివాళులర్పించడం జరిగింది. నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ



రాష్ట్ర వ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా ఘనంగా నిర్వహించి త్యాగమూర్తుల గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు చెర్ల పద్మ, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, పిసిసి ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాముడి రాజిరెడ్డి, కంకణాల అనీల్ కుమార్, నూనె గోపాల్ రెడ్డి, పోరాండ్ల రమేష్ , కుర్ర పోశయ్య, గంగుల దిలీప్, కీర్తి కుమార్, మహేష్ , తదితరులు పాల్గొన్నారు.

**కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి**

**- కలెక్టర్ పమేలా సత్పతి నివాళులు**

కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):
తెలంగాణ సాధనకు పోరాడిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బైపాస్ రోడ్డు లో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లా డుతూ... బడుగు, బలహీన వర్గాల కోసం బాపూజీ చేసిన కృషి మరువలేనిదని మనమంతా వారు చూపిన బాటలో నడవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ (రెవెన్యూ), సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.





## లాభాల్లోవాటాపై తప్పుదోవ పట్టిస్తున్నారు

- కార్మికులను మోసం చేస్తున్న కార్మిక సంఘాలు
- ఏఐటియుసి పై విమర్శలు చేయడం అర్థరహితం
- లాభాల్లో వాటా హక్కు సాధించింది ఏఐటియుసి

**గోదావరిఖని, జనంసాక్షి:**యాజమాన్యా న్ని, ప్రభుత్వాన్ని ఒప్పించి కాంట్రాక్టు కార్మి కులకు ఐదు వేల రూపాయలు లాభాల్లో వాటా బోనస్ ఇప్పిస్తున్నామని,గుర్తింపు సంఘం గా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని..కార్మికుల హక్కుల రక్షణ కోసం, సంస్థ మనుగడ కోసం ఏ ప్రభుత్వం ఉన్నా ఏఐటియుసి పోరాటాలు చేస్తుందనీ ఆ సంగా అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు.సింగరేణి లో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదన్నారు. చట్ట ప్రకారం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి, పైరవీలతో కాదు. నిజాయితీ గల అధికారులను వేదింపులకు గురి చేయొద్దు, అవినీతి అధికారుల పై చర్యలు తీసుకోవాలన్నారు. జిడికె 2వ ఇంక్లైన్ గేట్ మీటింగ్ లో సీతారామయ్య పాల్గొని మాట్లాడారు.సింగరేణి లో ఇటివలే ప్రకటించిన లాభాల్లో వాటా పై కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను తప్పు దోవ పట్టిస్తున్నాయని, వాటిని కార్మికులు ఎవరు నమ్మకూడదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిడికే 2వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్‌లో గోదావరిఖని భాస్కర్ రావు భవన్లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో లాభాల్లో వాటా హక్కు సాధించింది ఏఐటియుసి అని అన్నారు. 2000 సంవత్సరం నుంచి 10 శాతం వాటా మొదలు అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా, ఏ యూనియన్ ఉన్నా 33 శాతం వరకు గత 24 సంవత్సరాలుగా తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. గత కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం సంస్థ పరిస్థితి ప్రజలకు, కార్మికుల కు తెలియాలనే ఉద్దేశంతో కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టి సింగరేణి కి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన మొత్తం లాభాలు 4701 కోట్లు రాగా , కంపెనీ అవసరాలకు పోను మిగిలిన 2412 నికర లాభాల్లో 33శాతం అక్టోబర్ 7న 796 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు ఆయన 2009 నుండి 2024 వరకు ఉన్న వాస్తవ లాభాలు, నికర లాభాలు ఎంతొ చార్ట్ ద్వారా కార్మికుల కు చూపెదుతూ వివరించడం జరిగింది. ఏఐటియుసి నాయకులు వై.వి.రావు, ఎల్లా గౌడ్, రాంచందర్, అక్బర్ అలీ, పోషం, రవిందర్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, శంకర్, ఎం.ఎ.గౌస్, రామస్వామి, రవి, వెంకటయ్య, శంకర్, రెడ్డి వెంకట స్వామి, శంకరయ్య, రాజు, జే.దేవయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్, తిరుపతి, భాస్కర్, చేరాలు, కనకరాజు, మల్లేశ్, గంగారపు చెంద్రయ్య, సిర్ర మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలి

- అక్రమాలకు కేరాఫ్..రామగుండం నగరపాలక సంస్థ
- సిపిఐ నగర కార్యదర్శి కనకరాజ్

గోదావరిఖని,జనంసాక్షి:
రామగుండం నగరపాలక సంస్థకు ఐఏఎస్ అధికారిని కమిషనర్ గా నియమించాలని సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. నగరపాలక సంస్థ అంటేనే అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని,అలాగే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆయన అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని అనేక డివిజన్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ముఖ్యంగా రోడ్లు డ్రైనేజీల వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆరోపించారు. వందల కోట్ల నిధులతో రామగుండం నగరపాలక సంస్థలు అభివృద్ధి పనులు చేపట్టి సుందరీకరిస్తామని ప్రజాప్రతినిధులు గొప్పలు చెబుతూనే ఉన్నారని కానీ నగరపాలక సంస్థలోని అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉందని అన్నారు. గతంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి సస్పెం డ్ కూడా చేశారని తెలిపారు.రామగుండం నగరపాలక సంస్థకు కమిషనర్ గా రావా లంటేనే అధికారులు జంకుతున్నారని ఒకవేళ వచ్చిన



ఇక్కడ ప్రజా ప్రతినిధుల,కాంట్రాక్టర్ల ఒత్తిడిని తట్టుకోలేక తట్టా, బుట్టా సర్దుకొని వెళ్ళిపోతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఐఏఎస్ అధికారి కమిషనర్ గా వస్తేనే ఇక్కడ అవినీతి అక్రమాలను రూపుమాపి సరైన పాలన ప్రజలకు అందుతుందని ఆయన అన్నారు. శానిటేషన్ ఇంజనీరింగ్ విభాగాలే కాకుండా ప్రతి శాఖలో అవినీతి రాజ్యమేలుతుందని, డిజిల్ కుంభకోణం వాహనాల కొనుగోలు అక్రమాలు స్క్రాప్ మాయమైన విధానంలో సాచివేత దోరణి ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి నగర పాలక సంస్థలో నలుమూలల వ్యాపించిదని ఆరోపించారు. 2020లో ఐఏఎస్ అధికారి ఉదయ్ కుమార్ కమిషనర్ గా వచ్చిన తర్వాత నగరపాలక సంస్థ పాలన కొంతవరకు గాడిలో పడిందని ఆరు నెలలకే ఆయనను బదిలీ చేశారని తెలి పారు.నగరపాలక సంస్థ సరియైన విధంగా ప్రజలకు జవాబుదారీతనంగా పనిచే యాలంటే ఐఏఎస్ అధికారిని కమిషనర్ గా యుద్ధ ప్రాతిపదికన నియమించాలని ఇట్టి విషయంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ చొరవ చూపాలని ఆయన కోరారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

**కల్దుర్కి మహాజన సమావేశంలో తీర్మానం**

బోధన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :
ఎలాంటి షర్టులు లేకుండా రైతులకు రుణ మాఫీ చేయాలని బోధన్ మండలం కల్దుర్కి మహాజన సమావేశంలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శుక్రవారం కల్దుర్కి సహకార సంఘం మహాజన సభ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ గింజుపల్లి శరత్ అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు 2023 - 24 సంవత్సరంకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల గురించి రైతులకు చదివి వినిపించడం జరిగింది. రుణమాఫీ కానీ రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అయ్యేలా కృషి చేయాలని కోరారు. సంఘం ద్వారా సోయాబీన్ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, సంఘం ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాకు ఏర్పాటు చేసి



మద్దతు ధర ద్వారా కొనుగోలు చేసి, ప్రతీ క్వింటాలుకు 500 రూ బోనస్ ఇవ్వాలని చేసిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస చారి, సొసైటీ వైస్ చైర్మన్ రమేష్ పటేల్, సొసైటీ డైరెక్టర్లు మాధవరావు, రఘునాథ్ రావు, హనుమాబాయి రాము, పర్వయ, మక్దూంబేగ్, అశోక్ పటేల్, సంఘ సభ్యులు, సంఘ సిబ్బంది విశ్వనాథ్, సాయి, రాము, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ రక్షణమంత్రికి జపాన్ పగ్గాలు

అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. దీంతో వచ్చేవారం ఇషిబా దేశ 102వ ప్రధానమంత్రి గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఎల్‌డీపీ పార్టీ అధ్యక్షుడిగా 2021లో కిషిద ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆయన మూడేళ్ల పదవీకాలం ఈ సెప్టెంబరుతో ముగుస్తుంది. దీంతో పార్టీకి అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అవినీతి ఆరోపణల దృష్ట్యా కిషిద ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలోనే పార్టీ అధినాయకత్వ పదవికి 9 మంది పోటీపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఎల్‌డీపీ పార్లమెంట్ సభ్యులతో పాటు దాదాపు 10లక్షల మంది పార్టీ సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కౌంటింగ్ చేపట్టి ఇషిబా విజయం సాధించినట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రధాని కిషిద ఆయన మంత్రివర్గం అక్టోబరు 1న రాజీనామా చేయనుంది. అనంతరం ఇషిబా నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకానుంది. తదుపరి ప్రధానిగా ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. వచ్చే ఏడాది జపాన్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుత ప్రధాని కిషిద.. పార్టీ కార్యక్రమాలకు టికెట్లు విక్రయించి రాజకీయ నిధులను సేకరించి కుంభకోణానికి పాల్పడ్డారని, ఇందులో 80కుపైగా ఎల్‌డీపీ చట్టసభ సభ్యుల భాగస్వామ్యం ఉందంటూ గతంలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పరిణామాలతో పార్టీలో, ప్రజల్లో ఆయన మద్దతు పడిపోతూ వస్తోంది. దీంతో కిషిద తన కేబినెట్‌లో పలువురు మంత్రులను, పార్టీ కార్యనిర్వాహక సభ్యులను పదవుల్లోంచి తొలగించారు. ఆపై రాజకీయ నిధుల నియంత్రణ చట్టాన్ని కఠినతరం చేస్తూ కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. అయినా కిషిదకు ప్రజాదరణ తగ్గిపోవడంతో ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైంది. దీంతో వచ్చే సాధారణ ఎన్నికల్లో కొత్త వ్యక్తులను బరిలో దింపే అవసరం ఎంతో ఉందని ఎల్‌డీపీ సభ్యులు ఆయనను కోరినట్లు సమాచారం.

## నిఖార్సైన పేసర్‌గా..
# ఆకాశ్ దీప్




ఏ రంగంలోనైనా సరే అవకాశాలు అంత తేలికగా రావు. కొన్నిసార్లు నెలలకొద్దీ.. సంవత్సరాలకొద్దీ నిరీక్షించాల్సి ఉంటుంది. ఇక గట్టి పోటీ ఉండే భారత జట్టులో అయితే చాన్స్ రావడమే గగనం. అందుకని జట్టులోకి వచ్చినప్పుడే స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఈ విషయం బాగా తెలిసిన యువ పేసర్ ఆకాశ్ దీప్ ఇప్పుడు అదే చేస్తున్నాడు. అంతర్జాతీయంగా మూడంటే మూడు టెస్టుల అనుభవంలోనే కెప్టెన్ రోహిత్ శర్మ నమ్మకాన్ని సంపాదించాడు ఆకాశ్. కొత్త బంతితో నిప్పులు చెరుగుతూ నిఖార్సైన పేస్ బౌలర్ కొరతను తీరుస్తున్నాడు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాపై ఒత్తిడి తగ్గిస్తూ జట్టులో పాతుకుపోతున్నాడు. నిలకడగా రాణిస్తున్న ఆకాశ్ నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికవ్వడం పక్కా అనిపిస్తోంది. అదే జరిగితే పేసర్లు మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్‌లకు తుది జట్టులో స్థానం కోసం అతడు గట్టి పోటీగా మారుతాడని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

దేశవాళీలో అద్భుతమైన గణాంకాలతో ఆకాశ్ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రాంచీ టెస్టులో అరంగేట్రం చేసిన ఈ బెంగాల్ స్పీడ్‌స్టర్ పదకొండో బంతికే తొలి వికెట్ సాధించాడు. ఆ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన ఆకాశ్ ఇప్పుడు బంగ్లాదేశ్‌పై చెలరేగిపోతున్నాడు. చెపాక్ వేదికగా జరిగిన తొలి టెస్టులో(2/19) అద్భుత ప్రదర్శనతో కెప్టెన్ రోహిత్ శర్మ నమ్మకాన్ని నిలబెట్టిన ఆకాశ్.. కాన్పూర్ టెస్టులోనూ ఆదిలోనే రెండు వికెట్లతో శుభారంభమిచ్చాడు. మరోవైపు సిరాజ్ లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను కట్టడి చేస్తున్నా వికెట్ తీయలేకపోయాడు. ఆకాశ్ మాత్రం తెలివిగా బంగ్లా క్రికెటర్లను బోల్తా కొట్టించి జస్ప్రీత్ బుమ్రా తర్వాత వికెట్ టేకింగ్ పేసర్‌గా పేరు తెచ్చుకుంటున్నాడు. ఇంకేముంది.. స్వదేశంలో న్యూజిలాండ్.. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఆకాశ్ భారత జట్టుకు తురుపుముక్క అవుతాడని కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్‌లు భావిస్తున్నారు. ఆకాశ్ కంటే ముందు ముకేశ్ కుమార్, ప్రసిధ్ కృష్ణలకు సెలెక్టర్లు అవకాశమిచ్చారు. కానీ, వాళ్లు సద్వినియోగం చేసుకోలేదు. ప్రసిధ్ అయితే తరచూ గాయాల పాలవుతున్నాడు. ముకేశ్ కేవలం రంజీ , టీ20 స్పెషలిస్ట్‌గా రాణిస్తున్నాడంటే. ఆకాశ్ అలా కాదు. తన రంజీ అనుభవాన్ని ఉపయోగించి విజయవంతం అవుతున్నాడు. దాంతోఅదే జరిగితే.. మూడో పేసర్‌గా షమీ(అప్పటివరకూ ఫిట్‌నెస్ సాధిస్తే), సిరాజ్ మియాల మధ్య పోటీ నెలకొంటుంది. నవంబర్ 22న భారత్, ఆస్ట్రేలియాల మధ్య తొలి టెస్టు జరుగనుంది. 1992 తర్వాత తొలిసారి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌గా ట్రోఫీని నిర్వహించనున్నారు. వరుసగా రెండు పర్యాయాలు 2018, 2021లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ అందుకున్న భారత్ హ్యాట్రిక్ కొట్టాలనే పట్టుదలతో ఉంది.

### వరుస విషాదాలతో వెనక్కి..

భారత జట్టుకు ఆడాలనే కలల ప్రయాణంలో 27 ఏండ్ల ఆకాశ్ ఎన్నో కష్టాలు భరించాడు. అసలు అతడికి క్రికెట్ మీద ఇష్టం ఎలా పెరిగిందంటే?.. ఆకాశ్ దీప్ సొంతూరు బిహార్‌లోని ససారాం. అతడి తండ్రి రాంజీ సింగ్ ఓ స్కూల్ టీచర్. దాంతో, ఆయన కొడుకును చదువుపై దృష్టి పెట్టాలని పదే పదే చెప్పేవాడు. కానీ, అకాశ్‌కు క్రికెటర్ అవ్వాలనే కోరిక ఉండేది. 2007లో టీ20 వరల్డ్ కప్‌ను టీవీలో చూశాక ఆ కోరిక మరీ ఎక్కువైంది. ఆకాశ్ 2010లో దుర్గాపూర్‌లోని తమ అంకుల్ ఇంటికి వెళ్లాడు. అక్కడ క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొని స్థానిక అకాడమీలో బ్యాటర్‌గా చేరాడు. అతడిని గమనించిన కోచ్‌లు బౌలర్‌గా రాణిస్తావని చెప్పారు. అలా.. బౌలింగ్ మీద ఫోకస్ పెట్టిన ఆకాశ్ జీవితం తండ్రి, కొన్ని రోజులకే ఆకాశ్ సోదరుడు మరణంతో ఒక్కసారిగా తలకిందులైంది.

ఈ రెండు విషాదాల కారణంగా ఆకాశ్ మళ్లీ సొంతూరుకు వెళ్లిపోయాడు. అక్కడితో క్రికెటర్ అవ్వాలనే తన కల కలగానే మిగిలిపోతుందనే బాధ అతడిని వెంటాడింది. అయితే.. మూడేండ్ల తర్వాత అంకుల్ చొరవతో ఆకాశ్ బెంగాల్‌లోని యునైటెడ్ క్లబ్‌లో చేరాడు.

అక్కడ బెంగాల్ పేర్ రనదేవ్ బోస్ కంట్లో పడ్డాడు. రనదేవ్ శిక్షణలో రాటుదేలిన ఆకాశ్ బెంగాల్ అండర్-23 జట్టుకు ఎంపికయ్యాడు. అంతలోనే వెన్నెముక గాయం కావడంతో అతడి సంతోషం లో ఆవిరైంది. ఆ కష్ట సమయంలో బెంగాల్ కోచ్ సౌరాశిష్ లహిరి అండగా నిలవడంతో ఆకాశ్ తొందరగా కోలుకుని మళ్లీ బౌలింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు.

### నిలకడైన ప్రదర్శనతో..

రాణించిన ఆకాశ్ 2019లో బెంగాల్ రంజీ జట్టుకు సెలెక్ట్ అయ్యాడు. రంజీల్లో అద్భుత ప్రదర్శన చేసిన ఆకాశ్ దీప్‌ను 2021 ఐపీఎల్ వేలంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొన్నది. అక్కడితో ఆకాశ్ జీవితం మారిపోయింది. ఆ వెంటనే అతడు 2022లో ఆసియా క్రీడల జట్టుకు ఎంపికయ్యాడు.

### తల్లితో సంతోషం పంచుకుంటూ..

**అనంతరం రంజీల్లో నిలకడైన ప్రదర్శనతో ఆకాశ్ జాతీయ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. రాంచీ టెస్టుకు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చి.. తన టెస్టు కలను నిజం చేసుకున్నాడు. రాంచీ మైదానంలో కోచ్ రాహుల్ ద్రవిడ్ చేతుల మీదుగా డెబ్యూ క్యాప్ అందుకున్న ఆకాశ్ అనంతరం తల్లి లద్దుమా దేవీ పాదాలకు నమస్కరించాడు.**

# కాన్పూర్ టెస్టుకు వర్షం బ్రేక్



చెన్నై: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న కాన్పూర్ టెస్టులో మొదటి రోజు కేవలం 35 ఓవర్లు మాత్రమే బౌల్ చేశారు. వర్షం పడటం వల్ల ఆట నిలిచిపోయింది. తొలుత టాస్ గెలిచిన ఇండియా బౌలింగ్ ఎంచుకున్నది. మొదటి రోజు 35 ఓవర్లలో బంగ్లాదేశ్ మూడు వికెట్ల నష్టానికి 107 రన్స్ చేసింది. మోమినుల్ హక్ 40, ముష్ఫికిర్ రహీమ్ 6 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు. భారత బౌలర్ ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీసుకున్నాడు. ఇవాళ పిచ్ చిత్తడిగా ఉండడంతో.. తొలి సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. అయితే లంచ్ తర్వాత కూడా మరోసారి వర్షం వల్ల ఆటకు బ్రేక్ అయ్యింది. ఇక మధ్యాహ్నం తర్వాత ఆటకు వాతావరణం అనుకూలించక పోవడంతో.. తొలి రోజు ఆటను నిలిపివేశారు. బంగ్లా బ్యాటర్లలో ఇస్లామ్ 24, శాంతో 31 రన్స్ చేశారు.

**బంగ్లాదేశ్ 74/2.. రెండు వికెట్లు తీసిన ఆకాశ్**

కాన్పూర్: కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మొదటి ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ భోజన విరామ సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 74 రన్స్ చేసింది. శాంతో 28, మొమినుల్ 17 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీసుకున్నాడు. తొలుత టాస్ గెలిచిన ఇండియా .. ముందుగా బౌలింగ్ ఎంచుకున్నది. బంగ్లా ఓపెనర్ జాకిర్ ఆరంభంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. భారత బౌలర్ల ధాటికి అతని పరుగులు చేయలేకపోయాడు. జాకిర్ డకౌట్ కాగా, మరో ఓపెనర్ ఇస్లామ్ 24 రన్స్ చేసి ఔటయ్యాడు. ప్రస్తుతం కాన్పూర్‌లో వర్షం పడుతోంది. దీంతో పిచ్‌ను కవర్లతో కప్పేశారు.

## సిరాజ్‌ను దూషించిన బంగ్లాదేశ్ సూపర్ ఫ్యాన్

క్రికెట్ అనే కాదు ప్రతి ఆటలో ఓ జట్టుకు 'సూపర్ ఫ్యాన్స్' ఉంటారు. తమ టీమ్ ఎక్కడ ఆడినా సరే సదరు అభిమానులు స్టాండ్స్‌లో ప్రత్యక్షమై నానా హంగామా చేస్తారు. తమ దేశపు జెండా రంగులు లేదా భిన్నమైన వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. అయితే.. కొన్నిసార్లు వాళ్లకు ఇతర అభిమానుల నుంచి ప్రమాదం పొంచి ఉంటుంది. తాజాగా అలాంటి సంఘటనే జరిగింది. బంగ్లాదేశ్ జట్టు సూపర్ ఫ్యాన్.. అదేనండీ 'టైగర్ రాబీ' అనూహ్యంగా దవాఖాన పాలయ్యాడు. కాన్పూర్‌లో భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య రెండో టెస్టు జరిగింది. దాంతో, టైగర్ రాబీ.. ఎప్పటిలానే పులి వేషధారణను తలపించేలా డ్రెస్ వేసుకొని.. ముఖానికి పసుపు రంగు. అక్కడక్కడా నలుపు రంగును చారలుగా రుద్దుకొని స్టేడియంలోకి వచ్చాడు. అయితే.. ఏమైందో తెలియదు తొలిరోజు స్టాండ్స్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను కాసేపు ఉత్సాహపరిచాడు. ఎందుకనో తెలియదు తన నోటికి పని చెబుతూ.. బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌ను దూషించాడు. దాంతో, చిర్రెత్తు కొచ్చిన ఇండియన్ ఫ్యాన్స్ బంగ్లా వీరాభిమానికి తమ స్టయిల్లో బుద్ధి చెప్పారు. మా క్రికెటర్‌నే తిడతావా? అంటూ టైగర్ రాబీని దారుణంగా కొట్టారు.

## బ్రేకిచ్చానంతే.. మళ్లీ తుపాకీ పడుతున్నా!




ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన షూటర్ మను భాకర్ బ్రేక్‌ను ఆస్వాదిస్తోంది. ఇష్టమైన ఫుడ్ తింటూ.. పలు బ్రాండ్‌లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ విరామాన్ని తనకు నచ్చినట్టుగా గడుపుతోంది. విశ్వ క్రీడల అనంతరం మూడు నెలల విరామం తీసుకున్న మను షూటింగ్ వరల్డ్ కప్ ఫైనల్ పోటీలకు దూరమైంది. దాంతో, ఆమె ఎక్కడికి వెళ్లినా మళ్లీ తుపాకీ పట్టేది ఎప్పుడు? అని అడుగుతున్నారు. దాంతో, ఎట్టకేలకు ఒలింపిక్ విజేత సమాధానం ఇచ్చింది. త్వరలోనే తాను పోటీలకు సిద్ధమవుతానని మను చెప్పింది.

ఒలింపిక్స్ పతకం కోసం సుదీర్ఘ సాధన చేసిన మను తన కల నిజం చేసుకుంది. కోచ్ జస్పాల్ రాణా శిక్షణలో రెండు కాంస్యాలతో చరిత్రను తిరగరాసింది. ఆ తర్వాత 3 నెలల విరామం తీసుకున్న ఆమె తన పునరాగనంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'ఒలింపిక్ పతకం గెలిచాక నీ జీవితంలో ఏమారింది? అని చాలామంది నన్ను అడుగుతున్నారు. వాళ్లకు నేను చెప్పేది ఏంటంటే.. ఏమీ మారలేదు. నేను పాత మనునే. కాకపోతే బ్రేక్‌ను ఎంజాయ్ చేస్తున్నా. నవంబర్‌లో మళ్లీ నేను షూటింగ్ సాధన మొదలు పెడతాను. మీ ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు' అని మను తన వీడియో పోస్ట్‌లో వెల్లడించింది. ఈమధ్య మను భాకర్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇంటర్వ్యూలు, ఫంక్షన్లు.. ఇలా ఎక్కడికి వెళ్లినా సరే పారిస్‌లో సాధించిన రెండు కాంస్య పతకాలను మనూ తన వెంట తీసుకెళ్లడంపై ఆన్‌లైన్‌లో కొందరు ట్రోల్ చేశారు. అయితే. అందుకు మను అవి దేశం కోసం సాధించిన పతకాలు. నన్ను షోలకు, ఇంటర్వ్యూలకు ఆహ్వానించే వాళ్లు ఆ మెడల్స్‌ను తీసుకు రావాలని అడుగుతున్నారు. అక్కడ వాళ్లంతా ఎంతో సంతోషంగా నాతో సెల్ఫీలు దిగుతున్నారు అని మను విమర్శకులకు చెక్ పెట్టింది.

## షకీబ్ భద్రత మా చేతుల్లో లేదు: బంగ్లా క్రికెట్ బోర్డు



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్.. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తన స్వంత దేశంలో చివరి సారి ఓ టెస్టు మ్యాచ్ ఆడాలన్న ఆశ ఉన్నట్లు కూడా తన రిటైర్మెంట్ సందర్భంగా చెప్పాడు. కానీ షకీబ్ భద్రత కల్పించే అంశం తమ చేతుల్లో లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రెసిడెంట్ ఫారూకీ అహ్మద్ తెలిపారు. షకీబ్‌పై దేశంలో కేసు నమోదు అయ్యిందని, అయితే అతనికి వ్యక్తిగత భద్రతను కల్పించలేమని ఫారూక్ అహ్మద్ వెల్లడించారు. 37 ఏళ్ల షకీబ్ గురువారం టీ20లకు గుడ్‌బై తెలిపాడు. ఈ నేపథ్యంలో అతను అక్టోబర్‌లో స్వదేశంలో జరిగే టెస్టులో ఆడాలన్న కాంక్షను వెల్లడించాడు.

షకీబ్‌కు భద్రత కల్పించే బాధ్యత బోర్డు పరిధిలో లేదని, ఓ వ్యక్తికి వ్యక్తిగత భద్రత బోర్డు కల్పించలేదని, అతనే దీనిపై నిర్ణయం తీసుకోవాలని, అతనికి భద్రత కల్పించే అంశం ప్రభుత్వ ఉన్నత స్థాయి నుంచి రావాలని ఫారూకీ తెలిపారు. బంగ్లా క్రికెట్ బోర్డు సెక్యూర్టీ ఏజెన్సీ కాదు అని, అది రాపిడ్ యాక్షన్ బెటాలియన్ కాదు అని, ప్రభుత్వంలో ఎవరితోనూ ఈ అంశం గురించి మాట్లాడలేదని, అతని కేసు కోర్టు పరిధిలో ఉందని, అందుకే ఏమీ చేయలేమని బోర్డు చీఫ్ తెలిపారు.

జూలై, ఆగస్టు నెలల్లో బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్లలో షకీబ్ పై మర్డర్ కేసు నమోదు అయ్యింది. షేక్ హసీనా పార్టీకి చెందిన ఎంపీ కావడం వల్ల అతనిపై కేసు బుక్ చేశారు. ఒకవేళ తనకు ఫేర్‌వెల్ మ్యాచ్‌ను ఆర్గనైజ్ చేయకుంటే, అప్పుడు కాన్పూర్ టెస్టే చివరిది అవుతుందని షకీబ్ తెలిపాడు.

## గంభీర్ వారసుడిగా
# విండీస్ దిగ్గజం

టీ20లకు వీడ్కోలు పలికిన విండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావోకు బంపరాఫర్ వచ్చింది. రిటైర్మెంట్ రోజే అతడు ఇండియన్ ప్రీమియర్ లీగ్ జట్టుకు మెంటర్‌గా ఎంపికయ్యాడు. అది కూడా ఈ ఏడాది గౌతం గంభీర్ ఆధ్వర్యంలో కప్ కొట్టిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు. ఈ విషయాన్ని శుక్రవారం కోల్‌కతా యాజమాన్యం అధికారికంగా వెల్లడించింది. బ్రావో కూడా కోల్‌కతా మెంటర్‌గా పనిచేసేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నానని అన్నాడు.

నేను గత 10 ఏండ్లుగా కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రిన్‌బగో నైట్ రైడర్స్‌కు ఆడాను. వివిధ లీగ్స్‌లో నైట్ రైడర్స్ జట్టు తరఫున కొన్నిసార్లు, ఆ జట్టుకు ప్రత్యర్థిగా కొన్ని పర్యాయాలు ఆడాను. కోల్‌కతా ఫ్రాంచైజీ పనితీరు అంటే నాకు చాలా గౌరవం. క్రికెట్ అంటే వాళ్లకున్న అమితమైన ఇష్టం, నిర్వహణ విధానం, కుటుంబం లాంటి వాతావరణం ఇవన్నీ చాలా బాగుంటాయి.




## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధనకు తన పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు తన పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ కొమరంభీం జిల్లా, వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించాడు. 1938లో తాను మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడే హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరి పౌర హక్కుల ఉద్యమం, వందేమాతర ఉద్యమం, ఆంధ్ర మహా సభల్లో క్రియాశీలక పాత్ర పోషించి పలువురు జాతీయ నాయకుల దృష్టిని ఆకర్షించారు. సహకార చట్టంలో అనేక మార్పులను తీసుకువచ్చి సహకార సంఘాల ద్వారా బడుగు, బలహీన వర్గాల బలోపేతానికి కొండా లక్ష్మణ్ బాపూజీ కృషి చేశారని, స్వరాష్ట్రంగా తెలంగాణ వచ్చేవరకు తాను ఎలాంటి పదవులను చేపట్టబోనని ప్రతిజ్ఞ చేశారని, 90 సంవత్సరాల వయసులోను సైతం ఆయన ఎలాంటి భయం లేకుండా రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. నివాళులర్పిస్తూ కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను నేటి యువతి, యువకులకు అందరికి తెలియాలన్నారు. నేటి యువతకు ఆయన పోరాటలు, త్యాగాలను సైతం తెలుకోవడంలో ప్రాధాన్యత చూపాలన్నారు. త్యాగాలకు మరో పేరైన కొండా లక్ష్మణ్ బాపూజీ గురించి అందరికీ తెలియజేయడంతోపాటు ఆనాడు పోరాటాలు చేసిన ఉద్యమకారుల గురించి కూడా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ పరిపాలనా అధికారి సునీల్ నాతాని, వెనుకబడిన తరగతుల వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డి.కేషురాం, తెలంగాణ రాష్ట్ర బిసి ఫ్రెంట్ చైర్మన్ గౌరిగే మల్లేష్ యాదవ్, బిసి ప్రజా సంఘాల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిచ్కుంద కేంద్రంగా
# గుట్కా దందా

- కర్నాటక నుంచి తెప్పించి గ్రామాల్లోకి సరఫరా
- మండల కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడి ప్రధాన సూత్రధారి!?
- అతని వెనుక అండగా ఓ 'పెద్ద' తలకాయ...?




### ప్రజల ప్రాణాలతో చెలగాటం.. లక్షల్లో వ్యాపారం



*కర్ణాటక బార్డర్ బిచ్కుంద కేంద్రంగా గుట్టుగా గుట్కా దందా సాగుతోంది. కొన్నాళ్లుగా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి అక్రమార్కుల పనిపడుతున్నప్పటికీ.. కండ్లుగప్పి కొందరు గుట్కా వ్యాపారులు గ్రామాల్లోకి యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. ఓ రాజకీయ నేత ప్రోద్బలంతోనే ఈ దందా సాగుతున్నట్టు ఆరోపణలు గుప్పమంటున్నాయి. అసలు సూత్రధారి, పాత్రధారి కిరాణ అసోసియేషన్ అధ్యక్షుడు కాగా.. ఆయనకు కొందరు 'పెద్దల' అండ ఉన్నట్టు స్థానికులు గుసగుసలాడుకోవడం గమనార్హం..!!*

**బిచ్కుంద, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని బిచ్కుంద మండలకేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా భారీ అక్రమ గుట్కా రవాణా జరుగుతున్న విషయం బహిరంగ సత్యమే. గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చనే నిబంధనలున్నాయని బిచ్కుంద కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడే చెబుతూ మూడుపువ్వులు ఆరుకాయలుగా తన వ్యాపారం కొనసాగిస్తుండటం నివ్వెరపరుస్తోంది. ఈ దందాకు సహకరిస్తున్న కొందరు 'పెద్దల'కు చేతులు తడుపుతూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలు వివరాల్లోకెళ్తే.. కొన్ని లక్షల విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయించేందుకు బిచ్కుంద మండలం కేంద్రబిందువుగా మారింది. కిరాణ అసోసియేషన్ అధ్యక్షుడితో కలిసి కొందరు అక్రమ రవాణాకు తెరలేపారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, ఔరాద్ నుండి ఐచర్ బండిలో భారీ మొత్తంలో గుట్కా ప్యాకెట్లు తెప్పించి వాటిని ఎక్కడికక్కడ చేరవేస్తున్నట్టు తెలిసింది. ఈ తతంగంలో ఓ వ్యక్తి మండల కేంద్రం నుంచి తెల్లవారుజామున వాహనంలో భారీమొత్తంలో గుట్కా ప్యాకెట్లను డోంగ్లీ, బీర్కూర్, బోధన్ తీసుకెళ్తున్నట్టు సమాచారం. వారంలో రెండుసార్లు జుక్కల్ నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల మండలాలకు తరలిస్తున్నారు. మద్నూర్, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్ తదితర మండలాలతో బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని బీర్కూర్, నస్రుల్లాబాద్‌కు కూడా సరఫరా చేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం రోజున హజ్గుల్ పరిసర ప్రాంతంలో పోలీసులు సదరు వాహనాన్ని పట్టుకున్నారు. ఆ వాహనంలో 10 లక్షలకు పైచిలుకు ఖరీదు చేసే గుట్కా ప్యాకెట్లు ఉంటాయని కిరాణా అసోసియేషన్ సభ్యులే చర్చించుకోవడం గమనార్హం. అయితే వాహనాన్ని, అందులోని సరుకు స్వాధీనం చేసుకున్న పోలీసులు మాత్రం 4 లక్షల విలువ గల ప్యాకెట్లు ఉన్నట్టు తెలియజేశారు.

అయితే గురువారం తెల్లవారుజామున 7 గంటల ప్రాంతంలో పట్టుకున్న ఆ వాహనం నిండా ప్యాకెట్ బాక్సు లుండగా.. ఆరోజు రాత్రి వరకు ఆ వాహనంలో సగమే సరుకు కనిపించ డం తీవ్ర అనుమానాలకు దారితీసింది. ఉదయం వాహనం పట్టుబడితే అదేరోజు రాత్రి 10 గంటలకు వివరాలు వెల్లడించడం గమనార్హం. ఈ విషయమై కిరాణా అసోసియేషన్‌లోని కొందరు సభ్యులు.. ఈ వ్యాపారం నిత్యకృత్యంగా మారిందని, అందరికీ తెలిసే జరుగుతోందని గుసగుసలాడు కోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ నాయకులు, కొందరు ప్రభుత్వ అధికారులే దీనికి సహకరిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే దీనికి అడ్డుకట్ట వేయాలని, అక్రమార్కుల పట్ల పోలీసులు ఉక్కుపాదం మోపాలని బిచ్కుంద మండల ప్రజలు కోరుతున్నారు.

### నిర్ధారించి కఠినంగా వ్యవహరిస్తాం : నరేస్, బిచ్కుంద సీఐ



పాన్ మసాలాలు అమ్ముతున్నామని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఆ పేరిట గుట్కా అమ్మినట్టు తెలిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సిఫార్సు చేసి అసలు విషయాలపై ఆరా తీస్తాం. గుట్కాగా నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోం..!

## హైడ్రా పేరుతో హైడ్రామా ఆడుతున్న ప్రభుత్వం :ఎంపి ఈటల



**ఎల్‌బినగర్ ఆగష్టు 27(జనం సాక్షి ) :** హైడ్రా బాధితుల కోసం మద్దత్తు గా కొత్తపేటలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ధర్నాకు దిగారు. చట్ట ప్రకారం డబ్బులు కట్టి అనుమతులు తీసుకొని ఇల్లు నిర్మించు కొన్న వారి ఇల్లు కులుస్తామని నోటీసులు హైడ్రా ఇవ్వడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. మూసి నీరు వల్ల మాకు ఇలాంటి ఇబ్బంది రాలేదని అలాంటిది మాకు నోటీసులు ఎందుకు ఇస్తున్నారని బాధితులు ప్రశ్నిస్తున్నారని వారు పేరుకొన్నారు. గత పాలకులకు ఈ విషయాలు తెలియవా సి ఎం రేవంత్ రెడ్డి కే తెల్సినట్టు కొత్తగా గుర్తించి నట్టు... ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు.. అభివృద్ధి మాన వీయా కోణం లో ఉండాలి తప్ప నిరంకుశత్వమ్ లా ఉండకూడదని ఈటల పేరు కొన్నారు. డబుల్‌ఆ బెడ్ రూమ్స్‌ఎక్కడ నో ఇస్తే మేము అక్కడ పోయి ఎలా బ్రతుకు తాం అని వారు ప్రశ్నిన స్తున్నారని వారు పేరుకొన్నారు అరు గ్యారంటీ లు అమలు చేయడంచాత కాకా ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ధర్నాలో నాయకులు సామ రంగారెడ్డి కొత్త రవీందరుగౌడ్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గీతా రెడ్డి హైడ్రా బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో హైడ్రాకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్27(జనంసాక్షి) :** రాజేంద్రనగర్ అత్తాపూర్ మూసీ నది పరివాహ ప్రాంతంలో గురువారం నుంచి అధికారులు సర్వే నిర్వహిస్తున్నా, మరోవైపు బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా నగరంలో హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం పట్ల అత్తాపూర్ మూసి నది పరివాహక ప్రాంతంలోని కాలనీ వాసులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు ముఖ్యమంత్రి తీరుకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తాము దశాబ్దాలుగా ఇంటి పన్ను కట్టి ఇక్కడ ఉంటున్నామని, రూపాయి రూపాయి కూడా గట్టి ఇల్లు నిర్మించుకుంటే మూసీ పరిధిలోకి వస్తుందని సర్వేలు చేయటం ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని కాలనీవాసులు హెచ్చరిస్తూ మూసీ నీ ఆనుకొని ఉన్న రోడ్డు నుంచి అత్తాపూర్ బ్రిడ్జి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ ప్రెసిడెంట్లు, భాజపా నాయకులు మల్లారెడ్డి, కొమురయ్య, విజయ్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, కాలనీవాసులు మ్యడం మధు, నవీన్ కుమార్, రమేష్ గుప్తా, రోహిత్ గుప్తా పాల్గొన్నారు.



జనంసాక్షి www.janamsakshi.org | శనివారం 28 సెప్టెంబర్ 2024

# కొత్త ఒరవడి..

# ప్రజల కోసం గంటల తరబడి..

## ప్రజాపాలనలో విన్నపాలు వినవలె..!

- గాంధీభవన్‌లో సక్సెస్‌గా మంత్రులతో ముఖాముఖి
- పలు సమస్యలపై భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు
- 4 గంటల పాటు ప్రజల బాధలు విన్న మంత్రి ఉత్తమ్
- 320 అర్జీలు స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు





ప్రజాపాలనపై ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోంది. ప్రజలతో మమేకమై, వారిని భాగస్వాములను చేస్తూ పరిపాలన సాగించాలనే సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. పదేళ్లుగా సాలెగూడులా అల్లుకుపోయిన ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా చెరిపేస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలనే సదుద్దేశంతో యుద్ధప్రాతికదిక చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో నేరుగా సీఎం, మంత్రులను కలిసి తమ ఇబ్బందులను అర్జీ పెట్టుకోవచ్చంటూ సర్కార్ నిర్ణయించిన దరిమిలా ప్రజలకు ఎన్నడూలేనంత ఊరట లభించింది. 'గడీల' పాలనలో ఏండ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను గాంధీభవన్ వేదికగా పరిష్కరించుకునే వెసులుబాటు కలిగింది. స్వయంగా మంత్రులే వచ్చి గంటల తరబడి కూర్చొని ఒక్కొక్కరి బాధలు వింటూ వారికి భరోసా కలిగిస్తున్న పరిస్థితులు బాధితులకు ఎంతో బాసటగా నిలుస్తున్నాయి. ప్రతి బుధవారం, శుక్రవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమవగా పల్లెలు, పట్టణాల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు తరలివస్తుండటం గమనార్హం.

పాలకులు ప్రభువులమని, ప్రజలు పాలితులని లెక్కలేనితనంతో మంత్రుల నివాస సముదాయాలు గతంలో గడీలుగా మారిపోయిన వైనం ప్రజల్లో తీవ్ర అసహనానికి దారితీసిన పరిణామాలూ, వాటి పర్యవసానాలూ సర్వత్రా విదితమే..! 'ప్రజా పాలనలో బాధలు వింటాం.. కన్నీళ్లు తుడుస్తాం' అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఏకంగా మంత్రులను కూర్చోబెట్టి బాధితుల బాధలు వినే దృశ్యాలను ఆవిష్కరింపజేయడం పట్ల గాంధీభవన్ పరిసరాలు కరతాళ ధ్వనులతో మార్మోగుతున్నాయి. ప్రజలే పాలకులుగా అసలైన 'మార్పు'నకు తెలంగాణ సర్కార్ నాంది పలికిందంటూ అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి)



### ఓపికతో ఉండి పనులు చేసుకోవాలి



కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకు విశ్వాసం ఉంది. ఆ నమ్మకంతోనే ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు పెద్దఎత్తున వస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని పనులను వేగవంతం చేసి పరిష్కరిస్తాం. ఇది నిరంతర ప్రక్రియ. ప్రజలు ఎంతో ఓపికతో ఉండి పనులు చేసుకోవాలి. అందరి సమస్యలు పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రుల ముఖాముఖి నిర్వహించ తలపెట్టింది. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతుంది.

– మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ చీఫ్

### 320 అర్జీలు స్వీకరించిన మంత్రి ఉత్తమ్

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం శుక్రవారం నిర్వహించగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎంతో సహనంతో ప్రజలతో ముచ్చటించారు. మహిళలు, గర్భిణీలకు, తల్లులు, వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించారు. ఉదయం 11.30 గంటలకు గాంధీ భవన్‌కు చేరుకున్న ఆయన.. దాదాపు నాలుగు గంటల పాటు సామాన్యులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఎక్కువగా భూ సమస్యలు, 317 జీఓ బాధితులు, మల్లన్న సాగర్ ముంపు బాధితులు, సహారా, డీకేజెడ్ టెక్నాలజీ కంపెనీల బాధితులతో పాటు పెన్షన్, రేషన్ కార్డులు అంటూ పలు సమస్యలను ఉత్తమ్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అర్జీదారులకు మంత్రి ఉత్తమ్ హామీనివ్వడమేగాక, కొన్ని అంశాల్లో సంబంధిత అధికారులకు ఆ క్షణమే ఫోన్ చేసి పరిష్కరించాలని సిఫార్సు చేయడం బాధితులకు కొండంత విశ్వాసాన్నిచ్చింది. ఈ కార్యక్రమం ముగిసేవరకూ 320 వరకు అర్జీలు స్వీకరించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. త్వరలోనే రేషన్ కార్డులకు, హెల్త్ కార్డులకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. అందువల్ల ఆ సమస్యలపై వచ్చిన వారు ఆయా ప్రాంతాలలో ప్రత్యేక సమావేశాల్లో దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.





## కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా వెలిచాల రాజేందర్ రావు



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం రోజు ఎన్ను కున్నారు. అసోసియేషన్ చైర్మన్ గా వెలిచాల రాజేందర్ రావు ఎన్ని కయ్యారు. గురువారం రోజు కరీంనగర్లోని ప్రతిమ మల్టీప్లెక్స్ లో కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ, ఎలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, అబ్జర్వర్ గా ఈ రామ్ చందర్, స్పోర్ట్స్ అథారిటీ అబ్జర్వర్ గా, యోగా కోచ్ ఇ.కిష్టయ్య, ఒలంపిక్ అసోసియేషన్ నుంచి ఎన్.సిద్ధారెడ్డి అబ్జర్వర్ గా, ఎలక్షన్ ఆఫీసర్ గా చొప్పదండి పీడీ ఎ.కృష్ణ వ్యవహరించారు. ఇందులో ప్యాటరన్ గా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు, అధ్యక్షుడిగా చెన్నాడీ అమిత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సిహెచ్. సంపత్ రావు, వైస్ ప్రెసిడెంట్లుగా పి.అనూకర్ రావు, మల్లేష్ గౌడ్, ఎల్లా గౌడ్, సునీల్ రెడ్డి, సెక్రటరీగా బి.మల్లేష్ గౌడ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఆర్గనైజేషన్ సెక్రటరీగా సుధాకర్, టెక్నికల్ చైర్మన్ గా ఎన్.లక్ష్మీనారాయణ, రెఫరీ బోర్డు చైర్మన్ గా డి.వీరన్న, సంయుక్త కార్యదర్శిగా ఎ.పద్మ ను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గాన్ని ఎలక్షన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికపై క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## పేదల కన్నీళ్లతో ఆడుకుంటే పతనమే

- పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలి
- హైడ్రా పేరుతో సామాన్యులకు ఇక్కట్లు
- బాధితులకు అండగా నిలిచిన ఎంపి ఈటల రాజేందర్



హైదరాబాద్, సెప్టెంబర్27 (జనంసాక్షి) : హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ డ్రామాలు ఆడుతోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. పేదలను రోడ్డున పడేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఉంటున్న వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఆర్థిక మంత్రిగా చెబుతున్నాను... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. అప్పుల ఊబిలో రాష్ట్రం కురుకుపోయిందని అన్నారు. పేదల కన్నీళ్లతో ఆడుకుంటే రేవంత్ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని అన్నారు. హైడ్రా అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉంది.. ప్రభుత్వ భూమి కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ మూసీ పరిసర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ శుక్రవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... పేదలపై కనికరం లేకుండా రేవంత్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. జొన్నల బండ వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని కూడా కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం పనులు చేస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదు... కానీ ఎన్నడో భూమి కొన్న వారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని తెలిపారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామనడ భావ్యంకాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ ప్రాంతాల్లోకి ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదని తెలిపారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మినందుకు ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఖబడ్దార్ రేవంత్.. ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంపై నివేదిక ఇస్తామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చట్టాలు, జడ్జీల మీద నమ్మకం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణ రేవంత్ జాగిర్ కాదని... ప్రజలు ఓట్లు వేస్తే సీఎం అయ్యారన్న విషయం గుర్తుపెట్టుకుని మసలుకోవాలని ఈటల సూచించారు. ప్రజల మీద దౌర్జన్యం చేయడం సరికాదని అన్నారు. అవసరమైతే లక్షలాది మందితో రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని వార్నింగ్ ఇచ్చారు. హైడ్రా విషయంలో హైకోర్టుకు వెళ్తామని.. తాము చూస్తూ కూర్చోమని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేలా రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.



## వరంగల్ భద్రకాళి ఉత్సవాలకు సీఎంకు ఆహ్వానం

హైదరాబాద్/వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : వరంగల్ భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. దీంతో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానం చైర్మన్ శేషు, ఈవో శేషుభారతి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలు కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శ్రీ భద్రకాళీదేవి శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానాన్ని అందజేసారు. ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహా దారులు వేం నరేందర్ రెడ్డి గారు,భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శేషు భారతి తదితరులు ఉన్నారు.



## అడిషనల్ డీజీపీని కలిసిన రామగుండం సీపీ

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)

టీజీఎస్పి 13 వ బెటాలియన్, గుడిపేట మంచిర్యాల సందర్శనకు వచ్చిన అడిషనల్ డిజిపి బెటాలియన్స్ హైదరాబాద్, సంజయ్ కుమార్ జైన్ ని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్, ఐజి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుని పేరే పెట్టాలి

### పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డికి సోమనాథ కళా పీఠం విజ్ఞాపన!



పాలకుర్తి, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : తెలుగు విశ్వవిద్యాలయంకు తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుని పేరే పెట్టాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డికి సోమనాథ కళా పీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం పాలకుర్తిలో ఆమెకు ఒక వినతి పత్రాన్ని అందచేసింది. ఇందుకు ఝాన్సీ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు చెప్పి, తెలుగు విశ్వ విద్యాలయానికి సోమనాథుని పేరు పెట్టే విధంగా చూస్తానని ఆమె అన్నారు. విజ్ఞాపన అందించిన బృందంలో తాజా మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, సోమనాథ కళా పీఠం అధ్యక్షుడు డా. రాపోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డా. మార్గం లక్ష్మీ నారాయణ, దేవసాని కృపాకర్, పోగు శ్రీనివాస్, మారం శ్రీనివాస్, భారత శ్రీనివాస్, మార్గం సాయి సందీప్ తేజ తదితరులు ఉన్నారు.

## అనిల్ జాదవ్, సిరిసిల్ల రాజయ్యల వాగ్వివాదం



బోథ్ సెప్టెంబర్ 27(జనంసాక్షి) : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించందని ఇందులో భాగంగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటును అందించం దన్నారు. అనంతరం సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ తెలంగాణను ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని కానీ కొందరు తమ వల్లనే రాష్ట్రం ఏర్పడినదని చెప్తున్నారని పరోక్షంగా బిఆర్ఎస్ పార్టీ నీ ఉద్దేశించి మాట్లాడుతుండగా ఎమ్మెల్యే జోక్యం చేసుకొని రాజయ్యతో వారించారు. ఎందుకు పార్టీ ల గురించి మాట్లాడుతున్నావు అని రాజయ్యతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. రాజయ్య మాట్లాడుతూ నువ్వెందుకు మీ పార్టీ గురించి మాట్లాడినావు అని ఎదురు ప్రశ్న వేశారు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడున్న వారు ఒక్కసారి ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. నిర్వాహకులు ఇద్దరికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370